UNIVERSAL
LIBRARY
OU_204748
UNIVERSAL
LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T82/V46V Accession No T3711

Author వేంకటేశ్వర్లు.

Title వేమ సంస్కారి [illegible].

This book should be returned on or before the date last marked below

వేణీసంహారము

భట్టనారాయణుని

సంస్కృతనాటకమునకుఁ దెలుఁగుసేఁత

Checked 1965



82
141

బులుసు వేంకటేశ్వరులు, బి. ఏ.

ఆంధ్ర బుక్ హౌస్
సుల్తాన్ బాజారు
హైదరాబాదు దక్కన్.

వేణీసంహారము



కృతికర్త.

వేణీసంహారము

కృతికర్త.

ప్రతులకు :

బులుసు వేంకటేశ్వరులు, బి.ఏ.,

రామారావుపేట, కాకినాడ

అని వ్రాయునది.

*
* *

*

వెల మూఁడు రూపాయలు

*

సర్వస్వామ్యసంకలితము

1951

ఆంధ్రప్రచారిణీ ముద్రాక్షరశాల,
కాకినాడ.

అంకితము

౧

శ్రీగురుదేవదేవునకుఁ జిన్మయరూపున కాదిదేవనా
నాగమవేదికిన్ బరమహర్షికి నిర్జితకామికిన్ గృపా
శ్రీఘనరాశికిన్ సకలసిద్ధివశీకృతబాహుశాలికిన్
త్యాగగుణాబ్ధికిన్ బరమతత్త్వరహస్యున కాత్మవేదికిన్.

౨

నాకు సమస్త మైనయతినాథునకున్ బరమాత్మఁ గన్న సు
శ్లోకునకున్ జగద్విహితశుద్ధచరిత్రున కాదిదేవతే
జోకమనీయరూపునకు సూనృతనిష్ఠునకున్ సమస్తశో
భాకృతికిన్ జగద్భరితపావనతేజున కాత్మమూర్తికిన్.

౩

ఆర్షకులాభిజాతునకు నార్షగుణోదధికిన్ నిరంతరా
కర్షితభక్తభక్తునకు గానకళాకమనీయవేదికిన్
హర్షసమున్నతాత్మున కనంతకృపానిధికిన్ మహర్షి కా
ర్యర్షికి జ్ఞానవర్షి కిది యంకిత మౌత! సభక్తికంబుగన్.

౪

ఆముఖపద్మమందుఁ బరమాత్మ నిరంతరగోచరంబు తే
జోమయ మైనరూపమునఁ జూపుల కందనిదై యమానుష
శ్రీమహనీయమై ఋషివరేణ్యదృగంచలసన్నిధానమై
యామహనీయరూపమున కంజలి నిల్పెద నెల్లవేళలన్.

పీఠిక

౧

సుప్రసిద్ధములై నేఁటికిని సంతతపఠనపాఠనవ్యవహారమునఁ గాన వచ్చుచున్న సంస్కృతనాటకములలో మృగరాజలక్షణుఁడైనభట్టనారాయణుని "వేణీసంహార" మొకటి. ఈభట్టనారాయణుని కాలము నిద మిత్థ మని నిర్ణయించుటకుఁ దగినయాధారము లంతగా లేవు కాని, వామనుఁడు కావ్యాలంకారసూత్రవృత్తియందును నభినవగుప్తుఁడు ధ్వన్యాలోకమునందు నీతని "వేణీసంహారము" నుండి కొన్ని శ్లోకముల నుద్ధరించి యుండుటచే నీతఁడు వారి కాలమునకే ప్రఖ్యాతుఁడై యుండె ననియు బహుశః క్రీ. శ. ఏడవశతాబ్దియుత్తరార్ధమున జీవించియుండు ననియు విమర్శకు లూహించుచున్నారు. పైని పేర్కొనఁబడినవా రిరువురే కాక యింకను బలువురు లాక్షణికులును గవులును భట్టనారాయణుని వేణీసంహారము నుదాహరణముగను నాదర్శముగను గ్రహించుటనుబట్టి యప్పటి పండితులలో నీతనికిఁ గలగౌరవము వెల్లడియగుచున్నది. ధనంజయుఁడు దశరూపకమున వేణీసంహారమునుండి పలుచోట్ల నుదాహరణము లొసంగి యుండెను. రాజశేఖరుఁడు తన బాలరామాయణమున నచ్చటచ్చట వేణీసంహారము ననుకరించె నని చెప్పుటకు నిదర్శనము లున్నవి. భట్టనారాయణుఁడు వేణీసంహారమున నాటకలక్షణముల నన్నింటిని సమగ్రముగా ననుసంధింప యత్నించి యందుఁ గృతార్థుఁ డయ్యెను. ఈదృష్టితోఁ జూచిన వేణీసంహారము సంస్కృతనాటకవాఙ్మయమున నద్వితీయమై యలరారుచుండును.

దుశ్శాసనుఁడు సాధ్వియైనద్రౌపదిని గొప్పువట్టి సభలోని కీడ్చి వలువ లొలిచి పరాభవించెను. ఆపరాభవమునకుఁ బ్రతీకారము జరుగువఱకుఁ దన కొప్పు ముడిపెట్టనని యామె ప్రతినపట్టెను. ప్రియసాహసుఁడైన భీముఁడు తనగదాదండముచే దుర్యోధనుని యూరులు విఱుగనడిచి తద్రక్తసిక్తములైన చేతులతో ద్రోవది వేణి ముడిపెట్టెను. రసభరితమైన యీసన్ని

వేశమునుండియే నాటకమునకు "వేణీసంహార" మను పేరు కలిగినది. నాలుగాంకమున సుందరకుడు చెప్పిన యుద్ధ వృత్తాంతమువంటి యనాటకోచిత కథనఘట్టములు కొన్ని యున్నను నీనాటకమునకు వన్నె చేకూర్చిన సన్నివేశము లెన్నియో కలవు. తృతీయాంకమునందలి వాగ్వివాదరంగమున సంభాషణక్రమసౌందర్యము పరాకాష్ఠ నందియున్నది. వీరముతోపాటు శృంగారరౌద్రకరుణాదులును నిందు జక్కగా బోషింపబడియే యున్నవి, ఇంక బాత్రపోషణమున భట్టనారాయణుడు ప్రదర్శించిన నేర్పు మిక్కిలి ప్రశంసాపాత్రముగ నున్నది. ద్రౌపదీభానుమతు లాదర్శపతివ్రతలుగా జిత్రింపబడినారు. దుర్యోధనుని యౌద్ధత్యమును, భీముని ధీరోదాత్తతను, యుధిష్ఠిరుని శాంతప్రజానురాగములను, కృష్ణుని సమయోచిత వాక్చాతుర్యమును, కర్ణాశ్వత్థామల పరస్పరోపాలంభములను, గాంధారీ ధృతరాష్ట్రుల పుత్రప్రేమను గవి చక్కగా బోషించియుండెను. చార్వాకపాత్ర కల్పనము నాటకానురక్తిని పలువిధముల బెంపొందించుచున్నది. శృంగారమున కిందంతగా స్థానము లేకున్నను గవి బలవంతముగా దాని నిందు జొప్పించి పూర్వనాటకసంప్రదాయమునకు లోగినవాడయ్యెను.

ఇంక ననువాదము విషయము. దీని ననువదించినవారు సర్వాంధ్రజన విదితులును, పండితాగ్రేసరులును, బహుగ్రంథరచనా ధురంధరులును, నిఘంటునిర్మాణనిపుణులు నగు శ్రీ బులుసు వేంకటేశ్వరులుగారు. వా రిదివఱకే దిఙ్నాగుని కుందమాలను, భాసుని యభిషేకనాటకమును దెనుంగున కనువదించి తమ యనువాదనైపుణ్యమును బ్రదర్శించియున్నారు. ఇందలి యనువాదము సర్వవిధముల జక్కగా నున్నది. శ్రీవేంకటేశ్వరులుగారి హృదయమువలెనే వారిశైలియు బ్రసన్నమైనది; వారి వర్తనము వలెనే భాషయు ననవద్యమైనది; వారి దృష్టివలెనే రచనయు మిక్కిలి నిశితమైనది. వారిగ్రంథము లిహపరములకు వంతెనలు. అవి వారి హృదయమున నెలకొన్న యాధ్యాత్మికతానుషంగమునకు విమలాదర్శములు. ఏపూర్వజన్మసుకృతముచేతనో నే నార్జించుకొన్న వారితోడి నెయ్యముతప్ప నీపీఠిక వ్రాయుటలో నాకొండు పాత్రత లేదు.

ఆంధ్రభాషయందలి యనువాదములు మూఁడు తెఱంగులుగా నున్నవి. కథానువాదములు, భావానువాదములు, పదానువాదములు అందుఁ గవిత్రయమువారి భారతము మొదటితరగతికిఁ జెందునట్టిది. ఈపద్ధతి కేవలానువాదమే కాని చాలవఱకు స్వతంత్రమైనదే. రెండవపద్ధతికి శ్రీనాథుని నైషధాంధ్రీకరణము తార్కాణ. ఇది మూలవిధేయమయ్యు స్వతంత్రమైనది. ఆధునికకాలమునందలి సంస్కృతనాటకాంధ్రీకరణములు పెక్కు మూఁడవపద్ధతికిఁ జెందును. ఇవి స్వతంత్రత యేమాత్రమును లేని మూలమున కతివిధేయము లైన పదానువాదములు. మూలసాహాయ్యము లేక యిందలి భావములను గనుఁగొనుట పెక్కుచోట్లఁ గష్టసాధ్యముగా నుండును. నాకుఁ జూడఁగా నీమూఁడు పద్ధతులలో రెండవదైన భావానువాదపద్ధతి ప్రశస్తముగాఁ గనుపట్టును. ఏలయన నది మూలమున కవిధేయమును గాదు అతివిధేయమును గాదు. శ్రీవేంకటేశ్వరులుగారి యనువాద మీఫక్కికిఁ జెంది యమందానందమును జేకూర్చుచున్నది.

నిజము పరిశీలింపఁగా స్వతంత్రరచనముకంటె ననువాదమునఁ గ్లేశము హెచ్చు. స్వతంత్రరచనమునఁ బదచ్ఛందోనుగుణముగా భావమునించుకక మార్చుకొనవచ్చును. ముఁడి యనువాదమున నాపదచ్ఛందములనే మార్చుకోవలెను గాని భావావిష్కరణమున నించుకయు మూలము నధిగమించి పోరాదు. పోయినచో నయనువాదమెంత మృదుమనోహరము గానున్నను మూలమును దృష్టియందుంచుకొని చూచువారి కది యసంబద్ధముగా గోచరించును. అందుచే ననువాదమును సర్వజనానందకరముగా నొనరించుట యసిధారావ్రతము వంటిది. దుష్కరమైన యీవ్రతమును శ్రీవేంకటేశ్వరులుగా రవలీలమై నిర్వహించిరన్నచో నించుకయు నతిశయోక్తి యుండఁజాలదు.

అనువాదమున సాధారణముగా భావము యథామూలముగనే ప్రకటింపఁబడినను మూలమునందున్న కొన్ని పదములు లోపించుటయో లేని కొన్ని పదములు చేరుటయో సంభవించుచుండును. అధికముగా వాడఁబడిన పద

ములు కేవల వ్యర్థపదములైనప్పుడును, [illegible] ములైనపదములు భావగర్భి
తములైనప్పుడునుదక్క నిటివంటి చేర్పులవలన నంతగా హానిలేదు [illegible]ను.
వచనమున నీకృచ్ఛ్ర [illegible] నేయ [illegible] కవి [illegible] వ్యాఖ్యానము [illegible]
నీ [illegible] వ్యాఖ్యాత [illegible] కేవలపదము [illegible] పకివ [illegible]
శ్రీ వేంకటేశ్వరులుగారు [illegible]
వాదమును [illegible]
[illegible] మూలము [illegible] ములుగా
[illegible] నవచ్చి [illegible]
మూలమున గూఢముగా నున్నయర్థమును [illegible] గా వివరించుచు [illegible]
వ్యాఖ్యానమువలె [illegible] నో [illegible] మునో [illegible] గా నవచ్చును.
[illegible] వ్యాఖ్యాన [illegible] నయి
నాతలంపు. [illegible] మున [illegible] నాథుని [illegible] కొన్నిటి [illegible] లలో [illegible]
వివరణము కావించియుండెను [illegible]
తిని గాని వలయు [illegible] మూలశ్లోకములతో [illegible] చూచిన
నీవిషయము తేటతెల్లముగును.

సంస్కృత వేణీసంహారమున [illegible] గా [illegible]
భూయిష్ఠమును నోజోగుణసంపన్నమునై [illegible] ధను [illegible]
ప్రయోజనములగు నాటకము [illegible] నంతగా [illegible] యము [illegible]
యినను రసభావసన్నివేశములతోడి యాలంకారికముగ [illegible] నుచి
తముగా [illegible] పోవు వీరోచితాలాపములవలన [illegible]
యిష్ఠమైన రచన మిక్కిలి సరసమును [illegible] మంతమునై [illegible] చును. శ్రీ
వేంకటేశ్వరులుగారు మూలమునందలి గాంభీర్యమున కెచ్చటను [illegible]
రాకుండ ననవసరపదాడంబరము పొంతపోకుండ, రసభావానుగుణమైన శైలి
నుపయోగించి యనువాదమును సరససుందరము కావించినారు. అనువాద
ముచేయునెడ దలుచుగా మూలపదములయొక్కయు దద్వ్యాఖ్యానపద
ములయొక్కయు ప్రభావము హెచ్చుగా జూపట్టుట సహజము. [illegible]

యెడ ననువాదభాషకు నిసర్గమైన నుడికారపు సొంపునకును జాత్యమునకును నించుక భంగము వాటిల్లుటలో నాశ్చర్యముండదు. అట్లుగాక తెనుఁగుజాతీయమున కెచ్చటను నంతరాయములేని సహజమధురమైన శైలిలో సాగిపోవుట యీ యనువాదమున కెన్నఁదగిన గుణవిశేషములలో నొకటి.

పురాణములను, కావ్యములను సంస్కృతమునుండి తెనుఁగున కనువదించిన ప్రాచ్యమహాకవులెందఱో గలరు గాని ప్రసిద్ధమైన నాటకముల ననువదింప నెవ్వరును బూనియుండలేదు. వారు కావ్యశైలి నాటకశైలికిఁ గల వ్యత్యాసము నుడువలసిన యూహ్యము నెఱుఁగనియో, సంస్కృతనాటకముల క్లిష్టతయు నాన్ద్యాది పద్ధతులయో యనువాదమునకుఁ గారణముగాఁ జెప్పవచ్చును. దాని కసాధ్యమైన కారణము లేమియో తెలియకున్నది. వాని నిటఁ బరిశీలింపఁ నిలేదు. కాని, ప్రాచ్యమహాకవులే సంస్కృతనాటకములను గూర్చి యనువదించి యుండిన నా సంగతు లెన్నియు నిరపేక్షముగాఁ (గ) వారికి బరియయు ననువదింప ప్రయత్నించినవారికిఁ బోవుచుండును. అట్టివాని తొలఁగించిన సమర్థులైన నాటకానువాదకులు కొందఱు బలసియుండిరి. అట్టివారిలో శ్రీ వేంకటేశ్వరులుగా రొకరు. ఉద్యోగస్థులై తా సంపాదనముతోఁ బాటు సార్థకమైన భాషాసేవకూడ గావించుట వీరి తాశయములలో నొకటి. వీరి సేవను గలుగు నాంధ్రభాషాయోషకు వీరొక స్యతరకములైన కొన్ని నవ్యభూషలు కూర్చుట మిగుల ముదావహము. సర్వజగన్నియామకుఁడైన భగవంతుఁడు శ్రీ వేంకటేశ్వరులుగారి కాయురారోగ్యభాగ్యములొసఁగి వారిచే నింతోధికమైన భాషాసేవ చేయింతుఁగాక యని ప్రార్థించుచు విరమించుచున్నాను.

టపాకర్ల వేంకటావధాని,
ఎం. ఏ.. (ఆనర్సు.)

సర్వరససంభరితమై జగత్ప్రసిద్ధి గాంచిన "వేణీసంహారనాటకము" తొలుదొలుత క్రీ. శ. ౧౮౭౩ వ సంవత్సరమున కీ. శే. వడ్డాది సుబ్బారాయఁడుగా రాంధ్రీకరించి ౧౮౭౮ లోఁ బ్రకటించిరి. తరువాత దీనిని శ్రీశ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రికవిసార్వభౌములు ననువదించి ప్రకటించిరి. వ. సు. రాయకవిగారియాంధ్రీకృతి యైదాఱుముద్రణములఁ గనది. ఆతరువాత నెవరో యొక్కరు వేణీసంహారమును సంగ్రహించి ప్రకటించిరి కాని, నాఁటినుండి నేఁటివఱకు మఱియెవ్వరు నీనాటకముజోలికిఁ బోయియుండ లేదు. ఇటీవల నేను సంస్కృతవేణీసంహారముఁ జదువుచుండ మరల దీని ననువదింపవలసినయవసరము కల దని నాకుఁ దోఁచి నే నచిరకాలముననే దీని నాంధ్రీకరించితిని. దీనిని గన్నవిద్వద్వతంసు లిది పూర్వానువాదముల కేమాత్రమును దీసికట్టు కాకపోవుటే కాక యెన్నివిషయములలోనో మిన్న యని నన్ను దీనిప్రకటనకుఁ బ్రోత్సహించిరి. అది వారికి నాపైఁ గలయవ్యాజవాత్సల్య మని నేను గ్రహించి నాకు మార్గదర్శకు లైన వ. సు. రాయ కృష్ణమూర్తిశాస్త్రి కవివరులను గృతజ్ఞతావందనములతో సంస్మరించి నేను గృతకృత్యుఁడ నైతిని. రసికవతంసు లిందలిగుణలేశమునే గ్రహింతురుగాక!

భట్టనారాయణుని కాలము, దేశము, పాండిత్యములను గుఱించియు వేణీసంహారమందలి రస నాయక చర్చను గుఱించియు నెంతయో వ్రాయఁ దలఁచితిని గాని కాలస్థలాభావములు నా కాయవకాశమును గలుగనీయ లేదు. నాయీకృతిని సాదరమునఁ దిలకించి పీఠిక వ్రాసి నన్ను గౌరవించినమిత్త్రరత్నము లగు శ్రీదివాకర్ల వేంకటావధానిగారికి నే నెంతయో కృతజ్ఞుఁడను. దీని నచిరకాలమున నత్యంతసుందరముగా ముద్రించిన ఆంధ్రప్రచారిణీముద్రాశాలవారికి నాకృతజ్ఞతావందనములు.

నేఁటినాటకరంగప్రదర్శనమున కిది యనుకూలము కాదని వేఱ చెప్పనక్కఱ లేదు. నాయనువాద మందుకొఱ కుద్దిష్టమును గాదు. సారస్వతదృష్టితో దీనిని గాంచి యానందించు సహృదయులకే యిది యుద్దిష్టము. వారామోదించిన నాకదియే పదివేలు.

ఖర చైత్ర శు ౧. ఉగాది
7—4—51
కాకినాడ.

బులుసు వేంకటేశ్వరులు. బి. ఏ.
[సంపాదకుఁడు, వావిళ్ల నిఘంటువు.
ఆంధ్రపండితుఁడు, పి. ఆర్. కాలేజి.]

నాటక పాత్రలు

యుధిష్ఠిరుఁడు
భీమసేనుఁడు
అర్జునుఁడు
నకులుఁడు
సహదేవుఁడు

కృష్ణుఁడు

ధృతరాష్ట్రుఁడు
దుర్యోధనుఁడు
కర్ణుఁడు
కృపుఁడు
అశ్వత్థామ
సంజయుఁడు
సుందరకుఁడు
జయంధరుఁడు
వినయంధరుఁడు
చార్వాకుఁడు
రాక్షసుఁడు

ద్రౌపది
భానుమతి
గాంధారి
దుస్సల
జయద్రథమాత
రాక్షసి
చేటి, నటి

శ్రీ

వేణీసంహారము

నాంది

శ్రీ దామోదర దైవతంబు, భువన
శ్రేణీమహాధార ము
ఖ్యాదేశంబు, స్వనాభిరంధ్రమహితో
ద్యల్లోక బీజంబు, నా
భీ దేశాంతర సంప్రతిష్ఠిత మహా
విశ్వాండభాండంబు, సం
హ్లాదాంభోనిధి, స్వప్రకాశమున ది
వ్యజ్యోతియై వెల్గుతన్ ! ౧

శా. క్షీరాంభోనిధిమధ్యమందుఁ గృపతో
శేషాహిపర్యంకమం
దాసీనుం డయి చిద్విలాసముఁ బ్ర
హ్మానందసందోహ స
త్పారావార మనంగఁ జెన్నలరు సం
భద్వేణువిద్యాకళా
పారీణుం డగుకృష్ణదేవుఁడు జగ
ద్భద్రాత్ముఁ డేపాటుతన్ ! ౨

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును.)

సూత్ర:—పలుపలుకు లేల ?

క. భారత మనునమృతం బం
పారఁగ శ్రుతివేయ మాప్రబంధ మునర్చెన్

బారాశర్యుఁడు రాగవి
దూరుఁడు భవయింతు వాని దురితవిదూరున్. 3

పూజ్యు లగుసభాసదుల కిట్లు విన్నవించుకొందును.

క. మఱియొక కుసుమాంజలిగా
పలుకులఁ జేసెదము కావ్యగంధము నింపన్
గల్గిన మధుకణములతో గొను
పెల్లుగుణ గుణాలేని మెచ్చి తృప్తిఁ గనుఁడీ! 4

కవిసింహుఁ డగుభట్టనారాయణుఁడు సంస్కృతముగా వేణీసంహార మనుపేర వ్రాసిన సంస్కృతనాటకమును కవిప్రియుఁ డగు బలుసు వేంకటకృష్ణకవి యాంధ్రీకరింప దాని నిటఁ బ్రదర్శింప నున్నాము. కవి శక్తిసంపద యెట్లున్నను ఉండుఁ గాని క్రొత్తనాటకము కాకపోయినను పాత దైనఁ గాని కథావస్తువు చాల గొప్పది గాన దీనిని మీ రెల్లరు శ్రద్ధగాఁ జూడవలయును.

(తెరలో)

ఆర్యా! త్వరగా. త్వరగా.. వ్యాసనారదాది మహాత్ములతో భారతక్షేమముఁ గోరి తానే దూతయై దేవకీనందనుఁడు దుర్యోధనుసన్నిధిఁ బయనముఁ జేయువేళ కావున నిపుడు వాద్యమేళముఁ గావింపుఁ డని పెద్దలయనుమతిని వీరు నాటకులతో ననుచున్నారు.

సూత్ర:—(విని సంతోషముతో) ఆహా! జగము లన్నియుఁ బుట్టించుటకు నిల్పుటకుఁ ద్రుంచుటకుఁ గారకుఁ డగుశ్రీకృష్ణుఁడే కురుపాండవుల యుద్ధాగ్నిని జల్లార్చుటకు దూత యైనకారణమున నొక్క భరతకులమే కాదు సర్వరాజలోకము ధన్యము కదా!

(తెరలో)

ఇంకను గుర్తులున్నంతలో సంగీత మారంభింపరేమి?

సూత్ర:—సరే ఆరంభింపుము. ఏ ఋతువును గూర్చి పాడుదుము?

(తెరలో)

వెన్నెలచే నక్షత్రములచేఁ దేదీప్యమానమైన యాకాశముతో, కల హంసలు క్రౌంచపక్షులు మున్నగు వానితో, పద్మాకరములతోఁ, కలువ, తామరపూలతో, జాజిపువ్వులతోఁ, దేదీప్యమానమైన సన్న న్నులంటలి పూలపరాగముతో, నిండిన దిక్కులతో శోభిల్లు శరత్కాలమును గూర్చియే పాడుము.

సూత్ర:—ఔను. ఈ శరదృతు విదే :

క. కలువతెక్కలఁ దియ్యపుఁబలు
కులలంకృతదిశలఁ గ్రైఖాగానునారంభం
బుల ధార్తరాష్ట్రశతగణ
ములు వ్రాలెడుఁ గాలవశత భూమిస్థలిపై. 3

పారిపార్శ్వకుఁడు:—(ప్రవేశించి) ఆర్యా! పాపము శమించుఁగాక!

సూత్ర:—(నవ్వుచు) శరదృతువును వర్ణించుపట్టున హంసలను నర్థమున ధార్తరాష్ట్రశత మని వాడితిని.

పారి:—ఐనను, నీమాటలోని యమంగళధ్వని నామనస్సుఁ గలఁచుచున్నది.

సూత్ర:—మారిషా! శ్రీకృష్ణుండు స్వయముగా సంధికర్త యగుటచే నన్నియమంగళములు తొలఁగిపోవును గదే:

చ. పగ యనునగ్ని చల్లఁబడ
వైరిగణంబు లణంగి పోవఁగా

నెగడుచుఁ బాండునందనులు
　　నీరజనాభునితో సుఖింప న
త్యగణితరక్తసాధితమ
　　హావనులై క్షతవిగ్రహాత్వ మన్
వగను గడించి కౌరవులు
　　బంధులతోడుత స్వస్థు లయ్యెదుర్ ! ౬

(తెరలో: తిరస్కారపూర్వకముగా)

ఓరీ! పాపీ! దురాత్మా! ముఖస్తుతిపాఠకా! నటకాధమా! నే నుండఁగనే కౌరవు లెట్లు సుఖింతురురా?

చ. కనికర మీఁగి లక్కయిలు
　　గాల్చి విషాన్నము పెట్టి జూదపుం
జెనుమిష రచ్చ కీడ్చి బహు
　　విత్తములన్ గొని మానభంగమున్
గొనరుప సాధ్వి ద్రౌపదిని
　　బుణ్య సభన్ సిగఁబట్టి చీర లూ
డ్చినఖలధార్తరాష్ట్రులు వ
　　సింతురె స్వస్థత నేను గల్గఁగన్ ? ౭

పారి:—ఆఁ. ఆఁ. అది యేమి?

సూత్ర:—(వెనుకకుఁ జూచి) కృష్ణుఁడు కౌరవులతో సంధి చేయఁ బోవుట కొల్లక భీమసేనుఁడు రౌద్రరసమూర్తియై కంటికగ పడినవారి నెల్లర మ్రింగివేయునో యనునట్లు మహాకోపియై తమ్ముఁ డగు సహదేవునితో నిటే వచ్చుచున్నాఁడు. అతని కంటికి మన మగపడరాదు. మఱొకచోటి కేఁగుదము రమ్ము.

(నిష్క్రమింతురు)

ఇది ప్రస్తావన.

వేణీసంహారము

ప్రథమాంకము

(కోపిష్ఠుడై సహదేవునితో భీమసేనుఁడు ప్రవేశించును)

భీమ:—ఓరీ! పాపీ! దురాత్మా! ముఖస్తుతిపాఠకా! నటకాధమా!

("కనికర మీఁగి లక్కయిలు గాల్చి .." మరలఁ జదువును)

సహ:—(అనునయించుచు) ఆర్యా! శమింపుఁడు. శమింపుఁడు. ఈ నటకులవచనము మన కిష్టమే కదా! ఏలన,

చ. "పగ యనునగ్ని చల్లఁబడ
వైరిగణంబు లణంగిపోవఁగా
నెగడుచుఁ బాండునందనులు
నీరజనాభునితో సుఖింప"

అన్నంత వఱకు మీ కభ్యంతరము లేదుకదా! ఇఁక:

"అత్యగణితరక్తసాధితము
హానను లై క్షతవిగ్రహాత్మ్వ మఱ
వగను గడించి కౌరవులు
బంధులతోడుత స్వస్థు లయ్యెదర్."

అనఁగా క్షతశరీరులై కౌరవులు సబంధుకముగా స్వర్గము నందుదురుగాక యనికదా భావము!

భీమ:—(నిందాసూచకముగా) ఔనౌను. మీరు కౌరవుల కనుం గళ మెన్నకుఁడు. పాపము వారు మిగుల సాధువులుకదా! సంధియే చేయుఁడు.

సహ:—(కోపముతో) ఆర్యా!

గీ. మాటిమాటికి వైరంబు మురిచి పెరిచి
కయ్యమున కిట్లు కాల్ద్రవ్వు కౌరవాళి
నెపుడు క్షమియించు నీభ్రాత లింకనెందు
ధర్మజుం డిట్లు వారింపఁ దలఁపకున్న? ౧

భీమ:—ఔను. అందుచేతనే మీకు నేను వేఁడుచున్నాను.

ఉ. చిన్నతనంబునుండియుఁ బ్రవృద్ధము వైరము కౌరవాళితో
నన్న యుధిష్ఠిరుండు మఱి యర్జునుఁ డీవును గారు కారకుల్;
పన్నుఁడు మీరు సంధి; మఱి భగ్న మొనర్చును భీముఁ డద్ది; క్రో
ధోన్నతిఁ దొల్త మాగధము హారము వచ్చినరీతి నెన్నఁగన్. ౨

సహ:—(అనునయముతో) ఆర్యా! ఈ నీ కోపముఁ గన్న నన్న ఖిన్నుఁ డగుఁగదా!

భీమ:—ఏమి! అన్న ఖిన్నుఁ డగునా!! ఖేద మన్న నేమో యన్న యెఱుఁగనే యెఱుఁగఁడుకదా! ఏలన:

చ. కురుసభ నట్లు బన్నములఁ
గూరిన ద్రౌపదిఁ గాంచి, వల్కలాం

ఒరు లఘు వ్యాధులన్ గెలిచి
వర్తిలి కానన భూములందు, న
వ్విరటన్నృపాలుపాల ౖతి
విహ్వలతన్ బడియుండు నాపయిన్
గురుకరు లేదు జాలి; కలు
గుంగద! కౌరవులందు నేరికిన్. ౧౦

అందుచే నీవు పోయి చిరకాలమునుండి పెరిగి పెంపుగొన్న నాక్రోధవృక్షము బలుకు లాముహూర్తాజ్ఞ కిట్లని విన్నవింపుము:

సహ:—ఎట్లు?

భీమ:—ఇట్లు:

మ. భవదాజ్ఞాపరిలంఘనాత్మక మహా
పాపాబ్ధి నిర్మగ్నతా
భవదీయాఖిలసోదరాధమ మహా
పఖ్యాతి నాకైనఁ గో
పకఘూర్ణ ప్రతిశోణితారుణాగదా
పర్వంబుగాఁ ద్రుంతుఁ గౌ
రవులన్; గా మిఁక నన్ను నిమ్ములపు కౌ
రాదౌక్క యానాఁటికిన్. ౧౧

(ఉద్ధతితో నడచును)

సహ:—(భీమసేను ననుసరించుచు, తనలో) ఓహో! ఏమి! ఆర్యుఁడు పాంచాలి చతుశ్శాలలోనికిఁ బోవుచున్నాఁడు. నే నిట నిలిచెదను. (కూర్చుండును)

భీమ:—(వెనుదిరిగి చూచి) సహదేవా! నీవు పొమ్ము. గురునితో నుండుము. నే నీయాయుధాగారమున కేఁగి సాయుధుఁడ నగుదును.

సహ:—ఆర్యా! ఇది యాయుధాగారము కాదు. పాంచాలి చతుశ్శాల.

భీమ:—(పరికించి) అట్లనా? సరే. పాంచాలితో మాటాడెదను. (సహదేవునిచేయి పట్టుకొని) వత్సా! అన్న యుధిష్ఠిరుఁడు కౌరవులతో సంధి కిచ్చగించి మన కెట్టిపీడ కలిగించినాఁడో!

(ఉభయులు ప్రవేశింతురు)

సహ:—ఆర్యా! ఈయాసనమునఁ గూర్చుండుఁడు. కృష్ణ యిప్పుడే వచ్చును.

(ఇరువురుఁ గూర్చుందురు)

భీమ:—వత్సా! కృష్ణ యన్న జ్ఞప్తికి వచ్చినది. ఎట్టి పద్ధతులకు లోఁబడి సంధిచేయ మహి యుధిష్ఠిరుఁడు కృష్ణభగవానుని దుర్యోధనుని కడ కంపెను?

సహ:—ఆర్యా! ఐదూళ్లు మన కిచ్చుటకు.

భీమ:—(చెవులు మూసికొని) ఆహాహా! అన్న యజాతశత్రు నైనను నింతపరాక్రమహీనుఁ డని నిజముగా నామనసు కలఁగి పోయినది. సరిలే. ఈమాట నీవు చెప్పను లేదు. నేను విన లేదు అనుకొందునులే. (ప్రక్కకు దిరిగి)

గీ. ఉగ్రమును నూర్జితం బన నొప్పు గన్న
క్షాత్రతేజంబు ధర్మరాజ ప్రసిద్ధుఁ
డితఁడు జూదము నాడంగ నెపుడు చేతఁ
బట్టెఁ బాచిక లప్పుడే వదలె నీని. ౧౨

(తెరలో)

దేవీ ! ఊఱకొను మూఱకొనుము.

సహ:—(తెరవంకఁ జూచి తనలో) అయ్యో ! ఏమిది ! ద్రౌపది యెడతెగక క్రమ్ము కన్నీటితో సతీ యన్నసమీపమునకు వచ్చుచున్నది. ఏదో మహాకష్టము ముంచుకొని వచ్చుచున్నట్లు తోఁచుచున్నది.

గీ. అన్న కోపంబువలన నుత్పన్న మయ్యె
వైద్యుతాగ్నిగ జ్యోతి యూఁపగిది నిపుడె;
దానిఁ జెంపొందఁజేయు నీ ద్రౌపది యిట
వర్షఋతువట్లు లేఁతి వచ్చె యిపుడు. ౧౩

(అంతఁ జేటి, కన్నీటితో ద్రౌపది, ప్రవేశింతురు.)

చేటి:—దేవీ ! ఊఱకొను మూఱకొనుము. నీ దుఃఖమును సత్యకౌరవవిరోధి యగుభీమసేనకుమారుఁడు పోనడఁచును.

ద్రౌప:—మహారాజు దీనికిఁ బ్రతికూలుఁడు కాకున్న.

చేటి:—(చూచి) దేవీ ! భీమసేనుఁ డిటనే యున్నాఁడు. చెంత కేఁగుము.

ద్రౌప:—సరే.

(ఇరువురును సమీపింతురు.)

చేటి:—(చేరి) జయము జయము కుమారా !

భీమ:—(చూడక)

"గీ. ఉగ్రమును నూర్జితం బన...(మరలఁ జదువును.)

చేటి:—దేవీ ! భీమసేనుఁడు మిక్కిలి కోపముతో నున్నట్లున్నాఁడు.

ద్రౌప:—చెలీ! ఐనచో నా కీతిరస్కారమే యూఱడింపు. ఇటనే కూర్చుండి నాథునియూహ యేమో తెలిసికొందును.

(ఇరువురును గూర్చుందురు.)

భీమ:—(క్రోధముతో) వత్సా! ఏమి! ఐదూళ్లకా సంధి?

చ. సమరమునందుఁ గోపమునఁ
జంపనె నూర్గురు ధార్తరాష్ట్రులన్?
దమిమెయి దుస్ససేనునెడఁ
దన్ గడు ద్రచ్చియు నెత్రుఁ ద్రావనే?
సమదగదన్ సుయోధనని
పాదునియూరులు నుగ్గు సేయనే?
శ్రమపడి రాజు సిగ్గు విడి
సంధియె చేసినఁ జేయని మ్మిఁకన్. ౧౪

ద్రౌప:—(సంతోషముతో) నాథా! ఇట్టి యమృతతుల్యము లగుమాటలు నే నెన్నఁడును వినలేదు. ఏది! యింకొకమా అనుము.

భీమ:—

"చ. సమరమునందు..." (మరలఁ జదువును.)

సహ:—ఆర్యా! మహారాజు సంధిసందేశ మంతగా మీకు నచ్చలేదా?

భీమ:—అసలాసందేశ మేమి?

సహ:—రాజసందేశ మిది.

భీమ:—ఎవరికి?

సహ:—సుయోధనునకు. ఏమని యనఁగా,

క. పనుపడ నింద్రప్రస్థం
బనఁగ వృకప్రస్థమును జయంతం బనఁగా
ననువొప్ప వారణావత
మనఁగ నొసఁగి పిదప నొసఁగు మైదవ దేదే. ౧౫

భీమ:—ఐన ?

సహ:—అన్న నాలుగే చెప్పి యైదవయూరు చెప్పకపోవుట విసపుఁగూడు, లక్కయింటికాల్పు, జూదపురచ్చ కీడ్చుట, చీర లొలుచుట యనున వెత్తిపొడుచుటకే.

భీమ:—(సాటోపముగా) ఐనమాత్రము ?

సహ:—ఆర్యా! దీనివలన మహారాజుమనస్సు స్వకులక్షయ మన్న జంకున దనియుఁ గురురాజు సంధికామి కాఁ డని యును లోకమ్మునకు విదిత మగును.

భీమ:—ఈ రెండు నర్థరహితములే. ఏలన, ఏనాఁడు మన మడవులపాలయి కురుకులక్షయ మొనరింప శపథము పట్టితిమో యానాఁడే కౌరవులతోడి సంధి కారా దనియుఁ గురుకులము నశింపవలసియున్న దనియు లోకమునకుఁ దెలియును.

సహ:—(సిగ్గుపడును.)

భీమ:—లోకమునఁ గురుకులనాశన మన్న మీకింత లజ్జ యేల? ఏమిమూర్ఖత !

గీ. క్రోధమున శత్రుకోటిని ద్రుంచు టనఁగ
మీకు నగుఁబాటుగాఁ దోఁచు లోకమునను !

పతిని సిగ్గుఁబట్టి సభ నీడ్చి శత్రు వాకఁ జ
వలువ లొలువఁగఁ గన నగుఁబాటు కాదు ! ౧౬

ద్రౌప:—(జనాంతికముగా) నాథా ! వీరికి సిగ్గు లేదు. నిజము. సిగ్గు లేదు. నీవైన నామాట మఱవకుము.

భీమ:—వత్సా ! పాంచాలి రాదేమి ?

సహ:—ఆర్యా ! ఆమె వచ్చి చాలసే పయినది. నీవు కోపావేశమునఁ గనవైతివి.

భీమ:—(చూచి యాదరముతో) దేవీ ! నే నీకోపసమయమున నీరాక యెఱుఁగనైతిని. దగ్గఱ నున్నను నిన్నుఁ గనవైతి. ఏమియు ననుకొనకుము.

ద్రౌప:—నాథా! మీ రుదాసీనులై యున్న ననుకొందును గాని యిట్టి కోపసమయమున నున్న నెన్నఁడు ననుకొనను.

భీమ:—సరే. నీ పరాభవము నేఁటితోఁ దొలఁగిన దని భావింపుము. (చేయి పట్టుకొని దగ్గఱఁ గూర్చుండఁబెట్టుకొని ముఖము చూచి) దేవీ ! ఇట్లు విచారముతో నున్నావేమి ?

ద్రౌప:—నాథా ! మీ దగ్గఱ నాకు విచార మెక్కడిది ?

భీమ:—చెప్పవేమి ? (సిగఁ జూచి) ఇఁక, వేఱే చెప్ప నక్కఱ లేదులే.

గీ. పాండునందను లందఱు బ్రతికియుండి
సరసఁ గవగూడి యున్నఁ బాంచాలరాజ
తనయ సుమకోమలాంగి యుత్తమచరిత్ర
యిట్టి దురవస్థ నున్న దిం కేమి చెప్ప ? ౧౭

ద్రౌప:—చెలీ! నా సంగతి నాథునితోఁ జెప్పవే. నాయవ
మానమునకుఁ బ్రతీకారము నాచరింపఁ గోరవే ?

చేటి:—అమ్మా! అట్లే. (అంజలిబద్ధయై భీమసేనునితో) దేవా!
దేవి కింతకన్న నెక్కువ యవమానకారణమే కలిగినది.

భీమ:—ఏమేమి! ఇంతకన్న నెక్కువయా! చెప్పు. చెప్పు!

గీ. విడివడిన కేశతతితోడను వెలయు ద్రుపద
తనయ నెవ్వాఁడు ధూమరేఖను స్పృశించి
నటులు స్పృశియించి కురువంశ మను వనాగ్ని
కీలలకు శలభంబుగా నాఁ బాలుపడెను ? ౧౮

చేటి:—దేవా! ఇంతకు ముందే దేవి యంబతోడను సుభద్ర
మున్నగు సపత్నులతోడను బూజ్య యగు గాంధారికిఁ
బాదవందనము నొనరింప నేఁగి యుండెను.

భీమ:—అది యుక్తమే. అది సంధ్యాతేకదా! తరువాతఁ
దరువాత? [illegible]

చేటి:—వెళ్లి వచ్చుచుండఁగా భానుమతి దేవిని జూచినది.

భీమ:—(కోపముతో) ఆఁ, శత్రుభార్య కంటఁ బడినదా? అది
దేవికిఁ గ్రోధస్థానమే. తరువాతఁ దరువాత ?

చేటి:—అంత దేవిని జూచి యామె చెలికత్తెవైపు దిరిగి సగ
ర్వముగా నవ్వి యిట్లనెను.

భీమ:—చూచుటే కాదు. మాటకూడ నన్నదా? ఏమి
చేయుదును? తరువాత ?

చేటి:—"ఏమే! ద్రౌపదీ! నీమగ లైదుగురు కోరుకొన్నా
రఁట కాదే! నీ వింకను సిగ ముడువ వేమే!"

భీమ:—సహదేవా! వినుచున్నావుగదా!

సహ:—ఆర్యా! అది యస్లే. అది దుర్యోధనుని భార్య కాదా! మఱి యింక నేమి?

గీ. మగల సాహచర్యంబున మగువలకును
మాఱిపోవును గద! మఱి మగలవలెనె
వినపుఁజెట్టును బెనఁగొన్న వెనుక మధుర
వల్లియును మూర్ఛవుచ్చి చంపం గడంగు. ౧౯

భీమ:—చేటీ! దానికి దేవి యే మన్నది?

చేటి:—దేవా! నేను లేకున్నఁగదా దేవి పలుకుట?

భీమ:—సరే. నీ వేమంటివి?

చేటి:—"ఓసీ! భానుమతీ! మీమీసిగలు విడివడకమునుపే మా దేవి సిగ యెట్లు ముడివేసికొనునే?" అని.

భీమ:—(ఆనందముతో) సెబాస్. బుద్ధిమతీ! సెబాస్. ఎంత చక్కఁగాఁ బలికితివే! దీని కిదే నీకు నా పారితోషికము. (ఆభరణ మిచ్చును.) ఓ పాంచాలీ! (ఆసనమునుండి లేచి) దుఃఖింపకుము. అచిరకాలమునందే నేఁ జేయునది చెప్పెద విను;

చ. గిరగిరఁ ద్రిప్పుకొంచు గద
కినుక సుయోధను నూరుయుగ్మము
ద్ధుర రభసంబునన్ జదిపి
దుత్తుమురై పడ, వేఁడి వేఁడి నె
త్తురు గొని చేతులన్ గురుల
దువ్వి మెఱుంగిడి భీమసేనుఁడో
తరుణిరో! చిక్కుదీసి ప్రమ
దం బొదవన్ ముడివేయు నమ్ముమీ! ౨౦

ద్రౌప:—నాథా ! నీవు తలఁచినఁ జేయలేని దేది ? మీయన్న
దమ్ములు దయచూపవలయునే కాని.

సహ:—అది మాకునైత మిష్టమే.

(తెరలో గొప్ప కలకలము. అంద ఱాశ్చర్యముతో వినుదురు)

భీమ:—

సీ. ఘూర్ణాయమాన మహా ఘోర వార్నిధిమధ్యఁ
జలియించు మందరాచలమునట్లు
కోణఘాతంబుచే గురుతరం బగుగర్జ
ఘర్జించు ప్రళయమేఘంబురీతి
పరమపాండవసతీ చిరతరోగ్రక్రోధ
దుర్వార మానగ్రదూత భంగి
కౌరవ్యవంశ సంక్షయ నిమిత్తంబుగా
బయలుదేఱిన చండవాయువుగతి

గీ. ధ్వానధీరత సంఘట్ట చండతయును
నుగ్రనిర్ఘాత లక్షణం బొప్ప నాదు
సింహనాదానుకారి యీచెలువు తోఁప
విజయరణ దుందుభిధ్వని వినుము వత్స ! ౨౧

కంచు:—(సంభ్రాంతుఁడై ప్రవేశించి) కుమారా ! శ్రీకృష్ణభగ
వానులు...

(అందఱు కృతాంజలులై లేతురు.)

భీమ:—భగవానుఁ డెక్కడ ?

కంచు:—పాండవపక్షపాతి యని కౌరవులచే బద్ధుఁ డగుట
కేగినాఁడు.

(అంద ఱాశ్చర్య మందుదురు.)

భీమ:—ఏమి! ఆతనిని బంధించిరా?

కంచు:—లేదు. లేదు. అంతవఱకు వచ్చినది.

భీమ:—అప్పుడు భగవానుఁ డేమి చేసెను?

కంచు:—ఆమహాత్ముఁడు విశ్వరూపమును జూపి మా తేజముచేఁ గురుకులము మూర్ఛపోఁగా మన శిబిరమునకు కరుదెంచి త్వరలో నిన్నుఁ గనఁ గోరుచున్నాఁడు.

భీమ:—(నవ్వుచు) ఏమేమి! దురాత్ముఁ డగు దుర్యోధనుఁడు భగవంతునే కట్టివేయఁ జూచినాఁడా? (ఆకాశముఁ జూచి) దురాత్మా! కురుకులపాంసనా! ఈ మర్యాదాతిక్రమణము నీ వినాశమునకు మాక్రోధ మిఁక నిమిత్తమాత్రమే యగునులే.

సహ:—ఆర్యా! ఆ దురాత్ముఁ డప్పుడైనఁ గృష్ణుఁడే వాసుదేవుఁ డని గ్రహింపలేదు కాఁబోలును!

భీమ:—వత్సా! మూఢుఁ డతఁ డెట్లు తెలిసికొనఁగలఁడు?

మ. స్థిరమై యొప్పెడి నిర్వికల్పకసమా
ధిఁ బుద్ధులఁ నిల్పి దు
స్తరదుర్వార తమోగుణంబు విమల
జ్ఞానంబునఁ ద్రోచి యా
త్మ రముల్ కాంచెడి జ్ఞానమూర్తిని దురా
త్మ క్రూరదుర్మోహుఁ డా
కురురా జెట్లు గ్రహింప నేర్చుఁ? గను వై
కుంఠాత్ముఁగాఁ గృష్ణునిఁ? ౨౨

మైత్రేయా! గురువు లిపు డేమి చేయుచున్నారు?

కంచు:—కుమారా! నీవే వచ్చి యన్నియుఁ దెలిసికొనుము.

(తెరలోఁ గలకలము. తరువాత)

ఓహో! ద్రుపదవిరాట ప్రభృతి మహారాజులారా! సైన్యప్రధాన యోధులారా! వినుఁడు.

మ. మును సత్యవ్రతభంగభీత మయి యొ
ప్పం గాంచియుఁ మందమై
ఘనవంశస్థిరశాంతిఁ గోరి యెటులో
కన్పట్టె లేనట్టులే
యన, ద్యూతారణి ద్రౌపదీవసన కే
శాకర్షణుఁ బుట్టి రాఁ
జనకొం తేయక్రుధాగ్ని యే కురువన
శ్రీఁ గాల్ప జృంభించెడిన్. ౨౩

భీమ:—(విని సంతోషముతో) జృంభించుఁగాక! జృంభించుఁగాక! ఆర్యకోపజ్యోతి తిరుగులేక వెలుఁగొంది ప్రజ్వరిల్లుఁగాక!

ద్రౌప:—నాథా! లయకాల మేఘధ్వనివలె భయంకర మైన రణదుందుభి యిపు డనుక్షణ మిటు మ్రోఁగుచున్న దేల?

భీమ:—దేవీ! ఏమియును లేదు. యజ్ఞ మొకటి జరుగుచున్నదిలే.

ద్రౌప:—(ఆశ్చర్యముతో) ఏమి యజ్ఞము?

భీమ:—రణయజ్ఞము. ఎట్లన,

చ. నలువుర మేము ఋత్విజు ల
నన్, హరియే యుపదేష్ట; ధర్మజుం
డలరును సోమయాజి యయి;
యాదవు నీవును సోమిదమ్మవున్;

ఖలు లగుకౌరవుల్ పసులు;
కాంతపరాభవదుఃఖశాంతియే
ఫలము, నరాధిపాళిఁ బిలు
వంగను మ్రోఁగెడుఁ గీర్తి దుందుభుల్." ౨౮

సహ:—ఆర్యా! మనమును గురునాజ్ఞఁ గొని పరాక్రమము చూపుదము రమ్ము.

భీమ:—వత్సా! సిద్ధముగ నున్నాను. (లేచి) దేవీ! కురుకుల నాశనమునకుఁ బోయి వచ్చెదము.

ద్రౌప:—(కంట నీటితో) నాథా! అసురులఁ జంపి వచ్చిన హరి వలె నీవును శత్రువులఁ జంపి వత్తువుగాక!

చేటి:—దేవా! మీరు రణరంగమునుండి విజయగర్వమున వచ్చి దేవి నూఱడింతురుగాక యని యామె యనుచున్నది.

భీమ:—దేవీ! ఏల యీవట్టి యూఱడింపులు.

గీ. పరిభవక్లాంతి లజ్జా విధురిత ముఖుని
నిరవశేషిత కౌరవ్య నిఖిల నిచయు
నను వృకోదరు నింక నెన్నఁడును నీవు
చూడవు నిజంబు నమ్ముమీ సుందరాంగి! ౨౯

ద్రౌప:—నాథా! నాకు జరిగిన యవమానమువలన నీకుఁ గలిగినకోపమున నేమాత్రము యుద్ధరంగమున నేమఱి యుండకుము. రిపు లప్రమత్తులుగదా!

భీమ:—దేవీ! మేము రణభీరులము కాము. సుక్షత్త్రియుల మేలే. ఏలన,

సీ. అన్యోన్య క్రోధోపాధికాస్త్రాల సంభిన్న
కరిరక్తము స్త్రిష్క కర్దమంబు;
ఆకర్దమంబున నత్యంతమగ్న మహా
రథసమూహంబు; లారథసమూహ
ములపయిఁ గమియించు బలవంతులౌ పదా
తులగుంపు; వారి యుద్ధురరణంబు;
రక్తపానప్రీతి రసదశివసృగాల
తూర్యనృత్యోత్క బంధౌఘమయము
గీ. నగుచు బీభత్సరసమున కాలవాల
మయిన సంగ్రామ వార్ధి మధ్యప్రభీత
జలములందునఁ జరియించి జయముఁ గాంచు
పండితాఖండులే చుమీ! పాండు సుతులు. ౨౬

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది

ప్రథమాంకము.

విష్కంభము

కంచుకి:—(ప్రవేశించి) "భానుమతీదేవి గాంధారీదేవికి వందన మొనరించి వచ్చినచో ముం దామెను జూచి తరువాత నభిమన్యునిమరణమునకుఁ గారకు లైనకర్ణాదులను బహూకరింపఁ బోవలయును. కావున, నామె వచ్చినదేమో చూచి ర" మ్మని దుర్యోధనమహారాజు నా కాజ్ఞాపించెను గదా! ఇఁక నే నాలసింపరాదు. ఆహా! ముదిసగ్గు నయి కదలమెదల లేనినాకు సైతి మింతపని కల్పించినది రాజాజ్ఞా బలముకదా! నావార్ధక్యదశ ననుకొనఁ బని లేదు. అంతఃపురపరిచారకు లెల్లర కిట్టివేషచేష్టలు క్రొత్తవి కావుగదా!

చ. కనఁ గలశక్తి యున్నఁ గనఁ
గాదు; వినం గని చెప్పఁ గాదు; చే
తను దృఢగాత్రుఁడై గొలువ
దండము నూఁసక యుండఁ గాదు; లో
ననవరతంబు సందియమె
యూఁటఁ దడంబడుఁ గాళ్లు; రాజసే
వను గల విన్నిపాట్లకట!
వచ్చెనె క్రొత్తగ వార్ధకంబునన్. ౧

(ముందు కేఁగి, ఆకసమువంకఁ జూచి) ఓసీ! విహంగికా! దేవి యత్తమామలను సేవించి వచ్చినదా? (చెవి యొగ్గి) ఏమను చున్నావు? వచ్చి మగనికి జయము కావలయు నని నియమనిష్ఠలతో బాలోద్యానమునఁ గలదేవాలయములో

నున్న దనియా? సరే. నీవు పోయి నీపని చూచుకో. నే నీసంగతి మహారాజునకుఁ జెప్పెదను. (ముందు కేఁగి) సతీమణీ! మంచిది. మంచిది. మహారాజునకంటె నీవే మెఱుఁగు. శ్రీకృష్ణభగవానునితోఁ సైతము పాండవులు నెత్తిపై కెత్తి వచ్చినను రాజు పురవిహారము విడువలేఁడాయె! (ఆలోచించి) స్వామిపను లేమియు బాగు లేవు. ఏలన; ఈతఁడు:

మ. తొలి శస్త్రాభ్యసనంబునుండి త్రిజగ
ద్దోర్వీర్యుఁడౌ గండ్రగొ
డ్డలిదాల్పు భృగురాము గెల్చినయతం
ఠప్రజ్ఞుఁడౌ భీష్ముఁడ
మ్ములశయ్యం బడ నేడ్వఁ; డర్జునను తాఁ
మోఘాస్త్రా యోధాను యో
ధులు విక్రమించి సమష్టిఁ జంప బునుతేఁ;
తోషించు నెంతెంతయో. ౨

అన్నివిధముల నిఁక దైవముతక్క మేలుచేయఁ గలవారు మా కెవ్వరును లేరు. దేవి యిట నున్న దని పోయి మహారాజుతోఁ జెప్పెదను.

(నిష్క్రమించును.)

ఇది విష్కంభము.

వేణీసంహారము

ద్వితీయాంకము

[ఆసనమున భానుమతీదేవి-దగ్గఱగా సఖి సువదన, చేటి తరళిక ప్రవేశింతురు.]

సువ—భానుమతీ! దుర్యోధనమహారాజుభార్యవై యుండి యీ మాత్రపుఁబీడకల కింతగా వంత నొందుట యేల ?

తర:—దేవి! సువదన నిజము పలికినది. నిద్రించినవారికిఁ గలలు కలవరింతలు వచ్చుట లోకసహజముకదా!

భాను:—చెలీ! ఇది సామాన్యపుఁగల కాదు. నిజముగా నిది యేదో కీడు తేఁ గల దని యే నాభయము.

సువ:—అట్లైన నీకు వచ్చిన కల యేమో చెప్పు. మేము దానికిఁ దగినవిఱుగుడు లగునీవులచేతను నోములచేతను నేలవేల్పులదీవనలచేతను దదరిష్టములను బోఁగొట్టుదుము.

తర:—సువదన యన్నది బాగున్నది. చెడ్డకలలైనను నోములు మున్నగు మంచిపనులచేఁ జెడ్డఫలము కాక మంచిఫలమే యిచ్చును.

భాను:—సరే. చెప్పెదను. సరిగా వినుము.

సువ:—ఊఁ. చెప్పు.

భాను:—చెలీ! నాకుఁ గలిగినవెఱపువలన నది మఱచిపోతినే. జ్ఞప్తికిఁ దెచ్చుకొని నెమ్మదిమీఁదఁ జెప్పెదనులే.

(దుర్యోధనుఁడు, కంచుకి, ప్రవేశింతురు)

దుర్యో:—ఎవఁడు చెప్పినాఁడో కాని యీమాట దొడ్డమాట:

గీ. ఎదుటనైనను జాటుగానేని తానో
యొరులో యెవ్వరో కొలఁదియో యున్నతంబో
యైనయపకృతి పగవాని కమరఁ జేయ
నవిరళానంద మొందు నిక్కానము నరుఁడు. ౧

కావున, ద్రోణకర్ణసైంధవాదులచే నభిమన్యుఁడు చచ్చుట వలన నాప్రాణములకు హాయి కలిగినది.

కంచు:—ఆచార్యు లగుద్రోణులయస్త్రశక్తి కిది గౌరవప్రదమా? కర్ణసైంధవులకుమాత్ర మిది యెంత కీర్తికరము?

దుర్యో:—ఒంటిగానిపై నంద ఱొక్కపెట్టునఁ బడి విల్లు విఱిచి చంపు టేటిన్యాయ మని కృష్ణుఁ డన్నాఁడుకదా! మఱి:

క. భండనమున గాంగేయు శి
ఖండిని ముందుంచుకొనియొకా చంపిన దా
పాండవులు; వారి కది తగ,
దండిమగల మైనమాకుఁ దగు నీయశముల్. ౨

కంచు:—దేవా! నీ విట్లు సరిపెట్టుకొనుట తగదు. నీపౌరుష మిట్లు కుంఠిత మగు నని మే మెన్నఁ డనుకొనము. కాన, నట్లంటిని.

దుర్యో:—ఓయీ! నిజమే.

గీ. సేవకులతోడ బాంధవశ్రేణితోడ
భ్రాతృసుతమిత్రబహుళవర్గములతోడ
స్వీయబలముల సని యుధిష్ఠిరుఁడు కూల్చు
సత్యము సుయోధనుని; నింక జంక నేల ? 3

కంచు:—(చెవులు మూసికొని) పాపము శాంతించుఁగాక! పాపము శాంతించుఁగాక! అమంగళము ప్రతిహత మగుఁగాక !

దుర్యో:—ఏమి ? నే నేమంటిని?

కంచు:—"గీ. సేవకులతోడ..." (అనుపద్యము చదివి) యుధిష్ఠిరుఁడు సుయోధనుని గూల్చు నని విపరీతముగఁ బలికితి వేల ?

దుర్యో:—భానుమతి నాతోఁ జెప్పక యెటకో లేచిపోయినది. అందువలన నామతి చలించినది. ఆమె యెట నున్నదో చూపుము.

కంచు:—దేవా! ఇటు. ఇటు.

(ఇరువురును నడతురు)

కంచు:—(ముందు చూచి యంతటను సుగంధ మాఘ్రాణించి) దేవా! చూడుము. చూడుము, మంచుతుంపరులచేఁ జల్లనైనయీయుదయ కాలపుఁలేగాలులవలనను, గూళ్లలో మేలుకొని శ్రుతి సుఖముగాఁ గలకలధ్వనులు చేయుచుఁ బక్షులు తమ రెక్కలు కదల్చుటవలనను, నిటునటు కదలుచుఁ దొడిమ

లూడిపోవఁ దరువులనుండి రాలిపడు చక్కనిపువ్వులు పఱ పులు గాఁగా హృదయంగమముగాఁ గమ్మతావులఁ జిమ్ము కుందపుష్పములసౌరభముతో నొప్పునీబాలోద్యానము :

ఉ. మాపుల విచ్చుపూవులను
మంచును దేనెను గూడిమాడియుః
దేపటిప్రొద్దు భూమిపయి
జివ్వనఁ బూలును దాము రాలిపో;
నాపయి సూర్యకాంతి విరి
యంగఁ దొడంగుచుఁ గమ్మతావులః
వ్యాపనచేయుపద్మముల
ప్రాలెడుఁ జూడుము చంచరీకముల్. ౪

మనో:—(బాగుగాఁ జూచి) ఇది మఱియు మనోహరముగా నున్నది :

చ. అరవిరిదమ్ము లంతటను
నల్లన నల్లన విచ్చఁ బత్త్రముల్
సురుచిరభానుహస్తములు
సోఁకఁగ వేఁడిమి కుల్కి యాంద్రతో
నరవరుఁడీవి మేలుకని
నః మయిపూఁతలు ప్రేమఁ దెల్పఁగా
సరససరోజపత్త్రమృదు
శయ్యల వీడెను గండుఁదుమ్మెదల్. ౫

కంచు:—దేవా! సువదనయుఁ దరళికయు సేవింప దేవి యిట నున్నది. చూడుము.

దుర్యో:—(చూచి) సరే. నీ వేఁగి రథమును సిద్ధము చేయుము. నేను దేవిని జూచి వచ్చెదను. (నిష్క్రమించును)

కంచు:—చిత్తము.

సువ:—నెచ్చెలీ! మఱచినకల జ్ఞప్తికి వచ్చినదా?

భాను:—ఆఁ. వినుము. నే నీపూఁదోఁటఁ గూర్చుండి యుండఁగా నొకచక్కనిముంగిస నూఱుపాములను జంపినది.

ఉభ:—(తమలో) పాపము శమించుఁగాక! అమంగళము ప్రతిహతమగుఁగాక! (ప్రకాశముగా) తరువాతఁ దరువాత?

భాను:—నామనస్సు కలఁగిపోయినకారణమునఁ దరువాతి సంగతి మరల మఱచిపోతిని.

దుర్యో:—సరి. సువదనాతరళికలతో దేవి యేదో మాటాడుచుఁ గూర్చున్నది. ఈగుబురుతీఁగలమాటున నుండి వీరి మాటలు విందును.

సువ:—దేవీ! వగ లుడిగి తరువాత నేమి జరిగినదో చెప్పు.

దుర్యో:—ఈమెవగ యేమోకదా! ఓహో! నాతోఁ జెప్పకే యిలు వెడలి వచ్చినదికదా! నాపైఁ గోపము వచ్చిన దేమో? దేవీ! దుర్యోధనుఁడు నీకోపమునకుఁ దగని వాఁడుసుమా?

ఉ. కోమలి! నీవు బాహులతఁ
గూరిమిఁ గంఠము చుట్టువేళ నే

నేమఱి తోఁసివేసితినో ?
యీాపు నన్నుఁ గనువేళ నిద్రచే
భామిని! మోముఁ ద్రిప్పితినో?
పాడితినో కల నన్యకాంత ? నే
నేమి యొనర్చితినిఁ బ్రియ ! య
నిష్టము దాసులఁబోలెఁ దిట్టఁగన్ ? ౬

(ఆలోచించి) కాక :

గీ. పాలఁతిచిత్తంబు నాయందె నిలువఁబట్టి
యతిశయస్నేహసంబద్ధ మానసూాయ
నేదో యపరాధలేశ మూాహించి దేవి
కుపితయై యుండఁబోలు నిక్కువపుఁద్రేమ. ౭

ఐన, నీమె యే మనునో వింద్రుగాక !

భాను:—చెలీ ! కాని, నా కాయతిశయదివ్యరూపసుకులసందర్శనమున మాాత్రము మిక్కిలిసంతోషము కలిగినది.

దుర్యో:— ఏమి ! అతిశయదివ్యరూపసకులసందర్శనమున సంతోషము కలిగినదా? అయ్యో! మాాద్రీసుతుఁ డగునకులునియం దనురక్తయైన యీామెవలన నే నెంత మోసపోతిని! (సోత్ప్రేక్షముగా ''పొలఁతిచిత్తంబు...'' అనుపద్యము మరలఁ జదివి) ఓరీ! మూఢా ! దుర్యోధనా ! కులటా విప్రలబ్ధుఁడవై నీవు నిన్నెన్నివిధములుగానో మన్నించుకొంటివి. ఇపు డే మందువు ? (''కోమలి ! నీవు'' అనుపద్యమును మరలఁ జదివి దిశలు చూచి) సరే. తెలిసినది. ఇందులకే కాఁబోలు నీమె

కుడయమునసే యేకాంతముగా నుండుటకుఁ గోరికపుట్టుట!
సఖులతో సల్లాపించుట? మోహవశుఁడై దుర్యోధనుఁ డీమె
హృదయము నెఱుఁగక మోసపోయెనుగదా। ఓపాపినీ!
నాభార్యవయ్యుఁ గులట వై ననిర్భాగ్యురాలా!

చ. అతివినయంబు చెంగటను;
సవ్వల నింతటిసాహసంబు ; సం
స్తుతులు కులంగటఁ బ్రణయ
ముం గికురించెదువర్తనం బిటుల్;
సతులు సమీపమం దటు ల
నఁ గినరానికుచేష్టితంబు లీ
గతిని, దురాత్మురాల! యిటు
కాల్తువె సత్కులకీర్తిచంద్రికల్ ? ౮

సువ:—తరువాతఁ దరువాత ?

భాను:—అంత నే నిపుడు కూర్చుండియున్నతీఁగయిల్లు చేరి కూర్చుంటిని. నన్ననుసరించి యానకులకుమారుఁడు నిటకు వచ్చి కూర్చుండెను.

దుర్యో:—ఆహా! ఈజారిణి కిటు చెప్పుకొనుటకు సిగ్గయిన లేదే ? ఇది కులటకు సహజమేకదా ! ఈమె:

గీ. అతి చిరంతన స్నేహభావాభివృద్ధి
నాత్మరతిభోగ మేకాంత మైనరీతి
నేచెలికిఁ జెప్పు నాచెలి కిట్లు తనదు
దుశ్చరిత్రను జెప్పంగఁ దొడఁగె నౌర ! ౯

సువ.తర:—ఏమ్మట ?

భాను:—అంత నాతఁడు పొగరునఁ దనచేతితో నాపైఁట తొలఁగించెను.

దుర్యో:—(ఆలోచించి) ఇది చాలును. ఇఁక, వినఁ నక్కఱ లేదు. అగుఁగాక! పరవనితలఁ బట్టుటలో నిట్లు నిపుణుఁడైనయానకులహాతకుని యసువుల నిదే తీసివేయుదును. (అడుగిడి యాలోచించి) లేక యీపాపశీలను ముందే కడ తేర్తును. (మరలును)

సువ.తర:—తరువాత? తరువాత ?

భాను:—సఖీ! అంతట నార్యపుత్త్రుని వేకువమేలుకొలుపు మంగళవాద్యములతోఁ గలిసినవారకాంతలసంగీతములచే నేను మేల్కాంటిని.

దుర్యో:—(ఆలోచించి) ఏమి? మేలుకొంటి ననుచున్నది. కల గన్నవిషయమా యిది? (మరల నాలోచించి) సరే. సఖి మాటలవలన నిదియుఁ దేలఁ గలదు.

సువ.తర:—(విచారముతో నొండొరులఁ జూచుకొందురు) (ప్రకాశముగా) దేవీ! ఈయహితమును గంగానదీజలములవలనను, భగవానులగు బ్రాహ్మణులయాశీర్వచనములవలనను, సప్తజిహ్వునకు హోమములు చేయుటవలనను బోఁగొట్టు కొందములే.

దుర్యో:—సరి. సందేహ మేల? కలగన్నవిషయమే యీామె చెప్పినది. నేను మందబుద్ధినై వేఱుతెఱఁగున నూహించి తిని. అదృష్టము.

మ. అరమార్పన్ విని విప్రలంభజనితో
ద్యత్రోషధిన్నై పోవ తే,
దరయన్ దక్షిణమారుతచే రుషను నో
రారంగఁ బల్కంగ లే
దు. రహిన్ దత్కథయున్ సమాప్తమయెఁ దో
స్తో నేను నమ్మంగఁ; బు
ణ్యారమన్ గాంత మృషాకళంకమునఁ బా
యన్ లేదు జీవం బహో ! ౯

భాను:— సఖీ! ఈకలవలనిశుభాశుభము లేవో చెప్పుము.

సువదన:—(ఒకరినొకరు చూచుకొని అపవారించి) ఇందేమాత్రము శుభము లేదు. అసత్యము చెప్పరాదుగదా! అది యపరాధమే యగును. పరుషమైనను ప్రియసఖులకు హితమే చెప్పవలయును. (ప్రకాశముగా) సఖీ! నిజమున కిది యంతయు నశుభమునే సూచించుచున్నది. దేవతల దయవలన బ్రాహ్మణులకృపవలన నిది తొలఁగిపోవును. కోఱలు గలజంతువును, ముంగిని, కోఁతిని గలలోఁ గనరాదు. నూఱుపాముల నది చంపుటయు మంచిది కాదు.

దుర్యో:—సువదన యన్నది నిజమే. ముంగి నూఱుపాములఁ జంపుట, దేవిపైఁట దొలఁగించుట, యివి యమంగళములే యగును:

క. ఒకపరి శుభసూచకములు వే
ఱొకపరి నశుభంబు లగుచు నొప్పును గలలున్;
వికలత కలిగెను శతనా
మకసంఖ్యను దమ్ముగమిని మాకది తగుటన్. ౧౦

(ఏడమకన్ను దవులఁగని) దుర్యోధనుఁడ నగు నాకు సైత మనిమిత్తములు పుట్టును గలఁచుచున్నవి. (గర్వముతో) కాదు, కాదు. పిఱికివానినిమాత్రమే కలఁచు నట్టివానివలన దుర్యోధనుని కేమిభయము? అంగిరసుఁ డనుముని చెప్పిన యీమాట లెంతయు సత్యములు;

క. కల, శకునము, గ్రహమును, భూ
తలమున ఫల మిచ్చుఁ గాక తాళీయముగాఁ
జలియింపఁడు ప్రాజ్ఞుఁడు త
త్ఫలమున కిసుమంతయైన ధైర్యము పేర్మిన్. ౧౧

కావున, స్త్రీస్వభావసిద్ధ మగుభానుమతిభయమును నేను బోఁగొట్టుదును.

భాను:—చెలీ! సువదనా! తనకాంతిపుంజము విరజిమ్ముటచే సంధ్యారుణిమ పోఁగాఁ జూచువారికన్నులఁ బోఁడుచుచు సూర్యభగవానుఁ డిదే యుదయించుచున్నాఁడు.

తర:—భట్టినీ! పుటము వెట్టినబంగారముతో సమానమైనకాంతి పుంజమును దట్టముగా నల్లుకొన్నతీఁగలవదుమునుండి ప్రస రింపఁజేసి మనయుద్యానవనమునకు బంగారునీరు పోయుచుఁ జూడ నలవికానిరీతిని సహస్రకరభగవానుఁ డాకాశ మలంక రించినాఁడు. అతనికిఁ బుష్పాంజలులతో నర్ఘ్య మొసఁగుట కిదే యదను.

భాను:—చెలీ! తరళికా! అర్ఘ్యపాత్ర మిటు తే. వేయివెలుఁగులతండ్రి నుపాసించెదను.

తర:—అట్లే. (నిష్క్రమించి మరలఁ బ్రవేశించి) ఇదిగో.

దుర్యో:—దేవికడ కేఁగుట కిదే యదను. (సమీపించును)

సువ:—(చూచి తనలో) మహారా జేలొకో కాని వచ్చు చున్నాఁడు. ఈమొకు నియమభంగ మగునుగదా !

భాను:—(సూర్యునివైపు తిరిగి) భగవానుఁడా! ఆకాశసరోవర మున కేకైకసహస్రపత్త్ర మైనయో దేవా! పూర్వదిగ్వధూ ముఖమండలకుంకుమవిశేషా ! సకలభువనమునకు నేకైకరత్నదీపమా! నాయీవందనములఁ గైకొని నేఁటినాస్వప్న దుర్నిమిత్తములు సానుజుఁ డగునాపతికి శుభప్రదములుగా మార్చివైతువుగాక! (అర్ఘ్య మిచ్చి) తరళికా! పూలు తెమ్ము. ఇతర దేవతలను సేవించెద. (చేతులు చాఁచును)

దుర్యో:—(సంజ్ఞచేఁ బరిజనులఁ బొం డని పూలు స్వయముగా భాను మతిచేతులలో వేయఁబోయి స్పర్శసుఖపరవశతను బువ్వులు నేలపై విడుచును.)

భాను:—(కోపముతో) ఏమి! దాసిజనమున కింతయేమఱుపాటా?

(మరలి రాజును జూచి సిగ్గుపడును)

దుర్యో:—దేవీ! ఇట్టిసేవావసరమున నీసేవకుఁ డంతనిపుణుఁడు కాఁడు. శిక్షణ మిచ్చి యేలుకొనుము. ఓప్రియా!

శా. వాలుంగంటి! భవత్కటాక్షవిలస
ద్భాగ్యంబు నర్థించి నీ
పాలం జేరినదాసునిం గని భయ
భ్రాంతాత్మ వౌ దేటికే ?
ఆలాపింపు ముఖాంబుజంబు స్మితసా
హాయ్యంబునన్ ఫుల్లమై
క్రాలన్. మోఁడ్చెదఁ గేలుదోయిని, సప
ర్యల్ చేయ సంసిద్ధుఁడన్. ౧౩

భాను:—మహారాజా! అనుమతింపుఁడు. నా కింకొక నియమ
ముపైఁ గోరిక కలదు.

దుర్యో:—నీకలగన్న సంగతి యంతయు వింటిని. సహజముగా
నతిసుకుమార మైననీశరీరము నింత క్లేశపెట్టకుము.

భాను:—ఆర్యపుత్త్రా! న న్నొకశంక మిక్కిలి బాధించు
చున్నది. అనుమతింపుఁడు.

దుర్యో:—(గర్వముతో) నీ కేశంకయుఁ గూడదు. ఏలన:

మ. ఇల కంపింప దిశాళి నిండినఘలం
చేదీ మదక్షౌహిణీ
బలముల్? ద్రోణుఁడు కర్ణుఁడుర్ గలుగు లా
భం బేమి? నీ విట్లు గాక.
లలనా! భ్రాతృశతాస్మదీయబలకాం
తారాంతరచ్ఛాయలర్
గలదుర్యోధనకేసరీంద్రసతి! శం
కాతంక మింకేటికే? ౧౪

భాను:—ఆర్యపుత్త్రా! నీదగ్గఱ నాకు శంకకుఁ గారణ మేమి
యును లేదు. ఆర్యపుత్త్రునికోరిక సిద్ధింపవలయు ననియే
నేఁ గోరుచున్నాను.

దుర్యో:—ఓసుందరీ! ఐన, నీతో విహరించుటే నాకోరిక.
చూడు.

మ. అనురాగ స్తిమితాక్షియుగ్మ మది ప
ద్మానంతశోభర్ నగర్;
ఘనలజ్జర్ బలుకుల్ తడంబడఁగఁ; జి
ర్నవ్వాప్ప లోలోనఁ; బెం

పును గఁ లత్తుకతోఁడికెంబెదవి చె
లొప్పుందఁ సఖీ! పూర్ణచం
ద్రునికాంతిఁ బురుడించునీముఖము గా
దో దుర్లభం బెంతయుఁ. ౧౫

(తెరలోఁ మహాకలకలము. అందఱు సంభ్రమముతో విందురు)

భాను:—(దుర్యోధనుని గౌఁగిలించుకొని) ఆర్యపుత్రా! రక్షింపుము. రక్షింపుము.

దుర్యో:—(అంతయుఁ గలయఁ జూచి) భయపడకు. సఖీ! భయపడకు. ఇదిగో:

ఉ. పాదపపంక్తి పెల్లగిల
బంధురకాండకషంబునఁ బొగల్
మేదిని గ్రమ్మఁగాఁ దృణస
మీడితమై దివి ధూళి రేఁగఁగా
నాదము లుప్పతిల్లి భవ
నంబుల మేడలఁ జేర శర్కరా
పాదితమై జగం బులియ
వాయువు వీచెడు భీతి యేటికిఁ? ౧౬

సువ:—మహారాజా! దారుపర్వతప్రాసాదమును బ్రవేశింపుఁడు. ఈపెనుదుమారము కన్నులఁ గప్పివేయుచున్నది. పెళపెళమని పడుచెట్లధ్వనివలన నశ్వశాలలోనిగుఱ్ఱములు బెదరి కట్లు ద్రెంచుకొని పరుగులెత్తుచున్నవి. పరిజను లెల్లరును మూలల కొదిఁగిరి. ఈగాలిబాధ చాల భీకరముగ నున్నది.

దుర్యో:— ఈసుడిగాలి నిజముగా నాకు మహోపకారి. ఏలన, దీనిదయవలననే యప్రయత్నముగా నియమము విడిచి దేవి నామనోరథ మీడేర్చినది. ఎట్లన దేవికి :

మ. కనుబొమ్మల్ ముడి గాంచ లేదు; మఱి పొం
గన్ లేదు కన్నీరు; మో
మును గోపంబును గాంచ లేదు; శపథం
బుల్ పల్కి వారింపకే;
స్తనముల్ హత్తి యొసంగె నా కిటు ప్రసి
ద్ధం బైనయాలింగనం
బును భీతాత్మత దేవి; యీపవన మా
ముఖ్యాప్తమిత్రం బహో! ౧౭

నాకోరిక సిద్ధించినది. ఇంకఁ గామచారమునకు దారుపర్వత ప్రాసాదమునకే పోవుదును. (అందఱు వాయుబాధచేఁ గట్టున నడతురు.)

దుర్యో:— దేవీ !

గీ. మెల్లమెల్లన నడుగుల నుల్లసిల్లఁ
జేసి నడుపుము వణఁకకు స్నిగ్ధబాహు
లతికఁ బెనవేయుమీ నన్ను సతి! యురంబు
గాఢకుచఘర్షణంబున గాయపఱుప. ౧౮

(ప్రవేశించి) ప్రియా! ఈలోపలియింటిలోనికి గాలి చొరఁ జాలదు. కనులలోఁ బడినవలకలు తుడుచుకొని కన్నులు తెఱువుము.

భాను:—(ఆనందముతో) అబ్బ! గాలిబాధ తగ్గినది.

సువ:—మహారాజా! దేవితొడలు పర్వతారోహణమున నలసి నవి. ఆసనము లలంకరింపుఁడు.

దుర్యో:—(భానుమతిని జూచి) ఈసుడిగాలి నీకుఁ జేసినకీడు స్వల్పమే. ఐనను:

చ. నలుసులు చిన్నవైన నయ
నంబులు పెద్దవి కాన బాధ యౌ;
నలఁతియె కంప మైనను గు
చాత్మకవక్షము ధూతహార మౌ;
విలసిలుఁ గంపముల్ జఘన
విస్తృతి యూరులఁ జేరినంతనే;
చెలియ! త్వదంగముల్ పవను
చెల్మిని నిన్నిటు బాధపెట్టెడున్. ౧౯

(అందఱును గూర్చుందురు)

దుర్యో:—ఏమి? దేవి కఠిన మైనశిలాతలమునఁ గూర్చున్నది! దేవీ!

గీ. గాలిచేతను నీయంశుకంబు తొలఁగఁ
గనులపండువు గొల్పునీఘనజఘనము
గౌరవించును నాయంశుకంబు తొలఁగ
నువిద! నీచూపుఁ దన్పు నాయూరుయుగము. ౨౦

(కంచుకి తెరఁ జించుకొని తత్తఱమునఁ బ్రవేశించును.)

కంచు:—దేవా! భగ్నము. భగ్నము.

దుర్యో:—ఎవనిచే.

కంచు:—భీమునిచే.

దుర్యో:—ఏమి యీ [యనర్థక] ప్రలాపము?

భాను:—ఆర్యకంచుకీ! నీవు చెప్పఁదలఁచినది స్పష్టముగఁ జెప్పుము.

దుర్యో:—చీ! ప్రేలరీ! ముదివగ్గా! నీ కీపిచ్చి యెట్లు కలిగినది?

కంచు:—దేవా! భ్రాంతి లేదు. నిజమే చెప్పుదును:

గీ. భగ్నమయ్యె వృకోదరపవనుచేతఁ
బ్రీతిఁ గూర్చెడినీరథకేతనంబు
కింకిణీక్వాణబద్ధమై క్రిందఁబడియె
బిగ్గరగ నేడ్చునట్టు లప్రియకరముగ. ౨౧

దుర్యో:—ఈపెనుగాలిచే భూమియే కంపించినది. రథకేతనము పడుటలో వింత యేమి? ఇంతమాత్రమున కంతగా భగ్నమైన దని ప్రేలెదవేల?

కంచు—దేవా! ఏమియును లేదు. ఈయనిమిత్తమునకు శాంతి చేయుఁడని తమతోఁ జెప్ప నాస్వామిభక్తి నన్నట్లు పలుకఁ జేసినది.

భాను:—ఆర్యపుత్త్రా! ఈయనిమిత్తములను విప్రమండలాశీర్వచనఘోషమునఁ బోఁగొట్టుకొందము.

దుర్యో:—సూతుఁడా! నీవు పోయి సుమిత్రుఁ డనుపురోహితునితోఁ జెప్పుము.

కంచు:—చిత్తము. (నిష్క్రమించును)

(ప్రవేశము : ప్రతీహారి)

ప్రతీ:—(ఉద్వేగముతో) జయము! జయము! మహారాజా! అల్లురగు జయద్రథులవారితల్లియు దుస్సలకుమారియు వచ్చి ద్వారముకడ నున్నారు.

దుర్యో:—(తనలో) ఏమి! జయద్రథమాతయు దుస్సలయునా ? అభిమన్యునిమరణమునఁ గలిగినకోపమునఁ బాండవు లేమైన నుపద్రవముఁ గలిగించిరేమో ? (ప్రకాశముగా) త్వరగాఁ బ్రవేశపెట్టుము.

ప్రతీ:—చిత్తము. (నిష్క్రమించును)

(అంత సంభ్రాంతలై జయద్రథమాతయు దుస్సలయుఁ బ్రవేశింతురు.)

ఉభ:—(కన్నీటితో దుర్యోధనుని పాదములపైఁ బడుదురు.)

జయ:—కురునాథా! రక్షింపుము. రక్షింపుము.

దుస్స:—(ఏడ్చును.)

దుర్యో:—(తొందరగా లేచి) అంబా! ఊఱడిల్లుము. ఏమి సంగతి? సంగ్రామమున నప్రతిరథుఁ డగుజయద్రథునకుఁ గుశలమేకదా !

జయ:—నాయనా! ఏమి కుశలము?

దుర్యో:—ఏమి ?

జయ:—(దుఃఖముతో) నిజపుత్త్ర వధచేఁ గోపిష్ఠియై యర్జునుఁడు సూర్యుఁ డస్తమించులోపుననే జయద్రథుని వధింప శపథము పట్టినాఁడు.

దుర్యో:—(నవ్వుచు) ఇదియా! మీదుఃఖకారణము! పుత్త్రశోకమునఁ బిచ్చియెత్తి యర్జునుఁడు ప్రేలినమాటల కిట్లు సంతాపింతురా ? ఆహా! ఏమి! అబలలముగ్ధత్వము. అంబా! విషాద మందకుము. వత్సా ! దుస్సలా! ఏడువకు. ఇట్టి దుర్యోధనరక్షితుఁ డగు జయద్రథమహారాజున కెట్లు విపత్తు కలుగును?

జయ:—వత్సా! పుత్త్రబంధువధవలనఁ గలిగినకోపాగ్నిచేఁ బాండవులు శరీరములను సరకుగొనక వీరవిహారము చేయుచున్నారు.

దుర్యో:—(నవ్వి) ఔను! పాండవులకోపము సర్వజనప్రసిద్ధమే. చూడు:

చ. కరమునఁ గొప్పుఁబట్టి పయి
గా నటు లీడిచి కట్టుఁబుట్టముల్
తొరఁగఁగ విప్పి యాసభను
ద్రోవది "నోపశువా!" యటంచుఁ బ
ల్మరు లటు పిల్వఁగా నచట
మ్రాన్పడి యుండఁడె యగ్రజుండు; నిం
కరయఁగ రాచపుట్టువున
కన్యము గల్గునె క్రోధహేతువుల్? ౨౩

జయ:—జాతా! తనప్రతిజ్ఞ నెఱవేఱనిచో నాత్మహత్య చేసికొందు నని యాతనిశపథము.

దుర్యో:—ఐన, మఱియు మంచిది. ఈ యానందవిషయమున కిటు విషాద మందుదు రేల? యుధిష్ఠిరుఁడు తమ్ములతో నశించె ననియే యానందింపుఁడు. ధనంజయునకుఁ గాని మఱి యన్యునకుఁ గాని కురుశతపరివారవర్ధితమహిముఁడు, కృతవర్మకర్ణద్రోణాశ్వత్థామాదిమహారథద్విగుణీకృతనిరావరణవిక్రముఁడు నగుజయద్రథుని పేరైనఁ దలఁప వశమా? నీవు నీపుత్త్రినిపేరిమి నెఱుఁగనిదానవు:

గీ. భీముశౌర్యము నర్జునువిక్రమంబుఁ
దలఁచి ధర్మజుఁ గవలను దలఁపరాదు.
వీరిలోనైన నెదిరించి పోర నెవఁడుఁ
జాలఁడు జయద్రథుఁడు విల్లు కేలఁ గొనిన. ౨౩

భాను:—ఆర్యపుత్త్రా! ఏమైన నట్టిఘోరప్రతిజ్ఞ చేసినయర్జు నుఁడు భీతావహుఁడుగదా!

జయ:—వత్సా! కాలోచితముగాఁ బలికితివి.

దుర్యో:—ఏమి! నాకును బాండవులు భీతావహులా? వినుము:

సీ. కోదండశింజనీఘోరకిణాంకులు
నగణితరిపువీరహరులు తమ్ము
లాముక్తవర్ములు నన్యోన్యమిత్త్రులు
నూర్వురు సితపద్మనులనుబోలు
నాతపత్రంబుల నరుదేరఁ బెనురజ
మ్మాదిత్యతేజమ్ము నడఁపఁజాల
విచ్చుకత్తులు పూని విచలదసిలతాప్ర
బంధురంబుగ దెసల్ పర్వ నడవ
గీ. సకలసైన్యసుయోధులు సర్వభూమి
యీనినటు లుండి మాత్సర్య మూని శత్రు
వితతిఁ జెండాడ నెత్తి జృంభింపఁగలరు
భయ మదేటికి నీకింకఁ బాండవు లన? ౨౪

భానుమతీ! పాండవప్రభావ మెఱిఁగినదాన వయ్యు నీవును భీతిలెదవేల? చూడుము:

గీ. దుస్ససేను నెడంద నెత్తురులు ద్రావ
గదను దుర్యోధనునితొడల్ ప్రిదులఁగొట్టఁ
బాండవులు చేసియున్నట్టి ప్రతిన, లటులె
సైంధవునిఁ జంపుశపథము జడియ నేల? ౨౩

ఎవ రక్కడ? చైత్రరథమును రప్పింపుము. వెంటనే నేను పాండవమధ్యముని వ్యర్థప్రతిజ్ఞునిఁ గావించి యాతని శశస్త్రపూత మగుమరణము నాపాదించెదను.

కంచుకి:—(ప్రవేశించి) దేవా!

క. బంగరుచిఱుగంటలు మ్రోఁ
గంగను బ్రాలంబపిచికాహాసము వె
ల్గంగను వల్గితహయరథ
ముం గొని వచ్చితి క్షపితరిపుమనోరథముక్. ౨౭

దుర్యో:—దేవీ! నీవు లోని కేఁగుము. (వెంటనే నేను... ఇత్యాదిని మరలఁ జదువుచుఁ బరిక్రమించును.)

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది ద్వితీయాంకము.

ప్రవేశకము

(వికృతవేష యగురాక్షసి ప్రవేశించును)

రాక్షః:—(వికటముగా నవ్వి యానందముతో)

క. చచ్చినమనుజులమాంసము
మెచ్చుగువస నెత్తు వేయి మేల్కడవలలో
నచ్చుగ దాఁచితిఁ; ద్రావెద
నిచ్చటఁ; బో రుండుఁగాక యిల నూఱేఁడుల్. ౧

(సంతోషమున నెగిరి గంతులు వేయును) సైంధవునిఁ జంపిననాఁటి వలె నిత్యము నర్జునుఁడు యుద్ధము చేయుచున్న నాయిల్లంతయు రక్తమాంసములతోడనే నిండియుండును. (ముందుకేఁగి దెసలు చూచి) ఆహా! రుధిరప్రియుఁ డెక్కడ నున్నాఁడో? (నడచి) వానిని బిలిచెదను. రుధిరప్రియా! రుధిరప్రియా!

రుధిరప్రియుఁడు:—(ప్రవేశించి, ఆయాసపడుచు)

క. మనుజులక్రొన్నెత్తురు వె
చ్చనిమాంసము దొరకెనేని సత్వరముసఁ బో
వునుగద! నాశ్రమ మంతయు
క్షణమాత్రములోనఁ బరమసంతోషముగన్. ౨

రాక్షః:—(మరలఁ బిలుచును)

రుధి:—(విని) ఎవరి దీపిలుపు! (చూచి) ఓహో! వసాగంధ. (దగ్గఱకుఁ జేరి) వసాగంధా! నన్నేల పిలిచితివి?

రాక్షః:—ఓరుధిరప్రియా! నీకోస మిపుడే చచ్చినయొకరాజర్షి శరీరావయవములనుండి దొరకి వసాస్నేహమునఁ జిక్కనైన

గోరువెచ్చని క్రొన్నెత్తురు హృదయమాంసము తెచ్చి తిని. ఇవిగో.

రుధి:—(సంతోషముతో) సెబాస్: వసాగంధా! సెబాస్. గృహిణీ! నాకు శోభనము చేసితివి. నే నీతిండి కెదురెదురు చూచుచుంటిని. నా కెంతో దాహ మగుచున్నది.

రాక్ష:—ఓరుధిరప్రియా! ఈరీతి హతనరగజతురగశోణితవసా సమ్మర్ద మైనయుద్ధరంగమున నుండియు నీవు దప్పిగొనుట నా కాశ్చర్యముగ నున్నది.

రుధి:—ఓసీ! ఘటోత్కచుఁడు చనిపోవుటవలనఁ బుత్త్రశోకమున నున్నహిడింబాదేవిని జూచిరా నేఁగితినే.

రాక్ష:—ఇంకను హిడింబాదేవి ఘటోత్కచునికొఱ కేడ్చుచునే యున్నదా?

రుధి:—ఆమె యెట్లూరకుండును? అభిమన్యునిచావున నట్టి దుఃఖములో నేయున్నసుభద్రాద్రౌపదు లామె నోదార్చుచున్నారు.

రాక్ష:—రుధిరప్రియా! పెద్దయేనుఁగుపుఱ్ఱెలో నుండి తీసి దాఁచినరక్తమాంసము లివిగో. పుచ్చుకో.

రుధి:—(పుచ్చుకొని త్రాగి) వసాగంధా! నీ వేమాత్రము రక్తమాఁసముల దాఁచియుంచితివి?

రాక్ష:—వెనుక దాఁచియుంచినవి నీవే యెఱుఁగుదువు. ఇపుడు దాఁచినవి వినుము. భగదత్తునిశోణిత మొకకడవ; సైంధవునివస కుండెఁడు. ద్రుపదమత్స్యరాజభూరిశ్రవస్సోమదత్త

బాహ్లీకప్రముఖులయు, రాజులయుఁ దక్కినసామాన్యులయు మాంసము, వస, నెత్తురు వేలకొలఁదికడవలు.

రుధి:—(సంతోషముతోఁ గౌఁగిలించుకొని) సెబాస్. నీ వెంత మంచిభార్యవే. నీవంటి బంగరుభార్యవలన, హిడింబకృప వలన, నాదారిద్ర్యము తొలఁగినది.

రాక్ష:—హిడింబకృప యెట్టిది?

రుధి:—ఇపుడే హిడింబాదేవి నన్ను సబహుమానముగాఁ బిలిచి "రుధిరప్రియా! నీవు నేఁడుమొదలు సమరమున నార్యపుత్త్రిని వెనువెంటఁ దిరుగుచుండు" మని యాజ్ఞాపించినది. ఇఁక నా కేమికొఱఁతే? ఆఁకలిదప్పు లెఱుఁగక స్వర్గసుఖ మనుభవించెదను. నీవును రక్తమాంసములను శ్రద్ధగా వేయికడవలు దాఁచియుంచుము.

రాక్ష:—నిన్ను దేవియార్యపుత్రునితో నుండుమన్న దేల?

రుధి:—భీమసేనుఁడే దుశ్శాసనునిరక్తముఁ ద్రావఁ బ్రతినపట్టి నాఁడు. కాన, నీ వాతనిలో నుండి రక్తపానము చేయు మని నన్నంపినది.

రాక్ష:—దేవీ! మంచిది నీదయవలన నాభర్తపుణ్యము పండి నది.

(తెరలో మహాకలకలము)

ఉభ:—(విందురు)

రాక్ష:—(విని) ఏమి యీకోలాహలము?

రుధి:—ధృష్టద్యుమ్నుఁడు ద్రోణుని సిగఁ బట్టి కత్తితోఁ గుత్తుక నఱకుచున్నాఁడు.

రాక్ష:—మనముకూడ నేఁగి ద్రోణునిరక్తము త్రాగుదమా?

రుధి:—ఓసి! నీయిల్లు కాల! అది విప్రరక్తమే! అది త్రాగినఁ గంఠము మండి చచ్చిపోవుదుము.

(తెరలో మరలఁ గలకలము)

రాక్ష:—మరల నీకలకల మేమి?

రుధి:—అశ్వత్థామ కత్తి చేతఁ బట్టుకొని యిటే వచ్చుచున్నాఁడు! ధృష్టద్యుమ్నునిమీఁదికోపమున నాతఁ డేమి చేయునో? నేను బోయి హిడింబాదేవి చెప్పినట్లు చేయు

(నిష్క్రమింతురు)

ఇది ప్రవేశకము.

——

వే ణీ సం హా ర ము

తృ తీ యాం క ము

[ఒరనుండి తీసి పైకెత్తిపట్టినకత్తితో నశ్వత్థామ కలకల మాలించుచుఁ
బ్రవేశించును.]

అశ్వ:— ఈరణభూమిని:

గీ. ప్రళయమారుతక్షుభితసంవర్తమేఘ
ఘోరగర్జితప్రతిరవకారి యగుచుఁ
జెవు లవియ రోదసియు నిండ మిన్నులఁ బుట్టె
నెన్నఁ డెఱుఁగనియీధ్వని యేమి చెపుమ? ౧

(ఆలోచించి) నిజము. గాండీవి కాని సాత్యకి కాని భీమసేనుఁడు కాని యౌవనదర్పమున మర్యాద మీఱి వర్తించినఁ గోపించి తండ్రి విజృంభించి పాండవులమీఁదిశిష్యప్రేమ విడిచి నిజశక్తిఁ జూపియుండును. ఏలన:

మ. అల దుర్యోధనపక్షపాతసదృశం
బస్త్రగ్రహోత్యోచితం
బలఘుశ్రీభృగురామలబ్ధఘనశ
స్త్రాస్త్రానురూపంబు ని
శ్చలధానుష్కగురూత్తమోత్తమగుణా
సాధ్యంబు నాతాత పా

దులకృత్యం బిది; యేఁడు పూర్ణోక్తను సనిన్
ద్రోణున్ మహావీరునిన్. 2

(వెనుకఁ జూచి) ఈరథముకొఱకు కెదురుచూచుట చాలును. సజలజలధరప్రభాభాసురమై స్వర్ణమయముష్టిఁ గలిగినయీ కత్తియే నాకు సమస్తమును. వెంటనే రణరంగమున నుఱికెదను. (నడచి, ఎడమక న్నదరుటఁ గని) ఏమి! సమరమహోత్సవప్రమోదనిర్భరతాతవిక్రమదర్శనలాలసుఁడను, అశ్వత్థామ నైననాకును నీదుశ్శకునములు సమరగమనవిఘ్నము లగుచున్నవే! కానిమ్ము. (గర్వముతో నడచి ముందు చూచి) ఏమి! సర్వక్షాత్రధర్మములు విడిచి, సత్పురుషోచితలజ్జావగుంఠనముల వీడి, విస్మృతస్వామిభక్తిలఘుచేతస్కులై యగణితకులబలసదృశప్రతాపములనుగలిగియు నీరథద్విరదతురగపాదచారులు రణభూమికిఁ దొలఁగి పాఱిపోవుచున్నారే! (నిరూపించి) అయ్యో! కష్టము. కష్టము. కర్ణాదిమహారథులును యుద్ధపరాఙ్ముఖు లగుచున్నారే! పితాధిష్ఠిత మగు కౌరవబలమున కీయవస్థ రాఁ గారణ మేమి చెప్పుమా! ఏమైనఁ గానిమ్ము. ఓకౌరవసేనాసముద్రవేలాపరిపాలనమహామహీంధరు లగు నరపతులారా! ఈసమరపరిత్యాగసాహస మేల?

గీ. రణముఁ దొరఁగిన మృత్యువు రాకయున్నఁ
బోపవచ్చును వేఱొకభూమి కకట!
చావు తప్పదు జనులకుఁ జేవ దక్క
దుర్యశంబును గొననేల? దుర్మతు లయి. 3

మఱియు:

చ. ప్రతిబలవార్ధి హేతియుత
బాడబుఁడున్ మహిం సర్వధన్వినం
తతికిని సద్గురుండు నగు
తండ్రి చమూపతి యై చెలంగ నీ
గతిని భయం బదేల? నిలు
కర్ణ! కృపా! కృతవర్మ! నిల్వుఁడీ
ధృతిమెయిఁ బాఱిపోకుఁ డిటు
దీనత నక్కట మానహీనులై. ౪

(తెరలో:-"ఇంకను నీతండ్రి యెక్కడ?")

అశ్వ:—(విని) ఏమంటిరి? "ఇంకను నీతండ్రి యెక్కడ" యనియా? ఓరీ! క్షుద్రులారా! ఇట్లు ప్రేలుచున్న మీనాలికలు వేయి చీలికలు కావేమి?

మ. భువనం బేర్పఁగ ద్వాదశార్కు లుదయం
బుం బొంద లే దింక; స
ప్తవిధం బై లయకాలవాయువులు వీ
వన్ లేదు; సంవర్తమే
ఘవితానం బది యాక్రమింపదు వియ
ద్గర్భంబు; నస్మత్పితన్
జవజీవంబుల శౌర్యరాశిఁ బలుకన్
భావ్యంబె పాపాత్మకుల్! ౫

(సంభ్రాంతుఁడై దెబ్బలుతిన్న సూతుఁడు ప్రవేశించును)

సూతు:—కుమారా! రక్షింపుము. రక్షింపుము. (పాదములపైఁ బడును)

అశ్వ:—(చూచి) ఏమి! తండ్రిసారథ? అశ్వసేనుఁడే! ఆర్యా! మూఁడులోకములు రక్షింపఁజాలినతండ్రిసారథివై యుండి నాశరణముఁ గోరనేల?

సూతు:—(లేచి దుఃఖముతో) ఇంకను నీతండ్రి యెక్కడ?

అశ్వ:—(ఆవేగమున) ఏమి! నాతండ్రి లేఁడా?

సూతు:—ఉన్న నిఁక నేమి?

అశ్వ:—అయ్యో! తండ్రీ! (మూర్ఛిల్లును)

సూతు:—కుమారా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

అశ్వ:—(తెలివంది) అయ్యో! తండ్రీ! సుతవత్సలా! హా! త్రిలోకైకధనుర్ధారీ! హా! పరశురామసర్వాస్త్రప్రతిగ్రహనిపుణా!

సూతు:—ఆయుష్మంతుఁడా! ఇంతదుఃఖమును దిగమ్రింగుకొనుము. నీతండ్రి వీరపురుషోచిత మగుమరణము నందినాఁడు. నీవును దాని కనురూప మగుశౌర్యమున శోకసముద్రమును దాఁటి సుఖింపుము.

అశ్వ:—ఆర్యా! చెప్పుము. చెప్పుము. అట్టిభుజవీర్యాస్త్రప్రభావసాగరు లగుపితృదేవు లెట్లు మరణించిరి?

మ. గదచేతన్ గురుదక్షిణన్ బ్రియమునన్
గైసేసెనే భీముఁడు?

సూతు:—కాదు. కాదు.

అశ్వ:—ఉ, న్మదుఁడై గాండీవి శిష్యవత్సలుని స
మ్మానించెనే యమ్ములన్?

సూతు:—అదియును గాదు.

అశ్వ:—మది గోవిందుఁడె కోరి చక్రమునఁ జం
పన్ లేదుగా సద్గురున్?

సూతు:—కాదు. కాదు.

అశ్వ:—మదిలో నాల్గవవాఁడు తోఁపఁడు పితన్
ప్రమందించుశక్తుం డీకన్. ౬

సూతు:—కుమారా! నీతండ్రి:

మ. రణరంగంబునఁ గ్రోధమూర్తి యయి శ
స్త్రప్రక్రియన్ జేత మా
ర్గణముల్ తాల్చిన సైఁచువారుఁ గలరే?
గాండీవి యేలెక్క? యా
తనికిన్, దారుణశోకభారమున శ
స్త్రం బుజ్జగింపన్ దనం
తను దాఁ; గ్రూరరిపుండు చంపె సతినిన్
వత్సా! కడుం గ్రూరతన్. ౭

అశ్వ:—అతనిశోకావేగమునకుఁ గాని యస్త్రత్యాగమునకుఁ గాని కారణ మెవరు?

సూతు:—నీవే.

అశ్వ:—నే నెట్లు?

సూతు:—(కన్నీరు విడిచి) వినుము:

మ. పలికెన్ బిగ్గరగా యుధిష్ఠిరుఁడె "య
శ్వత్థామ స్వర్గస్థుఁ"డం
చల మెల్మెల్లన "నేనుఁ" గంచుఁ దనలో
నాపిమ్మటం బల్కె నా

తొలిమాటన్ విని పుత్త్రశోక హతుఁడై
ద్రోణుండు బాష్పాంబుధా
గలలో మున్గి యొనర్చె వత్స! సకలా
స్త్రత్యాగమున్ నాఁ డనిన్. ౮

అశ్వ:—అయ్యో! తండ్రీ! హా! సుతవత్సలా! వ్యర్థముగా నాకొఱకై మరణించితివా? తండ్రీ! అయ్యో! శౌర్యరాశీ! హా! శిష్యప్రియా! హా! యుధిష్ఠిరపక్షపాతీ! (దుఃఖించును)

సూతు:—కుమారా! ఇటు లింత పరితపించుట తగదు.

అశ్వ:—

చ. మృష యగునామృతిన్ వినుట
మిక్కుట మాసుతవత్సలత్వస
ద్విషయమునన్ బితా! శరముఁ
బిమ్మటఁ బ్రాణము వీడినాఁడవే!
మృష యనరానినీమృతిని
మేదిని గాంచియుఁ జావనైతి; నా
విషయము క్రూర మిట్టియెడఁ
బ్రేమముఁ జూపితి వెట్లు నాపయిన్? ౯

(మూర్ఛిల్లును)

సూతు:—కుమారా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

(అపు డుద్వేగముతోఁ గృపుఁడు ప్రవేశించును.)

కృపు:—అయ్యో!

చ. కురుపతి యేల? యింకతని
కూర్మితమ్ములు నేల? యాయుధి

ష్ఠిరుఁడును శస్త్రధారిన్నృప
సింహులు నిందఱుఁ గాల్పవా ? కటా!
కురుసభఁ బాండుపత్ని నటు
క్రూరరణంబున ద్రోణు నిట్టులు
చ్చెరువుగఁ గేశసంగ్రహణ
శీర్షులఁ గంటిమి సిగ్గుచేటుగన్. ౧౦

ఇటులైనపిమ్మట వత్స యగునశ్వత్థామముఖ మెట్లు చూడఁ గలను ? ఐన, నాతఁడు ధైర్య హేమాచలుఁడు, విజ్ఞాత లోకస్థితుఁడు. కాన, సంతగా దుఃఖింపఁడు. ఏమైనను, అసదృశ మగు నిట్టి పితృపరాభవము విని యాతఁ డెంత ఘోరకృత్య మొనరింపఁ గడంగునో యెఱుఁగఁజాలకున్నాఁడను. ఇది కాక !

క. తొలిద్రౌపది కేశగ్రహ
ఫల మనుభూతం బగుచునుండె బంధురముగ నిం
కిల రెండవ కేశగ్రహ
ఫల మనుభూతంబ యగును బ్రవినాశమునన్. ౧౧

(చూచి) వత్స యిట నున్నాఁడు. సమీపింతును. (సమీపించి సంభ్రమముతో) వత్సా ! ఊఱకుండు మూఱకుండుము.

అశ్వ:—(తెలివంది దుఃఖముతో) అయ్యో ! తండ్రీ ! సకలభువనైకగురూ ! (ఆకసము చూచి) ఓ యుధిష్ఠిరా !

ఉ. పుట్టిననాఁటినుండియును
బొంకి యెఱుంగ వజాతశత్రుఁడా !
మెట్టితి కీర్తి యన్యులకు
మేలె యొనర్చియు నా యభాగ్యముం

బట్టియె మట్టిఁ బెట్టితివి
మాటనె బొంకి యనంతకీర్తి; నో
కట్టిఁడి! నీ వెఱుంగవె కృ
తఘ్నుఁ దండ్రిని బ్రాహ్మణోత్తమున్? ౧౨

సూతు:—వత్సా! ఇదిగో! నీమామ శారద్వతుఁ డరుదెంచి నీ పక్కఁ గూర్చుండి యున్నాఁడు.

అశ్వ:—(పక్కకుఁ జూచి కన్నీటితో) మామా! మామా!

మ. ఎవనిం గూడి రణాంగణంబునకు నీ
వి ట్లేఁగి యున్నాఁడవో
యెవఁ డా వీరులచేతి తీఁటకును నం
తే నాశకుం డెప్పు; డీ
వెవనిం జేకుదు నవ్వులాటలకు నై
యింపొంక్రియన్, శౌర్యవి
ప్రవరుం డాతఁడు నీమఱంది యెటు పో
వం గాంచెనో చెప్పవే? ౧౩

కృపు:—వత్సా! అంతయు నీకే తెలియును. మఱి యింక విచారింపకుము.

అశ్వ:—మామా! నా దుఃఖమును విడిచి సుతవత్సలుఁడైన తండ్రికడ కిదే పోవుచున్నాను.

కృపు:—వత్సా! ఇది నీకుఁ దగినది కాదు.

సూతు:—కుమారా! సాహసము వలదు.

అశ్వ:—ఆర్యా! ఏమంటివి?

గీ. మద్వియోగభయంబున మహితుఁ డైన
జనకుఁ డరిగెను బరలోకమునకుఁ గాన
నెటులు విరహంబుఁ గలిగింతు నిపు డతనికి
నతని వాత్సల్యమున కిది ప్రతిఫలంబె ? ౧౮

కృపు:—వత్సా ! ఈ ప్రపంచమున నున్నంతవఱకు లోక
యాత్ర తప్పదు. పుత్త్రులు తండ్రి నుభయలోకములందు
ననుసరింపవలయును గదా !

గీ. తర్పణంబున మఱియు శ్రాద్ధంపుఁగర్మఁ
దండ్రి కుపకార మొనరింపఁ దగుదు వీవు
బ్రతికి యుండిన; నటుగాక మృతిని గన్న
దేనికిం గొఱగావుసూ దాన వత్స ! ౧౯

సూతు:—ఆయుష్మంతుఁడా ! శారద్వతుఁడు చెప్పినట్లు నడచు
కొనుము.

అశ్వ:—ఆర్యా ! నిజమే. భరింప రాని యీ పితృవిరహమున
క్షణమైనను బ్రాణములు నిలుపఁజాలకుంటిని. అందుచేఁ
దండ్రి పడియున్నకడకైన నేఁగి యాతనిం జూచెదను!
(లేచి కత్తిఁ జూచి, ఆలోచించి) ఈశస్త్రమును గైకొనుటవలనఁ
గలిగిన ప్రయోజన మిఁకఁ జాలును. ఓ పూజ్యశస్త్రమా !

చ. ఉచితము కాకపోయినను
నోటమిభీతి నెవండు నిన్నుఁ దా
లిచెనో, తలంప నెవ్వనికి
లీలఁ గ నీకెదు రెందు లేదొ యా
సుచరితుఁ డాత్మపుత్త్రఘన
శోకమునన్ నిను వీడెఁ గాన నే

నిచట నిసుం ద్యజింతు నిఁక
నేఁగుము నీకు శుభంబు శస్త్రమా ! ౧౬

(విడువఁబోవును.) (తెరలో)

ఓ రాజులారా ! ఏమేమి ! గురువరు నొక ఘాతుకుఁడిట్లు పరాభవించుచుండఁగా మీరందఱిటు లేల యుపేక్షించి నారు ?

అశ్వ:—(మరల శస్త్రమును గ్రహించి) ఏమి! నా తండ్రికే పరాభవమా ?

(మరలఁ దెరలో)

శా. కన్నీటం గను నార్ద్రమైనముఖరే
ఖం బొల్చి పుత్రవ్యథా
ఖిన్నత్వంబున నస్త్రముల్ విడిచి మౌ
ఖీభూతుఁడై సద్గురుం
డున్నన్ జూచియుఁ దజ్జరాపలితకే
శౌఘంబుఁ జేఁబూని సం
ఛిన్నగ్రీవు నొనర్చి యున్నఖలు ఛీ!
ఛీ! మీరు సైరింతురే ? ౧౭

అశ్వ:—(కోపముతోడను కంపముతోడను కృపసూతులను జూచి) ఏమేమి !

మ. పరమం బైనశమంబుఁ బూని తను వాఁ
ప్రాయోపవేశంబునన్
మరణం బందఁగఁ గోరి విల్విడిచి యు
న్నం జూచి నాతండ్రి నో

క్రూరుఁ డే తెంచి తదీయమౌళిపయి న్య
క్కారంబునన్ జేయునై
చిరయం బొప్పఁగఁ గోసెనే గళము చీ
చీ రాజు ల ట్లుండఁగన్. ౧౮

కృపు:—వత్సా! జను లట్లే చెప్పుచున్నారు.

అశ్వ:—నా తండ్రితల నొక దురాత్ముఁడు తాఁకెనా?

సూతు:—(భయముతో) కుమారా! తేజోరాశి యగునట్టి మహానుభావున కిట్టి పరాభవము కలిగినదికదా!

అశ్వ:—అయ్యో! తండ్రీ! మందభాగ్యుఁడ నగునాకై యట్ల శస్త్రసన్న్యాసము చేసి యిట్లొకక్షుద్రునిచేఁ బరాభవము నందితివా? కానీ!

చ. అనిమొక శోకసాగరము
నందు మునింగి త్యజించి శస్త్రముల్
జనుపితశీర్షమున్ దగులు
శ్వానమొ కాకమొ ద్రౌపదుండొ త
ద్ఘన బహుశస్త్రధారి బల
గర్వ మడంగఁ దదీయమౌళిపై
నునిచితి వామపాద మిదె
యొప్పుగఁ; గాదు కరంబు; చూడుఁడీ! ౧౯

ఓరీ! దురాత్మా! పాంచాలాపశదా!

శా. తాతన్ శస్త్రసమస్తసన్న్యసను సం
తాపస్థితున్ జేరి ని
ర్భీతిన్ దత్పరమోత్తమాంగమును బా
పీ! ముట్టఁగాఁ జాలినా

వా ? తత్పావనుపుత్త్రిరత్నమును న
శ్వత్థామ నూహించితే ?
ఛీ ! తుచ్ఛా ! యిదె నీఱుచేయుదును నీ
సేనన్ నినున్ సర్వము౯. ౨౦

ఓయీ ! యుధిష్ఠిరా ! అజాతశత్రూ ! సత్యవాదీ ! నీకును నీ తమ్ములకును నా తండ్రి యే యపకారము చేసెను ? పోనీ, అపకృతిజిహ్మచేతసుఁ డగునతనితో నాకేమి గాని యో యర్జునా ! సాత్యకీ ! బాహుబలశాలీ ! వృకోదరా ! గోవిందా ! సురాసురభుజగమనుజలోకైక ధనుర్ధరుఁడు, విప్రశ్రేష్ఠుఁడు, ఆచార్యవరుఁడు, విశేషించి నా తండ్రియు నైనద్రోణుశిర మొక్కనికృష్టుఁడు ద్రుపదకులకళంకుఁడు నగు నొకమనుష్యపశువు తాఁకుటఁ జూచి యుపేక్షించుట తగునా? కాదు. మీ రందఱును పాతకులే. మీతో నాకుఁ బనియేమి ?

చ. కరముల నాయుధంబు లటు
త్రాలఁగ మీరలు సద్గురు౯ మహా
చరితుని నట్లు పాతకము
సల్పిన మూర్ఖుని సైఁచినారుగా ?
నరపశువుల్ మిము౯ రిపుగ
ణంబును పార్థవృకోదరాచ్యుతాం
కురముగ రక్తమాంసములఁ
గోరికతో బలియిత్తు దిక్కుల౯. ౨౧

కృపు:—వత్సా ! ద్రోణతుల్యబాహుశాలివి దివ్యాస్త్రగ్రామ కోవిదుఁడవు నగునీకు సాధ్యము కాని దేది ?

అశ్వ:—ఓ పాండవసోమక మత్స్యమాగధాదిక్షత్త్రియాపశదు
లారా !

చ. గురునిశిరంబు ముట్టుటనె
ఘోరమహానలసన్నిభంబు భీ
కర మగు గండ్రగొడ్డలిని
క్షత్త్రియసంతతి నేమి చేసెనో
యెఱుఁగరె భార్గవుం? డటులె
హింస యొనర్చును ద్రోణపుత్త్రుఁ డు
ద్ధురుఁడు మిమ్ము నందఱను
దోఁగును దద్రుధిరాంబుధిన్ దగన్. ౨౨

సూతా ! సర్వోపకరణములతో సాంగ్రామికకృత్యమునకై
మహారథావలక్షణ మను నా రథమును సర్వాయుధోపేత
ముగాఁ గొనిరమ్ము.

సూతు:—చిత్తము. (నిష్క్రమించును.)

కృపు:—వత్సా ! తప్పక ప్రతిక్రియ చేయఁదగిన యీ దారుణ
పరాభవాగ్నిని నీవుగాక మే మెట్లు చల్లార్పఁగలము ?

అశ్వ:—నా యనంతర కర్తవ్య మేమి ?

కృపు:—నీవు సేనాపతిగా నభిషిక్తుఁడవై రణరంగమున కేఁగు
టే నాయభిమతము.

అశ్వ:—మాతులా ! ఇది నాయధీనములోనిది కాదు. కాన,
పరిగణింపఁ దగనిది.

కృపు:—వత్సా ! ఇది పరతంత్రమును గాదు. పరిగణింపఁ
దగనిది కాదు. ఏలన :

క. గంగాతనయుఁడు ద్రోణుఁడు
నుం గలుగని కొఱఁత యెట్లునుం బోవదు నీ
వుం గలిగి తుల్యయోగ్యత
సంగరమునఁ గొనవయేని సైనికరక్షణ. ౨౩

నీ యసమశరవిసరమునకు ముల్లోకములు నోపవు. ఇఁక యుధిష్ఠిరబల మెంత? కురుపతికూడ నభిషేకసంభారములఁ గూర్చుకొని నీకొఱ కెదురుచూచు చున్నాఁడు.

అశ్వ:—మామా! నిజమే. పరిభవానల పరితప్యమాన మగు నా మనస్సు ప్రతీకార మను జలాభిషేకమును గోరుచున్నది. నే నేఁగి గురువధచే విషణ్ణమానసుఁ డగు దుర్యోధనుని జేరి సేనాధిపత్యస్వీకరణమున నతని నూఱడించెదను.

కృపు:—వత్సా! మంచిది. మన మతనికడకే యేఁగుదము.

(ఇరువురును నడతురు.)

(కర్ణదుర్యోధనులు ప్రవేశింతురు.)

దుర్యో:—

గీ. బంధుజనములు రిపులచేఁ బడ్డ దుఃఖ
పారమును శస్త్ర మనునావఁ జేరునట్టి
గురుఁడు సుతవధ వినికూడ ఘోరశస్త్ర
ములను గొన కేల విడిచె నా పాలికలనున? ౨౪

ఔను. సహజగుణము పో దని పెద్ద లనుమాట నిజము. శోకాంధబుద్ధియై క్షత్రియకర్కశతను విడిచి గురుఁడు బ్రాహ్మణసులభ మగుదైన్యము నందినాఁడు.

కర్ణు:—కౌరవేశ్వరా! అది కాదు.

దుర్యో:—మఱేమి?

కర్ణు:—అశ్వత్థామను భూలోకపట్టాభిషిక్తునిఁ జేయ నాతని కోరఁగ. అది వ్యర్థ మగుటచే వృద్ధబ్రాహ్మణున కస్త్ర మేల యని విడిచినాఁడు.

దుర్యో:—(తల యూఁచి) ఔనౌను.

కర్ణు:—కౌరవపాండవపక్షపాతమున జరిగిన యీసంగ్రామము లో రాజు లొండొరులు చావఁ గోరుటచేతనే యాతఁడు మన సేనలోని ప్రధానుల చావు చూచియు నుపేక్షించి నాఁడు.

దుర్యో:—ఇదియు నిజమే.

కర్ణు:—రాజా! ఆతనిగుణ మెఱిఁగినవాఁ డగుటచేతనే బాల్య హితుఁ డయ్యు ద్రుపదుఁ డీతనికిఁ దనరాజ్యమునఁ జో టీయలేదు.

దుర్యో:—అంగరాజా! చక్కఁగా నూహించితివి.

కర్ణు:—ఇది నాయూహయే కాదు. ఆతని నెఱిఁగినవారి యందఱిదియు.

దుర్యో:—ఔనౌను. సందేహమా? అందుచేతనే

క. అతిరథుఁ డగుతా సభయము
సతికృప సైంధవున కిచ్చి యాపైని నరుం
డతనిని జంపఁగ నూరక
యితఁ డుండెను లేక వేఱు హేతువు గలదే? ౨౫

కృపు:—(చూచి) వత్సా! కర్ణునితో దుర్యోధనుఁ డామఱ్ఱినీడఁ గూర్చుండి యున్నాఁడు. సమీపింతము. (సమీపింతురు.)

ఉభ:—కౌరవరాజా! జయము. జయము.

దుర్యో:—(చూచి) ఏమి? కృపాశ్వత్థామలా? (ఆసనము దిగి) గురూ! వందనము. (అశ్వత్థామను జూచి) ఆచార్యపుత్త్రా!

ఉ. నాకొఱకై గతించిన గు
 రుప్రభుసద్గురుపుత్త్ర! కౌఁగిటన్
నాకొసరింపు హాయి కను
 గాన్ భవదీయశరీర మీఁకనున్
దాఁకిన సద్గురూత్తముని
 దాఁకినయట్టులయ్యె రవంతయేన్
శోకము పోవునేమొ పరి
 శుద్ధపుస్నేఁబులకల్ జనింపఁగన్. ౨౬

(కౌఁగిలించుకొని కూర్చుండఁబెట్టుకొనును)

అశ్వ:—(కన్నీరు విడుచును)

కర్ణు:—ద్రోణతనయా! ఈదుఃఖానలమున నేల పరితప్తుఁడ వగుదువు?

దుర్యో:—గురుపుత్త్రా! ఈదుఃఖవిషయమున మన కిరువుర కభేదము. ఏలన:

ఆ. తండ్రి నీకు, నాకుఁ దండ్రిమిత్త్రుఁడు, విలు
 విద్య నీకుఁ బోలెఁ బ్రియగురుండు
 నాకు, నతనిచావు నీకు నాకును నార్తి
 కరము, నీయెడంద యెఱుఁగు నెంతొ? ౨౭

కృపు:—వత్సా! నిజము.

కర్ణు:—అంతవిచార మెందులకు?

అశ్వ:— కురురాజా! నీవు పంచుకొనుటచేతనే నాదుఃఖభారము కొంతతగ్గినది. కాని:

ఆ. నేను బ్రతికియుండ నిర్భాగ్యుఁ డొక్కఁడు
గురునిజుట్టు పట్టుకొనియె నకట!
ధరణి నింక నెవరు తనయులకొఱకునై
గంపెఁడాస బ్రతుకఁ గలుగువారు? ౨౮

కర్ణు:— ద్రోణతనయా! నీ వేమి చేయుదువు? సర్వావమానములను బోఁగొట్టుకొన శక్తి గలిగియు నస్త్రసన్న్యాసమున నిట్టిదశ నీతండ్రి తానే తెచ్చుకొనెను.

అశ్వ:— ఏమి చేయుదు ననియా నన్నడిగితివి! నే నేమి చేయుదునో వినుము:

ఉ. పాండవసేనలోన ఘన
బాహుమదంబున నస్త్రధారు లు
ద్దండు లెవారో వారలను,
ద్రౌపదిసంతతి బిడ్డబిడ్డనున్,
మొండిగ నాఁడు సద్గురుని
మూర్ధవిఖండనఁ గన్నవారి నేఁ
జెండుదు నందఱన్ మిగుల
శీఘ్రమునన్ లయకాలరౌద్రతన్. ౨౯

మఱియు, నో భార్గవశిష్యా! కర్ణా!

మ. తొలుతన్ భార్గవరాముఁ డొక్కరుఁడె శ
త్రుశ్రేణిరక్తంబు లీ
స్థలమందే ప్రవహింపఁజేసె నదియో
చందంబుగా మత్పితన్

దలనుఁ బట్టినక్షత్త్రియాధముని మి
త్త్రశ్రేణితోఁ గూల్చి త
ద్బల మారామునిభంగి ద్రౌణి యొనరిం
పన్ జూడుమీ యిప్పుడే. ౩౦

దుర్యో:—గురుసుతా! నీ వట్టిప్రతిక్రియ చేయఁ గలయనన్య సాధారణవీరభావుఁడవు. నీ కీ డెవరు?

కృపు:—రాజా! ద్రోణపుత్త్రుఁ డీవిధముగా సమరభారమును దలదాల్చినాఁడు. ఇతఁడు విల్లమ్ములు చేకొన్న ముల్లోకములు జయింపఁగలఁడు. ఇఁకఁ, బాండవబల మెంత? కాన, నీ వీతనిని సేనాపతిగా నభిషేకింపుము.

దుర్యో:—ఔను. కాని,యిదివఱకే యీపని కర్ణునకై పోయినది.

కృపు:—రాజా! సాటి లేనిపరాభవ మనుదుఃఖసముద్రమున మునిఁగి యున్నయీతనిని కర్ణునికారణమున నుపేక్షింపఁ దగదు.

దుర్యో:—ఆయరికులమునే కర్ణుఁడు సంహరించునుగదా! దీని కేమి?

అశ్వ:—కౌరవేశ్వరా! ఇంకను మంచిచెడ్డలవిచార మేల?

చ. సుకముగ నిద్రపోదు విఁక
స్తోత్రములన్ బహువందిమాగధుల్
సుకవులు లేపుదాఁకఁ; గడు
శూరత నేను సపాండవం బసో
మకము సకృష్ణమున్ భువన
మండలిఁ జేయుదుఁ; దీర్చెదన్ ధరి

త్రికి భరమ్మున్; రణాంత మగు
దీన కృపాటవి ఖండితంబుగాన్. ౩౧

కర్ణు:—అశ్వత్థామా! అపాండవ మసోమక మకృష్ణ మనుటే కష్టము. ఇంకఁ జేయు టెంత కష్టము? కాని, కురుబలమున సమర్థు లున్నారులే.

అశ్వ:—అంగరాజా! నిజమే. నేను దుఃఖచిత్తమున శోకావేగముతో నంటిని గాని మనవీరుల నాక్షేపించుటకుఁ గాదు.

కర్ణు:—మూర్ఖా! ఏడుపు వచ్చిన నేడువవలయును. కోపము వచ్చిన నాయుధసాహాయ్యమున రణమున దూఁకవలయును. అంతేకాని, యీపనికిరానిమాట లెందులకు?

అశ్వ:—ఓరీ! రాధకడుపు చెడఁబుట్టినవాఁడా! చేతకాని సూతుఁడా! ఏమి ప్రేలెదు?

కర్ణు:—

గీ. సూతుఁడనె యగాదు లేకున్న సూతసుతుఁడ
నౌదు; నెవఁడనో యొకఁడను వాదులేల?
దైవవశ మగుఁ బుట్టుక; ధైర్యశౌర్య
పురుషకారంబు నావశంబుర యెఱుంగు. ౩౨

అశ్వ:—ఏమిరా! ఏమంటివి? నాదుఃఖము నేడ్చియా పోఁగొట్టుకొనుమంటివి? శస్త్రప్రతిక్రియచేఁ గాదా! ఓరీ!

మ. గురుశాపంబున నీవలెన్ శరతతుల్
కుంఠంబులా? నావి, నీ
రరణంబున్ మును నీవలెన్ విడిచి పా
రంజొచ్చి యున్నాఁడనా?

మఱి స్తోత్రించుకులాన నీవలెను జ
న్మంబెత్తి యున్నాఁడనా?
యరి సస్రంబునఁ గాని యస్త్రమునఁ జే
యన్ లేనురా ఖండితున్? ౫౩

కర్ణ:—(క్రోధముతో) ఓహోరి దుర్విదగ్ధా! వృథాశస్త్రగ్రహా! బ్రహ్మచారీ! చెప్పు. చెప్పు.

గీ. నేను విడిచినయాయుధనికరము లని
వీర్యయుతములు? లేక నిర్వీర్యములుర?
పాండువీరులభీతి నొప్పఱిననీదు
బాహుశాలిమహాపితృబాణభంగి. ౫౪

అశ్వ:—ఓరీ! నీచసూతజా! బాణము పట్ట నెఱుఁగనివాఁడా! నాపితృపాదులను గూడ నాక్షేపించుచున్నావఁటరా?

ఉ. భీరుఁడో శూరుఁడో గురుఁడు
విక్రమతన్ జగదేకవీరుఁడో
ఘోరరణక్రియన్ వసుధ
కున్ విదితంబు నిరంతరంబు; నే
కారణమో యతండు విడఁ
గార్ముక మమ్ములు సాక్షి ధర్మజుం;
డోరి! దురాత్మ! నీవచట
నుండియుఁ బాఱితివేలరా? ఖలా! ౫౫

కర్ణ:—ఔనౌను. నేను భీరుఁడను! నీవిక్రమసారము చూడఁగా నీతండ్రివిషయములోఁ గూడ సంశయమే కలుగుచున్నది. ఓరీమూర్ఖా!

గీ. శస్త్రమును వీడినను నేమి? శస్త్రరహితు
లరి మహాయుధ మెత్తిన నడఁప లేరె?
రాజలోకంబుముందు శిరంబుఁ గోయ
నింతిగతి నీదుతండ్రి సహించెఁ గాని. ౩౬

అశ్వ:—(క్రోధకంపములతో) ఓరీ! దురాత్మా! రాజవల్లభప్రగల్భా! సూతాపశదా! అసంబద్ధప్రలాపీ!

గీ. దుఃఖభరముననో. భయదుర్బలతనో
ద్రోపదకరంబుఁ దండ్రి యదల్పకుండె;
దర్పయుత మగునీతలఁ దన్ని యెడమ
కాలు నిలుపుదు; వారింపు కలుగుదేని. ౩౭

(లేచును.)

కర్ణు:—(క్రోధముతో లేచి కత్తిదూసి) ఓరీ! దురాత్మా! బ్రాహ్మణా! ఆత్మశ్లాఘీ!

గీ. బ్రాహ్మణుండవు కావున బ్రతికిపోతి
వోరి! తుచ్ఛుఁడ! నీ వెత్తియున్న కాలు
ముక్కముక్కలు కరవాలమున నొనర్తు
ధరణిఁ బడె నని తలఁచుకొమ్మురా! క్షణమున. ౩౮

అశ్వ:—ఏమిరా! జాతికారణమున బ్రతికిపోతి నంటివా! ఇదిగో. నాజాతి నిదే విడిచివేసెదను. (జందెము త్రెంచి పాఱవైచి కోపముతో) ఇఁక రమ్ము.

గీ. నిను వధింపఁగఁ బట్టునర్జునుప్రతిజ్ఞ
మిథ్య యొనరింతుఁ గాచుకొమ్మా! దురాత్మ!

అస్త్రమున రార! రాఁజాల్ప వైతివేని
శరము ధరనిడి తాల్పు మంజలిని మూర్ఖ. ౭౯

(ఇరువురును గత్తులు దూసి కలియఁబడఁబోవ దుర్యోధనకృపులు వారింతురు.)

~~దుర్యో~~ కృపు:—సఖా! గురుపుత్త్రా! శస్త్రముదు ముట్టకు.

~~కృపు~~ దుర్యో:—వత్సా! సూతపుత్త్రా! శస్త్రమును ముట్టకు.

అశ్వ:—మాతులా! ఏల వారింతువు? తండ్రిని నిందించుటచే నీ సూతకులాధముఁడు నాకు ధృష్టద్యుమ్నసమానుఁడే.

కర్ణు:—రాజా! నివారింపకు.

అశ్వ:—రాజా! రానిమ్ము. రానిమ్ము. వీనిని నా సందిట నిఱికించుకొని నలిపివైచెదను. ఓయీ! కౌరవేశ్వరా! స్నేహముననో కార్యముననో నాతండ్రిని గాఱులు కూసిన యీ దురాత్ముని దుర్మదుని గాపాడఁ గోరుచుంటివి. నీ కీరెంటను నిరుపయోగములే. ఏలన !

గీ. సుగుణవంతుఁడ వీవు; ఈతఁ డంత పాపి;
ఇందుకులుఁడవు నీ వౌదు; వితఁడు సూత
సంభవుఁడు; మైత్త్రి యెట్లు పొసంగు మీకు ?
ఇల నకర్ణార్జున మొనర్తు నిపుడె నేను. ౮౦

(నఱుకఁ బోవును.)

కర్ణు:—(కత్తి దూసి) వృథాచపలబ్రాహ్మణా! ఇఁక నీ వుండవురా. రాజా! విడువుము. విడువుము. నన్నిఁక వారింపకుము. ఏలన !

గీ. ధీరసత్త్వుఁ డవజ్ఞ మందస్వభావుఁ
గోపమును మ్రింగి సైరింపఁ; గూళయగుట

మర్యాదాతిశయంబునఁ దోడఁగుఁ దానె
తన మగంటిమి కీర్తించుకొనఁగ నతఁడు. ౪౧

(నఱుకఁబోవును. కృపదుర్యోధనులు వారింతురు.)

దుర్యో:—ఓయి కర్ణా! గురుతనయా! మీ యిరువుర కీపిచ్చి యేమి ?

కృపు:—వత్సా! మన మిపుడు చేయవలసిన దొకటి. పైఁబడిన దిది. ఈ సమయమున మన మహారాజున కాత్మబల వినాశనము నీ వలన నగుట మంచిది కాదు.

అశ్వ:—మామా! సూతకులకలంకుఁ డగు నీ ప్రేలరిదర్ప మణఁప వలనుపడ దయ్యెనుగదా!

కృపు:—నాయనా! మన బలమునఁ గల ప్రధానితో నిట్టి విరోధమున కిది యదను గాదు.

అశ్వ:—సరే కానిమ్ము!

మ. అని నెందాఁక విరోధిబాణములఁ బా
పాత్ముండు కర్ణుండు చా
వనివాఁడో తగ నంతకాలమును నే
వర్జింతు శస్త్రంబు; రా
జును గాంచుక ప్రియమిత్త్రబాహుబల వి
స్ఫూర్తి ప్రభావంబు న
ర్జునభీమప్రవిభీతుఁడై పఱవ క
ర్ణుం; డంత నక బిల్చెడిక. ౪౨

(కత్తి విడుచును.)

కర్ణు:—(నవ్వి) నీ వంటివాఁ డాయుధమును గైకొన్న నది యెపుడో విడిచినట్లే లెక్క. మఱియు,

చ. కరమున నేను ఖడ్గమును
        గైకొనియుండఁగ నింకొకండు తాఁ
    గరమున నేల ఖడ్గమును
        గైకొనుటల్? తలపోయ; నింక నా
    కరమున నున్న ఖడ్గ మది
        కాంచఁగఁ జాలనికార్య మున్న నే
    కరమున నున్న ఖడ్గమును
        గాంచఁగఁ జాలమి తథ్యమాఁగదా! ౪౩

(తెరలో)

ఓరోరి దురాత్మా! ద్రౌపదిసిగఁ బట్టి బట్ట లొలిచినపాపీ! ధృతరాష్ట్రపుత్రాధమా! ఇంతకాలమునకు నాయెదుటఁ బడితివిరా! నీచపశువా! ఇపు డిఁక నెట కేఁగఁగలవు? ఓరోరి కర్ణసౌబలదుర్యోధన ప్రభృతులారా! మానధనులగు మీరంద ఱిటు వినుఁడు.

చ. కురుసభలోన నే పశువు
        కోమలిద్రౌపది జుట్టు పట్టి యె
    ల్లరుఁ గనఁ గట్టుఁబుట్టములు
        లాగఁగ నెంతయు సాహసించె; నే
    నరుని యురంబునెత్రు కద
        నంబునఁ ద్రావుదు నంటి; వాఁడు నా
    యురుభుజపంజరంబునను
        నుక్కఱెఁ బ్రోవుఁడు శక్తి గల్గినన్. ౪౪

(అందఱును విందురు.)

అశ్వ:—అంగరాజా! సేనాపతీ! పరశురామశిష్యా! ద్రోణాపహాసీ! భుజబలపరిరక్షితసకలలోకా! ("కరమున నేను...")

అను పద్యము మరలఁ జదివి) ఇప్పుడే కదా యంటివి. దాని కిదే యదను వచ్చినది. ఇదిగో భీముని భుజపంజరమునఁ బడ్డ దుశ్శాసనుని రక్షింపుము.

కర్ణు:—ఏమి? నేను బ్రతికియుండఁగా యువరాజు పీడన్నైనను భీముఁ డంట శక్తుఁడా? యువరాజా! భయపడకు. భయపడకు. ఇదే వచ్చుచున్నాను. (నిష్క్రమించును.)

అశ్వ:—రాజా! దుర్యోధనా! భీష్మద్రోణులు గతించిన కారణమున భీమార్జునులు కౌరవబలముల నఱుమాడుచున్నారు. వారిని గర్ణాదు లెప్వరు నాఁపఁజాలరు. కావున నీవే స్వయముగ నేఁగి తమ్ముని రక్షించుకొనుము.

దుర్యో:—ఆఁ. ఎవఁడు శక్తుఁడు? నే నాయుధహస్తుఁడనై యుండఁగా దురాత్ముఁ డగుభీముఁడు కాని మఱెవఁడు కాని నా తమ్ముని పీడన్నైనను ద్రొక్కఁగలఁడా? వత్సా! దుశ్శాసనా! భయపడకు. భయపడకు. ఎవఁడురా యక్కడ? రథము. రథము. (నిష్క్రమించును.)

(తెరలోఁ గలకలము)

అశ్వ:—(ముందు చూచి) మాతులా! ఎంత కష్టమోయి! భ్రాతృప్రతిజ్ఞాభంగభీరుఁ డగునర్జునుఁడు కర్ణదుర్యోధనులను శరవర్షములచే ముంచివైచి పైఁబడుచున్నాఁడు. అయ్యో! కష్టము. కష్టము. భీముఁడు దుశ్శాసనునురము వ్రచ్చి రక్తముఁ గ్రోలుచున్నాఁడు. దుర్యోధనమహారాజుతమ్మునియీదుస్థితి నేను గనఁజాలకున్నాను. ప్రతిజ్ఞకు భంగమైన నగుఁగాక! మామా! కత్తి. కత్తి.

గీ. సత్యమునకన్న నన్నృతంబె చాలమంచి ;
దరయ స్వర్గము నాకేల నరక ముండ ?
దుస్ససేనునిఁ గాపాడుదు; నిఁక, నన్ను
విడిచియున్న శస్త్రంబు నే విడువఁజాల. ౮౫

(కత్తిఁ బట్టఁ బోవును.)

(తెరలో)

ఓయీ! మహాభాగా! శారద్వతీపుత్రా! అసత్య మెన్నఁ డెఱుఁగనినీ వీవిషయమున సత్యవ్రతభంగ మొనరించు కొనకుము.

కృపు:—వత్సా! అశరీరవాణి నిన్నసత్యదోషమునుండి కాపాడుచున్నది.

అశ్వ:—ఆహా ! అమానుషవాక్కుకూడ నారణసంరంభమును వారించుచున్నది. కష్టము! కష్టము!! దేవతలుసైతము పాండవపక్షపాతమున నున్నారు. భీమసేనుఁడు దుశ్శాసనుని రక్తము తెగఁద్రాగుచున్నాఁడు. అయ్యో! కష్టము కష్టము.

గీ. దుస్ససేనునురంబు నెత్తురులు భీముఁ
డిటులు విచ్చలవిడిఁ గ్రోల నేమిసేయఁ
జాలకుంటిని; నే నింక సమరమందు
నేమి దుర్యోధనునకుఁ బెంపీయఁగలను ? ౮౬

మాతులా ! కర్ణునిమీఁదికోపమున నేను జేయరానిపనియే చేసితిని. నీ వైనను రాజునకుఁ గుడిభుజమవై యుండుము.

కృపు:—సరే. నే నేఁగి దీనికిఁ బ్రతిక్రియ చేయుదును. నీవు శిబిరమున కేఁగుము.

(నిష్క్రమింతురు)

ఇది తృతీయాంకము

వేణీసంహారము

చతుర్థాంకము

(దెబ్బ తిని మూర్ఛ నంది రథమున నున్నదుర్యోధనునితో సూతుఁడు ప్రవేశించును)

సూతు:—(సంభ్రమముతో నడచును)

(తెరలో)

ఓ కౌరవపక్షపాతు లగురాజన్యులారా! ప్రాణధనముల నఱచేతఁ బట్టుకొని బాహుబలగర్వమున సమరసన్నద్ధులైన మీరు పాఱిపోక నిలువుఁడు. భీముఁడు దుశ్శాసనుని వక్షస్థ్సలము వ్రచ్చి రక్తము ద్రాగి మిగిలినరక్తము నొంటికిఁ బూసికొని మహాభయంకరవేషమున నుండుటఁ గని మనసైనికు లాయుధములు విడిచి వెనుదిరుగక పరువిడుచున్నారు.

సూతు:—(చూచి) ఓహో! ధవళకపిల చామరచుంబితకనకదండమున శిఖరావబద్ధ మగువైజయంతి సూచితముకాఁగా, చచ్చి పడియున్న మనుష్యహయగజకళేబరసహస్రములచే నెత్తుపల్లములుగా నున్నరణభూమిని నడపుచుండుటచేఁ జిఱుగంటలు మ్రోయురథ మెక్కి నిజబలపరాక్రమమున శత్రుశరవర్షము నడఁగించుచుఁ దనబలముల నూఱడించుచుఁ గృపాచార్యుఁడు త్వరితగతి నేఁగి కిరీటితోఁ బోరు

చున్నకర్ణునకుఁ జేదోడయ్యెను. ఇప్పటికైనను గురుబలముల కవలంబనము దొరికినది.

(తెరలోఁ గలకలానంతరము)

భీమ:—నన్నుఁ గన్నభయమున విల్లమ్ములను గత్తికటారులను జాఱవిడుచు కౌరవచమూభటులారా! పాండవపక్షయోధులారా! భయపడకుఁడు. భయపడకుఁడు. నేను దుశ్శాసనునిఁ జంపి యాతనియొడందనెత్తురులు తనివితీఱఁ గ్రోలినగర్వమున నింకఁ గొంచెము మిగిలియున్న ప్రతిజ్ఞానిర్వాహణమునకుఁ దొందరపడుచున్న పార్థమధ్యముఁడను. జూదమున నోడిపోయినదాసుఁడను. భీమసేనుఁడను. మీ రందఱు సాక్షులై వినుఁడు.

మ. విలు చేతం గొని మానవంతుఁ డయి సక్
వీక్షింప దుర్యోధనుం;
డల కర్ణుండును శల్యుఁడుర్ గృపుఁడు యో
ధాగ్రేసరుల్ చూడ, మి
త్రులు కాంచంగను, ద్రౌపదీవసనక
ర్షుక్ గోఘలం జీల్చి యిం
పులు గుల్కంగఁ గవోష్ణరక్తమును స
మ్మోదంబుతోఁ గ్రోలితిన్. ౧

సూతు:—(విని భీతితో) అయ్యో! కౌరవపుత్రాటవిఁ గూలఁ గొట్టువాయుదేవుఁ డగుభీమసేనదురాత్ముఁ డిటే వచ్చుచున్నాఁడు. మహారా జింకను మూర్ఛ దేఱలేదు. రథమును దూరముగాఁ బోనిత్తును. లేనిచో నీతనినిగూడ దుశ్శాసనునివలెనే యేదే ననార్యకార్యము చేయవచ్చును. (త్వరగాఁ

దోలి చూచి) ఇదిగో ! ఇట నొక పెద్దమఱ్ఱిచె ట్టున్నది. ఈ సన్నిధిని గలచెఱువులోనిపద్మముల సువాసన గలగాలిచే దీనియాకులు గదలుచున్నవి. సమరపరిశ్రమముచే సలసిన వీరుల కిది యుచితవిశ్రాంతిస్థలము. ఇట నయాచితముగా మంచిగందపుఁజలువయుఁ జక్కని సువాసనయుఁ గలిగి వచ్చినవానికిఁ గూడఁ బ్రాణము లేచివచ్చునట్లు చక్కఁగా వీచుచున్న యీసరోవరవాయువుల సోఁకుడుచే మహారాజు తేఱుకొనును. ఈరథమునకుఁ గల కేతు విదివఱకే శత్రువులచే భగ్నమయి యుండుటచే నేయత్నము లేకుండ దీని నీ చెట్టుక్రిందకుఁ బోనిచ్చెదను. (అట్లు చేసి) ఎవ రిక్కడ ? (కలయఁ జూచి) పరిజనుఁ డెవ్వఁడును గానరాఁడాయె! ఆవిధమున నున్నభీమసేనుని, ఈవిధమున నున్నమహారాజును, జూచి భయపడి యెల్లరు శిబిరమునే చేరియుందురు. అయ్యో! కష్టముగదా !

చ. గురుఁ డురురక్షు యిచ్చినను
గూల్చెఁ గిరీటి జయద్రథుఁ, భయం
కరముగ భీముఁ డిట్టులు మృ
గంబును జీల్చినయట్లు చీల్చె నీ
కురుపతితమ్మునిఁ; రిపుల
ఘోరము లైనప్రతిజ్ఞ లెల్లఁ జె
చ్చెర సులభంబు లయ్యెఁ; మన
సేనకు దైవమె శత్రువయ్యెఁగా ! ౨

(రాజును జూచి) ఇప్పటికిని మహారాజు తేఱుకొననే లేదు. అయ్యో ! కష్టము. కష్టము. (నిట్టూర్చి) ఓమహారాజా !

గీ. మదగజము నాశనము చేసి మగుడ, వనిని
మిగులు నేకైకవృక్షంబుపగిది నకట !
కురుకుమారకు లందఱు మరణమంద
నీ వొకండవె మిగులుట దైవదయను. 3

ఓయీ ! హతవిధీ ! భరతకులవిముఖా ! నీదయచే

గీ. అక్షత శరీరుఁడై గద హస్తమందుఁ
దనర, సంశయ మొకయింత తగులకుండ
భీమసేనుఁడు కొఱవడ్డ యీమహా ప్ర
తిజ్ఞ కూడను నెఱవేర్పఁ దెగువ మీఱు. ४

దుర్యో:—(మూర్ఛదేఱి ధైర్యముతో) ఏమి ! దుర్యోధనుఁడ నగు నేను బ్రతికియుండఁగా దురాత్ముఁ డగువృకోదరహతకుని ప్రతిజ్ఞ యెట్లు నెఱవేఱును ? వత్సా ! దుశ్శాసనా! భయపడకు. భయపడకు. నే నిదే వచ్చుచున్నాను. సూతుఁడా! సోదరునికడకు రథమును బోనిమ్ము.

సూతు:—ఆయుష్మంతుఁడా ! గుఱ్ఱములు రథమును మోయఁ జాలవు. (అపవారించి) మేమును నీమనోరథమును...

దుర్యో:—(రథము దిగి సగర్వముగను సాకూతముగను) ఈరథగమన విలంబనము నాకేల ?

సూతు:—(వైలక్ష్యముతోడను జాలితోడను) ఆయుష్మంతుఁడా ! శాంతింపుము. శాంతింపుము.

దుర్యో:—ఛీ ! నాకు రథ మేల? నే నొంటరిగనే శత్రుమర్దన సంఘట్టసంచారి నగు దుర్యోధనుఁడనుగదా ! గదామాత్ర సహాయుఁడనై సమరాంగణముఁ జొత్తును.

సూతు:—ఆయుష్మంతుఁడా! నీ వంతవాఁడవే. సంశయమేమి?

దుర్యో:—ఐన, నీ విట్లు పలుకుదు వేల ? చూడుము.

ఉ. పాపపుభీమసేనుఁ డిటు
బాలుని దుర్గలితుర్ సమక్షమం
దే పగ దీర్పఁ బూని యిటు
లెత్తెఁగదా ! గద దానిఁ గాంచి నే
నాఁపఁగఁ బోవుచుండ నిటు
లాఁపెద వేల నన్ను; దలంపఁగాఁ
గోపము లేదొ? లేదొ దయ ?
కూమునె నీ కిటు ? సిగ్గు లేదొకో ? 98

సూతు:—(సకరుణముగాఁ గాళ్లపైఁ బడి) ఆయుష్మంతుఁడా ! ఆ దురాత్ముఁ డగువృకోదరహతకుఁ డీపాటికి తనప్రతిజ్ఞ పూర్తిగా నెగ్గించుకొనియుండు ననియే నే నట్లంటిని.

దుర్యో:—(వెంటనే భూమిపైఁబడి) అయ్యో ! వత్సా ! దుశ్శాసనా ! నాయాజ్ఞమూలమునఁ బాండవులకు విరోధివైతివి గదా ! విక్రమమే రసముగాఁ గలనీవు నాయంకమున లాలింపఁ బడుచుండెడివాఁడవు. నీవు శత్రుకులగజసంతతికి సింహాసన్నిభుఁడవు. కౌరవసరోవరమున నీవు కలహంసమవు. అయ్యో ! యువరాజా ! పలుక వేమి ? ప్రతివచన మిమ్ము. (నిశ్వసించి మూర్ఛిల్లును)

సూతు:—రాజా ! శాంతింపుము. శాంతింపుము.

దుర్యో:—(తేఱుకొని నిట్టూర్చి)

చ. సకలమహోపభోగసుఖ
సంతతి కర్హుఁడ వైన నీకు నే

సకట ! ఘటింపనైతి నది
యగ్రజజన్మము నాది వ్యర్థకథా;
సకుటిలు నిన్ను ద్రౌపదిని
నట్టులు నాఁ డొనరింపఁ బంపి, నీ
నికటమునందు నుండియును
నేఁ డెటు గావఁగఁ జాలనైతి నిక్క ! (మూర్ఛిల్లును)

సూతు:—ఆయుష్మంతుఁడా ! ఊఱడిల్లు మూఱడిల్లుము.

దుర్యో:—(లేచి) అయ్యో ! సూతుఁడా! నీ వెట్టిపని చేసితివి ?

గీ. బాలు, నాజ్ఞానువర్తిఁ, గాపాడఁదగిన
యనుఁగుఁదమ్ముని, దుశ్శాసనుని విరోధి
కకట ! బలియిచ్చి చేసేఁత నస్మదీయ
ప్రాణములఁ గాచుకొంటివి బాపి నగుచు. ౭

సూతు:—ఆయుష్మంతుఁడా ! మర్మభేదకము లగుబాణములచేతను శక్తితోమరప్రాసవర్షములచేతను మహారథు లచేతనులై పడిపోఁగా నీవును మూర్ఛిల్ల రథము నిటు మరలించి తోలుకొని వచ్చితిని.

దుర్యో:—సూతుఁడా ! నీవు విరుద్ధమే యొనరించితివి. ఏలన:

చ. అనుజవిరోధి యైనపవ
నాత్మజుఁ డగ్నిపశుతుల్యు హాస్తమం
దునఁ గలవజ్రతుల్యగద
దుర్భరహింసయె నాకుఁ గల్గ ద
య్యెనుగద ! కల్గియున్నెడల
నేనో యతండో యనుంగుదున్నసే

నుసిరుధిరార్ద్రశయ్యకడ
నొచ్చియె యుండుముకాదె ! సూతుఁడా ! ౫

(నిట్టూర్చి, ఆకసముఁ దిలకించి) అయ్యో ! హతవిధీ ! కృపార
హితా ! భరతకులవిముఖా !

గీ. ఇపుడె మృత్యువు నన్ గ్రహియించుఁగాక !
భ్రాతృహంత భీమునిగదఁ బడఁగఁ జాల.

సూతు:—పాపము శాంతించుఁగాక! పాపము శాంతించుఁగాక!
ఏమిది మహారాజా !

దుర్యో:—సకల బంధుజనంబులఁ జంపుకొన్న
హతకుఁడను నాకు జయము రాజ్యంబు నేల ? ౬

(అంత దెబ్బలుతిన్న సుందరకుఁడు ప్రవేశించును)

సుంద:—ఆర్యా ! సారథి తప్ప నన్యులు లేని దుర్యోధనమహారాజు నీ పరిసరములు నెవరైనఁ జూచియున్నారా ? ఎవరును బదులుపలుకరే ! కానిమ్ము. అక్కడ నెవరో బద్ధపరికరు లగునుద్ధతశరీరులు కనఁబడుచున్నారు. అట కేఁగి వారి నడుగుదును. (చూచి) ఏమి ! వీరు గట్టిగా దెబ్బతిన్న తమరాజు హృదయమున గ్రుచ్చుకొన్న బాణముఖములను నెమ్మదిగాఁ దీయుచున్నారు. వీరికాగొడవ తెలిసియుండదు. కానీ,ఇంకొకచోటి కేఁగి యడుగుదును.ఇటనెవరో వీరపురుషులున్నారు. వీరి నడుగుదును. (చేరి) ఏమండీ ! కురురాజెట నున్నాఁడో యెఱుఁగుదురా? ఏమి! వీరు గోలుగోలున నేడ్చుచున్నారు!(చూచి)అయ్యో!ఇట నెంత ఘోరముజరుగుచున్నది! సమరమునఁ జచ్చినకొడుకుసంగతి విని యీవీరమాత సమగ్రభూషణ యగుకోడలితోఁ గూడి యగ్నిప్రవేశము చేయు

చున్నది. (మెచ్చుకొని) జయము. వీరమాతా! జయము. నీకు మఱుజన్మమునఁ బుత్త్రశోకము లేకుండుఁగాక! మఱి యొకచోఁ జూచెదను. (చూచి) ఆహా! దేహమునిండ దెబ్బలవలన గాయములు పడినను వానికి మందుమాఁకులు రాసికొనక యీవీరులు శూన్యాసనముతో నున్న యీ గుఱ్ఱమును జూచి విచారించుచున్నారు. వీరినాయకుఁడు రణమునఁ జచ్చియుండనోపు. వీరికిని దెలియదు. కాని. ముందు కేఁగుదును. (ఏఁగి) ఏమిది! జనులందఱును దమతమ యవస్థానురూప మగుదుఃఖమున మునిఁగియున్నారు. వీరి నెవరి నడుగుదును? ఎవరిని నిందింతును! కాని. నేనే నిందిం కొందును. (నడచి) కాదు. దైవమును నిందింతును. ఓ దైవ మా! ఏకాదశాక్షౌహిణులకు నాయకుఁడు, భ్రాతృశతమున నగ్రజుఁడు, గాంగేయ జయద్రథ ద్రోణాంగరాజ కృప కృత వర్మాశ్వత్థామప్రముఖులకు బహురాజలోకమునకుఁ బ్రభు వును, సకలపృథివీమండలైకనాథుఁడు నగుదుర్యోధనమహా రాజును నాచే వెదకించుచున్నావు! అతఁ డెట నున్నాఁడో తెలియరాదాయె! (ఆలోచించి నిట్టూర్చి) దైవనింద యేల? ఇది యంతయు నిరాకృతవిదురవచనబీజమును, బరిహృత పితృపితామహోపదేశాంకురమును, శకునిహతకప్రోత్సాహ విరూఢమూలమును, లాక్షాగృహద్యూతవిషవృక్షము చిర కాలమునుండి పెచ్చుపెఱిఁగివచ్చుచున్న వైరమున కాల వాలమై పాంచాలీకేశగ్రహణసుమములఁ బూచి నేఁటి కీఫ లము నిచ్చినది. (మఱొకచోఁ జూచి) పెక్కుమణులకాంతి గలిగి సూర్యకాంతివలె దిగంతముల నింద్రధనుస్సులఁ

బుట్టించుచు జెండాయు నొగలును ఖండితములుగాఁ గానఁబడుచున్న దారథము. అవశ్య మటనే మహారాజు విశ్రమించి యుండవలయును. (పోయి చూచి నిశ్చయించి) జయము. జయము. మహారాజా!

సూతు:—ఆయుష్మంతుఁడా! రణరంగమునుండి సుందరకుఁడే తెంచినాఁడు.

దుర్యో:—ఓయీ! సుందరకా! అంగరాజు కుశలమా?

సుంద:—శరీరమాత్రముచే.

దుర్యో:—(తొందరపాటుతో) సుందరకా! కిరీటి యాతనిగుఱ్ఱములు సారథసహిత మగురథమును నాశనము చేసెనా?

సుంద:—దేవా! రథమే కాదు. మనోరథమును గూడ.

దుర్యో:—ఏమిరా! అసలే విచారపడుచున్న మనమును సందిగ్ధవచనములచే మఱింత బాధపెట్టెదవేల? స్పష్టముగాఁ జెప్పు.

సుంద:—దేవా! దేవరకిరీటమణికాంతివలన నాబాధ కొంత యుపశమిల్లినది. (సాటోపముగా) దేవా! వినుము. దుశ్శాసనకుమారునిచావు... (నోరు మూసికొనును)

సూతు:—సుందరకా! అది యిదివఱకే తెలిసినది. తరువాత?

దుర్యో:—తరువాత నేమైనది?

సుంద:—దేవా! వినుము. దుశ్శాసనకుమారునిచావుచేఁ గోపియై యంగరాజు దురాచారుఁడు పాండవమధ్యముఁడు నగుభీమసేనహతకుని పైఁ గుటిలభ్రుకుటీభంగభీషణలలాటపట్టియై బాణము తొడుగుట విడుచుట యనునవి తెలియని మహావేగమున శరపరంపరఁ గురియించెను.

దుర్యో:—పిమ్మట?

సుంద:—పిమ్మట దేవా! రింపు సేకలయందు నున్న కరితురగాదిపరస్పరఘర్షణమున బయలువెడలిన ధూళివలనను, పెద్ద యేనుఁగులగుంపులవలనను గలిగినయంధకారము క్రమముగా నిరువాగులను సంఛీభూతము చేసివైచినది. భూభాగమే కానరాదాయెను.

దుర్యో:—తరువాత ?

సుంద:—తరువాత దేవా! కర్ణభీము లిరువురు చేయు నొంకారులసింహనాదము లను నురుములచేతను, ఒకరిపై నొకరు వేసికొన్న బాణపరంపరలకు రాలుకవచఖండము లను మెఱుపులచేతను, వారియొడళ్లఁ గాఱు రక్తబిందువు లను మెఱుఁగుఁబువ్వులచేతను నిరంతరము ద్రోణాయుధనువు లను మేఘములు ధారాపాతముగా వర్షించిన సమరదుర్దినము సంభవించెను.

దుర్యో:—అపై?

సుంద:—ఆపై దేవా! ధనంజయుఁ డగ్రజునకుఁ బరాభవము కలుగు ననుభయమున వజ్రపాతదారుణ మగురథధ్వనితోడను, గుఱ్ఱములసకిలింపులతోడను, రథశిఖరమునఁ గల కపిధ్వజముకాంతికిఁ గన్నులు మిఱుమిట్లు గొలుప శంఖ చక్రగదాఖడ్గములు నలుకరముల నలరుచుండుకృష్ణుఁడు నొగలపైఁ గూర్చుండి గుఱ్ఱములపగ్గములు పట్టుకొనఁ బాంచజన్యదేవదత్తములఁ బూరింప బయలువెడలినమహాధ్వని దశదిశలను జెవుడుపఱుప శరవేగమున నటకు వచ్చి పడెను.

దుర్యో :—ఆతరువాత ?

సుంద:—ఆతరువాత భీమార్జునపరివృతుఁ డగుతండ్రిని జూచి సంభ్రమమునఁ దలనుండి జాఱిపడిపోయినరత్నశీర్షమ్మునైన నెఱుంగక, ఆకర్ణాంతము లాగినవింటినారితో దక్షిణహస్తమున నుంచినశరపుంఖబంధనమున, సారథిని ద్వరగాఁ బో నిమ్మని హుంకరించుచు వృషసేనకుమారుఁ డొక్కక్షణములో నట కరుదెంచెను.

దుర్యో:—(గర్వముతో) తరువాతఁ దరువాత?

సుంద:—వచ్చియు రాకమును పే వృషసేనుఁడు విదలితాసిలతాశ్యామలస్నిగ్ధపుంఖములు, కఠినకంకపత్త్రములు, కృష్ణవర్ణములు నగుశిలానిశితశ్యామలశల్యాబంధములను బహుముఖములఁ బఱపి క్షణములోఁ బూచినమోదుగువలె నర్జునునిరథమును బాణములతోఁ గప్పివైచెను.

దుర్యో:—(సంతోషముతో) అపుడు?

సుంద:—అపుడు దేవా! అర్జునుఁడు నిశితబాణముల నెన్నిటినో యాతనిపైఁ బఱపి చిఱునవ్వుతో "నోరోరివృషసేనా! నీతండ్రియే నాయెదుట నిలువఁజాలఁడయ్యె. బాలుఁడ వగు నీవా నన్నెదిరింపఁ గలుగుట! పొమ్ము. బాలుఁడా! నీవంటి బాలురతోఁ బోరొనరింపు" మని పలికెను. ఈమాటలు విని వృషసేనుఁడు తండ్రి నాక్షేపించినాఁ డన్నకోపముచే మొగ మెఱ్ఱవడ భ్రుకుటీభంగభీషణ మగువిజృంభణమున మర్మభేదకము లగుపరుషబాణములు చెవులు సోఁకఁ బఱపెఁ గాని పరుషవచన మొక్కటియుఁ బలుకఁడయ్యెను.

దుర్యో:—సెబాస్. వృషసేనా! సెబాస్.

సుంద:—వృషసేనునినిశితబాణములు సోఁకుటచే నధిక మగు కోపమును గన్నయర్జునుఁడు చండగాండీవజీవాశబ్దనిర్ఘోషవజ్ర నిర్ఘాతఘోషమున బాణనిపతనప్రతిషిద్ధదర్శనప్రసరణమున నిజశిక్షాబలానురూప మగురణకృత్యమును నిర్వహించెను.

దుర్యో:—(సాకూతముగా) తదనంతరము?

సుంద:—తదనంతరము దేవా! అర్జునునిసమరచతురతఁ గన్న వృషసేనుఁడును నమ్ములపొదిఁ జేయి యుంచుటయు, నాక ర్ణాంతము నారిలాగుటయు, నమ్ము దొడుగుటయు, నుద్ధర ముగ విడుచుటయు నెవరికిని దెలియరాకుండఁ దనయుద్ధ నైపుణ్యముఁ జూపఁదొడంగెను.

దుర్యో:—అంత?

సుంద:—అంత దేవా! యిరువాగులవారును సమరము నిలిపి క్రోధము మఱచి యీవీరు లిరువురు చేయుచిత్రయుద్ధ మును బరికించి "వృషసేనా! సెబాస్. సెబా" సని వీరలో కమంతయు నొక్కుమ్మడిఁ బ్రశంసించెను.

దుర్యో:—(ఆశ్చర్యముతో) అపుడు?

సుంద:—అపుడవధీరితసకలధానుష్కచక్రపరాక్రమశాలియగు కుమారునిరణకౌశలమును గని హర్షరోమకరుణాసీత్కార సంకటములతో నంగరాజు భీమసేనునిపై బాణపరంపరఁ బరగించి వృషసేనకుమారునిపై బాష్పపర్యాకులదృష్టిని నిగుడించెను.

దుర్యో:—(భయముతో) అపు డేమి జరిగినది?

సుంద:—ఉభయబలములు వృషసేను నట్లు ప్రశంసించుటఁ గని యర్జునుఁడు మండిపడి శరవర్షమును వృషసేనుని గుఱ్ఱ

ములపై, సారథిపై, రథముపై, ధనుస్సుపై, నారిపై, నరేం
ద్రలాంఛన మగు సితాతపత్రములపైఁ గురియించెను.

దుర్యో:—(భయముతో) అనంతరము?

సుంద:—అనంతరము విరథుఁడు లూనగుణకోదండుఁడు నగు వృషసేనుఁడు శత్రుబాణపరంపరలను మండలగతిని బరిభ్రమించుచుఁ దప్పించుకొనుచుండెను.

దుర్యో:—(ఆశంకతో) ఆపై?

సుంద:—తనకుమారునిరథము భగ్నమైనదని కోపించి యంగరాజు భీమసేనునిపై లక్ష్యము తొలఁగించి యర్జునునిపై వాఁడితూఁపులఁ బ్రయోగింపఁదొడఁగెను. ఇంతలోఁ బరిజనుఁడు కొనివచ్చినమఱియొకరథ మెక్కి వృషసేనుఁడు మరల ధనంజయాభిముఖుఁడై "ఓరిమధ్యమపాండవా! నాతండ్రి నాక్షేపింతువఁట రా! నాబాణములు నీశరీరముపైఁ దప్ప నితరములకుఁ బోనొల్లకున్నవి. కాచుకో" యని శరసహస్రములను గురియించి పేరెలుఁగునఁ బెద్దసింహనాదము నొనర్చెను.

దుర్యో:—(ఆశ్చర్యముతో) ఆహా! ముగ్ధస్వభావుఁ డయ్యు నీబాలునివిక్రమ మెంతటిది! తరువాత?

సుంద:—అపుడు ధనంజయుఁడు వాని నెల్ల ఖండించి తనరథంబునఁ గలకనకకింకిణీజాలఝంకారవిరావిణి, మోఘోపరోధవిముక్తనభస్థల, నిర్మలానిశితశ్యామలస్నిగ్ధముఖి, వివిధరత్నప్రభాభాసుర, భీషణరమణీయదర్శన యగుశక్తిని గైకొని నవ్వుచు వృషసేనునెదుట విడిచెను.

దుర్యో:—(విచారముతో) అంత?

సుంద:—అగ్నులు కక్కుచు దూసివచ్చు శక్తి ప్రజ్వరిల్లించుచు వృషసేనుని దెసకు వచ్చుచుండుటం గాంచి యర్జునకుఁ జేతినుండి బాణములతోఁ జాఱెడ ధనుస్సును, హృదయమునుండి వీరోచిత మగునుత్సాహము, కన్నులనుండి నిప్పులుగుప్పుచూపులు, ముఖమునుండి వికాసము రెక్కలు ముడిచి జారిపోయెను. అర్జునుఁడు చిఱునవ్వు, వృకోదరుఁడు సింహనాదము, పరగించిరి. కురుబలము లతిదారుణ మతిదుస్తర మని యాక్రందించె.

దుర్యో:—(విచారముతో) తరువాత?

సుంద:—అంత వృషసేనుఁ డొకయర్ధచంద్రబాణము వింట సంధించి యాకర్ణాంతము నాఁటి లాగి యాశక్తిపై విడువఁగా నీశ్వరునిచేఁ ద్రిధాకృతమొనర్పఁబడిన గంగానదివలె నమ్మహాశక్తి త్రిఖండితమయ్యెను.

దుర్యో:—సెబాస్. వృషసేనకుమారా! సబాస్.

సుంద:—పిమ్మట సమరాంగణము మహాకోలాహలముతోడను వీరలోకసాధువాదములతోడను సమరతూర్యనాదములు వినరావాయెను. సిద్ధచారణగణము లాకసమునుండి వర్షించిన పుష్పవర్షముతో రణస్థలము నిండిపోయెను.

దుర్యో:—తదనంతరము? ఏమి యీబాలవీరుని పరాక్రమము!

సుంద:—అంత నంగరాజు భీమునితో "నోయీ! మనయుద్ధ మింకను ముగియలేదు. ఒకక్షణ ముపేక్షింపుము. నాపుత్త్రునియు విజయునియు ధనుర్వేదశిక్షానైపుణ్యము క్షణమాత్రము చూతముగాక!" యన భీముఁ డందులకు సమ్మతించెను. ఇరువురు నట్లు ముహూర్తమాత్రము వైరము మఱచి వృషసేనార్జునులఁ జూచుచుండిరి.

దుర్యో:—(సాభిప్రాయముగా) తరువాత ?

సుంద:—అపు డర్జునుఁడు తనశక్తి ఖండితమైనదను రోషమున "ఱోరోరిదుర్యోధన"... (అని వెనుదీయును)

దుర్యో:—సుందరకా! చెప్పు. చెప్పు. అది పరవచనముకదా!

సుంద:—దేవా! వినుము. ఓరోరి దుర్యోధన ప్రభృతి కౌరవ వీరులారా! అవినయ నదీకర్ణ ధారీ! కర్ణుఁడా! మీ రెల్లరు నా పరోక్షమున నేకాకి యగు నా పుత్త్రు నభిమన్యుఁ జంపిరి. నేను మీ రెల్ల రిటు చూచుచుండఁగా వృషసేనుని రూపుమాపెద" నని సగర్వముగా నిర్ఘాంత ఘోషభీషణమగు గాండీవంబును సారించినఁ గర్ణుఁడును విల్లెక్కిడెను.

దుర్యో:—(భీతితో) తరువాతఁ దరువాత?

సుంద:—ఇంతలో భీమసేనుఁడు మరల యుద్ధమునకుఁ బూనఁగా గాండీవి యాతనిని వారించి యంగరాజ వృషసేనుల యుభయరథ వార్ధికూలంకషముగ బాణనదీద్వయంబును బ్రవహింపఁజేసెను. అంతఁ గర్ణ వృషసేను లిరువురు నన్యోన్య స్నేహదర్శితశిక్షావిశేషముతో నర్జును నెదుర్కొనిరి.

దుర్యో:—అంత ? అంత ?

సుంద:—అంత దేవా! గాండీవి తారరసిత జీవానిర్ఘోషమాత్ర విజ్ఞాతబాణవర్షము గురియింపఁగా భూమ్యాకాశములు, రథస్వాములు, కుమారకేతుదండములు, సారథితురంగములు, సైన్యము, దెసలు, వీరలోకము నేమియుఁ గానరావయ్యెను.

దుర్యో:—(విస్మయముతో) తరువాతఁ దరువాత ?

సుంద:—అంత దేవా! క్షణమాత్రములో శరసంపాతము నతిక్రమించి పాండవసైన్యమున సింహనాదములు, కౌరవ సైన్యముల సవిషాదాక్రందనములు బయలువెడలి "వృష సేనకుమారుఁడు చచ్చె" నన్న మహాకోలాహలము విని పించెను.

దుర్యో:—(బాష్పములతో రోషమున) ఆపై నాపై ?

సుంద:—దేవా! వృషసేనకుమారుఁడు హతసారథితురంగమ లూనాతపత్రచాపచామర కేతువంశములతో హృదయ మర్మభేదక మగు శిలీముఖమున భిన్నదేహుఁడయి రథ మధ్యమునఁ బడి యుండుట చూచి వచ్చితిని.

దుర్యో:—అయ్యో! వృషసేనకుమారా! ఇంకను వినవేల ? హా! వత్సా! వృషసేన! నేను జెప్పినపని చేయుచు నా తొడలపైఁ గూర్చుండెడివాఁడవు. ఓ గదాయుద్ధప్రియా! వీర్యసాగరా! రాధేయకులప్రరోహా! ప్రియదర్శనా! అయ్యో! దుశ్శాసననిర్విశేషా! హా! సర్వగురువత్సలా! ప్రతివచన మిమ్ము.

ఉ. చారెఁడుకన్ను, లభ్యుదయ
చంద్రకళాకమనీయకాంతి, పెం
పారెడు నూత్నయౌవన వ
యస్సముదంచిత రమ్యశోభ, చే
కూరిన నీముఖాంబుజము
గోము దొరంగిన యంత్యవేళ నె

ఙ్గార ! కనుంగొనం గలిగె
నయ్యయొ ! త్వత్ప్రీత కర్ణుఁ డె త్తెఱఁగ. ౧౦

సూతు:—ఆయుష్మంతుఁడా! విచారింపకుము. విచారింపకుము.

దుర్యో:—సూతుఁడా ! దుఃఖభాజనులు నిజముగాఁ బుత్త్రా త్మ్రులే. ఇఁక, మేమో !

గీ. ఎట్టయెదుటనె బంధువు లెల్ల రకట !
చనిరె యన్నపరాభవాగ్ని ని మనంబు
పరితపించుచు నుండె నేపగిది మాకు
దుఃఖ మది కల్గు? వ్యథ యెట్లు తోఁచు నార్య! ౧౧

(మూర్ఛిల్లును.)

సూతు:—మహారాజా ! ఊఱకొను మూఱకొనుము. దుఃఖింపకు. (పటాంతముచే విసరును.)

దుర్యో:—(లేచి) అప్పుడు నామిత్త్రుఁ డంగరా జేమి చేసెను ?

సుంద:—అప్పు డంగరాజు దేవా ! యట్టిగతిఁ బడిపోయిన కొడుకుఁ జూచి యాశ్రువులఁ దొప్పఁదోఁగి శరబాధను లక్ష్యపెట్టక యర్జునునిం దలపడెను. ఆరీతి సుతవధచే జనించిన మహాకోపముతో జవితమును లక్ష్యపెట్టక విజృంభించిన కర్ణునిఁ జూచి భీమనకులసహదేవపాంచాల ప్రముఖు లర్జునునకు సాయపడిరి.

దుర్యో:—తరువాత నేమైనది ?

సుంద:—అపు డర్జున చాపమహాప్రళయపయోధరములు వర్షించిన శరసహస్రవర్షముచే దిఙ్మండలము నిండుటఁ గని శల్యుఁ డంగరాజుతో "నోయీ ! గుఱ్ఱములు చచ్చినవి. రథచక్ర నేమికూబరములు విఱిగిపోయినవి. ఇపుడు భీమార్జునుల

నెమకొన్నుట క్షేమము కాదు." అని చెప్పి రథము మర లించి తీసికొనిపోయి దింపి యాతనిని బహువిధముల నూఱ డించెను.

దుర్యో:—తరువాత ?

సుంద:—అపు డంగరాజు క్షణ మాఁగి పరిజను నింకొకరథముఁ గొని రమ్మని పంపి నన్ను దీనదృష్టిం జూచి "సుందరకా!" యని పిలిచిన నేను దగ్గఱ కేఁగితిని. అంత నాతఁడు తన ముఖపట్టికను దీసి దానిపై బాణాగ్రమును దన గాయముల నెత్తుట ముంచి దేవర కీసందేశమును వ్రాసి పంపెను.

(పత్త్రిక యిచ్చును.)

దుర్యో:—(గ్రహించి చదువును.)

"స్వస్తిశ్రీ దుర్యోధనమహారాజులకు. ఇంతవఱకు యుద్ధాంగణమున నుండి ప్రభుకంఠమును గాఢముగాఁ గౌఁగిలించు కొని కర్ణుఁడు విజ్ఞాపించుచున్నాఁడు.

చ. శరబహువేది యీతనికిఁ
జాలినవాఁ డని లేఁడు, నాకు నూ
ర్గురు ప్రియసోదరావళికిఁ
గూరిమి నెక్కుడు, పాండుసూనులన్
మరమునఁ గూల్చు నీతఁ డని
తోషము నందెద; నేను భీము నె
ప్పరుసునఁ జంపఁజాల; వగఁ
బాయుము బల్మినో యశ్రుధారనో." ౧౨

ఇది యేమి? నూఱుగురు సోదరుల మరణమునకు విచారించు చున్నన న్నిట్టివాక్కు లనుశల్యముల బాధింతువేల? ఓయీ! సుందరకా! ఇపు డంగరా జేమి చేయఁ బూనినాఁడు ?

సుంద:—దేవా! శరీరాభరణముల విడిచి యాత్మవధకృతనిశ్చయుఁడై తిరిగి పార్థునితో యుద్ధ మొనరింప సిద్ధముగ నున్నాఁడు.

దుర్యో:—(విని వెంటనే లేచి) సుందరకా! నీవు తొందరగా నేఁగి వయస్యుఁ డగు నంగరాజుతో నావచనములుగా నిటు తెలుపుము. "నీ వింక విజయకాంక్ష విడిచిపెట్టుము. మన యిరువుర సంకల్పమునను భేదము లేదు. ఏలన,

ఉ. శత్రులఁ జంపి తర్పణము
చచ్చినబంధుల కిచ్చి యింక నే
మాత్రము చావకున్న మన
మంత్రుల మిత్రులఁ గూడి యేడ్చి యో
మిత్ర! మఱొక్కమాఱు విను
మీ తుదిసారిగఁ గౌఁగిలించుకొం
చాత్రముతోడఁ జత్త మక
టా! యదె దుఃఖమొ సౌఖ్యమో తుదిన్. ౧౩

ఇఁక, శోకవిషయమున నీ కేమి సందేశమిత్తును?

ఆ. బిడ్డ కాఁడు నీకు వృషసేనుఁ డనుకొమ్ము;
భ్రాత కాఁడు నాకుఁ బరముఁ గన్న
దుస్ససేనుఁ డింక; దుఃఖాబ్ధిమగ్ను నిన్
నేను, నన్ను నీవు నేల పలుక? ౧౪

సుంద:—చిత్తము. దేవా! (నిష్క్రమించును.)

దుర్యో:—ఏమిది! నేమి ధ్వనియో?

సూతు:—ఆయుష్మంతుఁడా! అది యధికమే యగుచున్నది.

దుర్యో:—ఓహో! పరిజనులు కొని తెచ్చు రథ మిది. నీవు దానిని సిద్ధము చేయుము.

సూతు:—చిత్తము. దేవా! (నిష్క్రమించి మరల బ్రవేశించును.)

దుర్యో:—ఏమి? నీవు రథమెక్కి రాలేదేమి?

సూతు:—దేవా! నీమాతాపితలు సంజయునితో రథమున నిటే వచ్చుచున్నారు.

దుర్యో:—అయ్యో! మాతాపిత లిట నేల సంభవించిరి! దైవ మతిబీభత్సమే చేసెను. సూతుడా! నీ వేగి రథము సిద్ధపఱుపుము. నేను దండ్రికగపడకుండ దాగుదును.

సూతు:—దేవా! వారికి నీ వొక్కడవే మిగిలినచుట్టమవు. వారి నేల యూఱడింపవు?

దుర్యో:—సూతుడా! నిర్భాగ్యుడను నే నెట్లు వారి నూఱడింతును? చూడుము.

మ. రణరంగంబున కేగుదెంచు తఱిఁ దో
రంబైన ప్రేమంబుతో
ననుఁగుందమ్ముని నన్ను నశ్రువుల మూ
ర్ధాఘ్రాణముంజేసి పం
పినవారిన్ దలిదండ్రి నేత్రియను నే
వీక్షింతు నొక్కండఁ; ద
మ్ముని చావున్ ముదివగ్గు లంధులకు నే
మోమెత్తి నే జెప్పుదున్? ౧౫

సరే కానిమ్ము. ఏమైనను, గురు లవశ్యవందనీయులుగదా!

(నిష్క్రమించును.)

ఇది చతుర్థాంకము.

వేణీసంహారము

పంచమాంకము

(రథయానమున గాంధారీ ధృతరాష్ట్రసంజయులు ప్రవేశింతురు.)

ధృత:——వత్సా ! సంజయా ! కురుకులవనమున నిఁక మిగిలిన యేకైకప్రవాళ మగువత్స దుర్యోధనుఁ డెట నున్నాఁడు ? అతఁడు బ్రతికి యున్నాఁడా ? లేదా ?

గాంధా:——జాతా ! వత్స నిజముగా జీవించియే యున్నచో నెట నున్నాఁడో చెప్పు.

సంజ:——ఇదిగో ! ఇటనే మహారా జేకాకియై మర్రినీడను గూర్చుండి యున్నాఁడు.

గాంధా:——జాతా ! ఏకాకియై యనుచున్నావు. భ్రాతృశతము సన్నిధిని లేదా ?

సంజ:——తాతా ! అంబా ! రథము మెల్లగ దిగుఁడు.

ఉభ:——(దిగుదురు.)

సంజ:——(దిగి సమీపించి) మహారాజా ! జయము. జయము. నిన్నుఁ జూడ నీతలిదండ్రు లిదే వచ్చియున్నారు. పలుకరింప వేమి ?

దుర్యో:——(నిర్ఘాంతపోయి నిలఁబడును.)

ధృత:—

చ. కవచము దీయఁ, గంకపుము
ఖంబున నల్గుల నూడ్చఁగా, శమం
బ్వుకటు గాయపుండనువు
సందు వ్రిణార్తిహారంపుఁ బట్టముల్
తవులుప, దిండుపై నొరగ,
దవ్వున శత్రులు గెల్చుమై నగన్,
జెవిని "సుఖంబ ? వత్స !" యని
చీ ! యడుగన్ వలసెన్ దురాత్ముఁడన్. ౧

(గాంధారీధృతరాష్ట్రులు తడవి దుర్యోధనుని గౌఁగిలించుకొందురు)

గాంధా:—వత్సా ! పెద్దగాయములవలన బాధచే మాట వచ్చుట లేదా ? నాయనా !

ధృత:—వత్సా ! దుర్యోధనా ! నీ విట్లుండు టెన్నఁ డెఱుఁగమే. మాతోఁ గూడఁ బలుకకున్నా వేమి ?

గాంధా:—వత్సా ! నీవే మాటాడకపోయిన, నిఁక దుశ్శాసన దుర్మర్షణులెట్లు మాటాడుదు రనుకొందును? (ఏడ్చును)

దుర్యో:—

ఉ. సోదరు లందఱున్ మడియఁ
జూచి ప్రతిక్రియ చేయలేక దుః
ఖోదధి మిమ్ము ముంచిన మ
హోన్నతపాపిని, భారతాన్వయ
చ్ఛేదకదుర్జనుండను ని
సీ ! సుతనాశుఁడ నైన నన్ను మీ
రీదయతో సుతుం డనుచు
నేల వచింతురు కూర్మి మీఱఁగన్. ౨

గాంధా:—నాయనా! విచారింపకుము. నీవైనను సంఘుల మగు మాకు మార్గోపదేశకుఁడవై యుండవలయుఁ జిరంజీవివి కమ్ము. నాకు రాజ్యమేల ? జయమేల ?

దుర్యో:—

ఉ. ఇట్టి వికారవాక్యముల
నెన్నఁడుఁ బల్కవెఱుంగ వీవు నేఁ
డిట్టులు పల్కుటేల? జన
నీ! ఘనరాజకులంబునందునం
బుట్టవొ ? దైన్య మేల ? మఱి
పోయినపుత్త్రుల కేడ్వ కేల యీ
కట్టిఁడినైన నే బ్రతుకఁ
గావలె నందువు సిగ్గుచేటుగన్. 3

పుత్త్రశోకమువలన నీకుఁ గలిగిన వికారమే యిది. సందేహము లేదు.

సంజ:—ఏమి? "చేఁద నూఁతఁబడినఁ దాఁడును నందుఁ బాఱవేయరా" దనులోకోక్తి యసత్యమా ?

దుర్యో:—ఇది సరి కాదు. ఉపక్రియమాణాభావమున నికనుపకరణ మేల ? (దుఃఖించును.)

ధృత:—(దుర్యోధనునిఁ గౌఁగిలించుకొని) వత్సా ! విచారింపకుము. అతిదీనుల మైన మ మ్మూఱడింపుము.

దుర్యో:—తండ్రీ! ఇపుడు మి మ్మూఱడింపలేను. ఏలన;

క. కుంతిని నే నిపుడే యొన
రింతుఁ హతపుత్త్ర గాఁగ; బ్రియసుతవధ కా

కుంతిని మీారలు, మిమ్ముఁ
గుంతియు, నూరార్చుకొనుచుఁ గుములఁగవచ్చుఁ. ౪

గాంధా:—నాయనా ! నీ వొక్కఁడవైనను బ్రతికియున్నచో నాకదియే పదివేలు. నీవును బోయిన నిఁక నే నెవరికై యేడ్తును ? అందుచే నిది సమరమునకు సమయము కాదు. శాంతింపుము. నీకు దండము. యుద్ధవ్యాపారము మాను కొనుము. నావూట పెడచెవిని బెట్టకు.

ధృత:—నాయనా ! అశేషబంధువర్గము చనిపోవుటఁ జూచిన మామాట నీవు తప్పక వినుము. ఏలన:

సీ. ఎవ్వారిభుజబలం బెంచి దాయాదుల
నిలఁ దృణంబులుగ నీ వెంచినావొ
యాద్రోణభీష్ము లీయవనీతలంబున
లేరైరిగా తండ్రి !; వీరవరుని
కర్ణపుత్త్రిని లయకాలరుద్రునివంటి
వృషసేను నట్టులు పిలుకుమార్చి
వెలయునర్జునుఁ జూచి భీతిల్లు జగమెల్ల;
సుతులు నూర్గురు రణక్షితిని బడిరి
ఆ. మిగిలియుంటి వీవ పగఅప్రతిజ్ఞ కుఁ
బోరు మాను వత్స ! వైరితోడ
గ్రుడ్డివార మేము గురులము నీకు మ
మ్మేలుకొనుము తండ్రి ! మేలు కలుగు. ౫

దుర్యో:—యుద్ధము మాని నేఁ జేయున దేమి ?

గాంధా:—నాయనా ! నీపితయు విదురుఁడు నెట్లు చెప్పిన నట్లు చేయుము.

సంజ:—రాజా ! ఇది యుచితము.

దుర్యో:—సంజయా ! ఇంకను వారు నాకుఁ జెప్పఁ దగినది కలదా ?

సంజ:—దేవా ! విజయాభిలాషి యగునృపుఁడు ప్రాణముపోవునంతకుఁ బ్రజ్ఞావంతులు చెప్పినది వినవలసినదే.

దుర్యో:—(క్రోధముతో) ఐనచోఁ బ్రజ్ఞావంతు లగుమీరు మీ వచనములేవో బాగుగాఁ జెప్పుఁడు.

ధృత:—వత్సా ! యుక్తవాది యగుసంజయునిపైఁ గోపించుట తగదు. నీవు కోపము మాని విన్నచో నేనే చెప్పుదును వినుము.

దుర్యో:—చెప్పుము.

ధృత:—వత్సా ! అతివిస్తరమేల ? యుధిష్ఠిరుఁడు కోరినపణ మిచ్చి వానితో సంధి చేసికొనుము.

దుర్యో:—తండ్రీ ! తనయ స్నేహవైక్లబ్యమునఁ దల్లియు, బాలిశత్వమున సంజయుఁడు నట్లన్న నందురుగాని నీ వెటు లీమాట యనఁ గల్గితివి? నీ కేమైన వెఱ్ఱియా? లేక పుత్త్ర నాశజనిత మగుహృదయజ్వరమా ? ఆ విధమునఁ దొలుత నస్ఖలితభ్రాతృశతముతో నపధీరితుఁడనై యుండ వాసుదేవుఁడు చెప్పినసామోపదేశమును నిరాకరించి, యిపుడు పితామహాచార్యానుజరాజచక్రము గాంచిన విపత్తుఁ జూచి నీచ శరీరమాత్ర స్నేహమున నుదాత్త పురుషవ్రీడావహము, నసుఖావహము నగుసంధి పాండవులతో నొసరింప దుర్యోధనుఁ డెట్లంగీకరింపఁగలఁడు ? అదియుఁగాక నయకోవిదా ! సంజయా !

క. హీనుం డగురిపుతోడ న
నూనం బగుసంధి చేయ నొప్పునె నృపుఁ; డే
హీనుండును బాండవులో
సానుజు లెటు లగును సంధి యక్కట! చెపుమా! ౬

ధృత:—వత్సా! ఈస్థితియందైనను యుధిష్ఠిరుఁడు నాప్రార్థన మంగీకరించును. ఇది కాక యుధిష్ఠిరుఁ డెల్లప్పుడు నిన్నుఁ దనకన్న మిన్నగనే యాత్మలోఁ దలపోయుచుండును. నీతో నాతఁడు సంధి కిచ్చగించితీరును.

దుర్యో:—ఎట్లు?

ధృత:—ఈ యుధిష్ఠిరుఁడు తనసోదరులలో నెవఁడు చనిపోయినను దాను బ్రాణము విడుతు నని శపథము చేసినాఁడు. ఆకారణమున నీ వొక్కఁడవైనను నాతనిసోదరులలో నెవని కేమి కీడు వాటింతువో యనుభయము నందుచుండును, కనుక నతఁడు సంధి కిచ్చగించును.

సంజ:—నిజము.

గాంధా:—నాయనా! వీరిమాట నిజము. నీవట్లే వర్తింపుము.

దుర్యో:—తండ్రీ! అమ్మా! సంజయా!

ఉ. తమ్ముఁ డొకండు చచ్చినను
దానును జావఁ బ్రతిజ్ఞఁ బూనెఁగా
యిమ్మహి ధర్మసూనుఁ! డిహి
హీ! మఱి నూర్గురుతమ్ము లీల్గఁ బ్రా
ణమ్ముల నుంటి నే నకట!
నాయనుజాస్త్రముఁ గ్రోలుభీము నొ
క్కుమ్మడి నుగ్గుసేయక గ
దోద్ధతి, సంధి యొనర్తునే యిఁకన్? ౭

గాంధా:—నాయనా ! దుశ్శాసనా ! అయ్యో ! దుర్మర్షణా ! హా! వికర్ణా ! లోకములో నిట్టిదురవస్థ యెప్పుడును విన్నదియుఁ గన్నదియుఁ గాదుకదా ! ఓ వీరప్రసవినీ ! గాంధారీ ! నీవు దుఃఖశతమునే కాని సుతశతమును గనలేదు !

(అందఱు నేడ్తురు)

సంజ:—(కన్నీరు తుడుచుకొని) తండ్రీ ! తల్లీ! మీరిచటికి మహారాజు నూఱడించుటకు వచ్చియున్నారు. మీరే యిట్లు స్వస్థులైన నిఁక నెట్లు ?

ధృత:—వత్సా ! దుర్యోధనా ! మనభాగ్య మిట్లున్నది. నీవు శత్రుద్వేషము విడువఁజాలవు. త్వదేకశేషజీవితాలంబనుల మగు గాంధారీతపస్వినికి నాకు నిఁక శరణ మెవరు? అవలంబన మేది ?

దుర్యో:—మీ కవలంబన మిదే వినుఁడు.

మ. అతివిస్తారధరిత్రి నేలఁ గని, య
 త్యైశ్వర్యముల్ గాంచి, యు
ద్ధతశత్రువ్రజమస్త మకుటో
 దారార్చనల్ పొంది, యు
న్నతవీరాగ్రగణంబు నోర్చి, యనిలో
 నఁ మృత్యువుం గన్న మీ
సుతులన్ మెచ్చి, ధరిత్రిఁ గొందు సగర
 క్షోణీంద్రు చందంబునన్. ౧

ఇట్లు కానినాఁడు, నేను క్షత్త్రధర్మమును విడిచినవాఁడ నగుదుఁగదా !

(తెరలో మహాకలకలము)

గాంధా:—(విని మహాభయముతో) సంజయా! హాహాకారముల తోడి యీతూర్యధ్వను లేమి?

సంజ:—అమ్మా! నానామహానినాదముల కాస్పద మైనయి చ్చోట నీవంటిభీరుజనము లుండరాదు.

ధృత:—వత్సా! సంజయా! ఈహాహారవము లధికమగుచున్నవి. ఏదియో గొప్పకారణమే యుండనోపును.

దుర్యో:—తండ్రీ! అనుగ్రహింపుము. దైవము మన కెదురై యున్నాఁడు. అందుచే మరల నేదైన సహితము చెవినిబడక పూర్వమే నాకు సంగ్రామమున కేఁగుట కనుమతి నను గ్రహింపుము.

గాంధా:—వత్సా! మందభాగిని నగున న్నొక్కమా ఱారయ డింపుము.

ధృత:—వత్సా! నీవు సమరమునకుఁ గృతనిశ్చయుఁడవే యైనచో శత్రుజయమును రహస్యోపాయమున సాధింపుము.

దుర్యో:—శా. ప్రత్యక్షంబుగ బంధుసంతతిని జం
పన్ బాండవుల్ చూచి య
ప్రత్యక్షంబుగ వారిఁ జంపుదునె? చం
పన్ మెత్తురే శత్రువుల్?

గాంధా:—వత్సా! నీ వేకాకివిగదా! నీకు సహాయు లెవరు!

దుర్యో:— సత్యంబే నొకరుండఁ జంపుదు రిపు
వ్యూహాలురన్, దైవమే
యత్యంతం బగుతోడు నాకు; జగ మ
మ్మా! నేఁ డకౌంతేయ మౌ.

(తెరలోఁ గలకలము. తరువాత)

ఓయోయోధులారా! ఈమహాయుద్ధము కౌరవేశ్వరునకు నివేదింపుఁడు. అప్రియశ్రవణపరాఙ్ముఖత యిఁకఁ జాలును. ఇపుడు కాలానురూప మగుప్రతిక్రియ నడుపవలయును. ఏలనఁ గురుశల్యుఁ డగుశల్యుఁడు

శా. త్యక్తప్రాజనరశ్మిరంకితతనుం
డై, పార్థబాణంబులన్
రక్తం బుప్పతిలన్, రథాశ్వములు పా
రం దేరితో వెన్క, కా
సక్తస్వాంతుల కంగరాజుగతి య
స్రించె నివేదింపఁగా,
రిక్తస్యందనుఁడై కటా! శిబిర మీ
రీతిన్ బ్రవేశించెడున్. ౧౦

దుర్యో:—(విని శంకతో) సూతా! అశనిపాతదారుణముగ నుద్ఘోషిత మైన యీపలు కెవరిదో? ఎవఁడురా యక్కడ?

సూతుఁడు:—(ప్రవేశించి సంభ్రాంతుఁడై) అయ్యా! చచ్చితిఁ జచ్చితి. (భూమిపైఁ బడిపోవును)

దుర్యో:—ఏమది?

ధృత. సంజ:—ఏమది? చెప్పు. చెప్పు.

సూతు:—ఆయుష్మంతుఁడా! ఇఁక నేమున్నది?

ఆ. కట! మనోరథంబుగతి శూన్య మైన యీ
కర్ణురథము నెక్కి కాంతి దక్కి
శల్యరూపమునను శల్యుండు శిబిరంబుఁ
జొచ్చె మెల్లజనులఁ బుచ్చె మూర్ఛ. ౧౧

దుర్యో:—అయ్యో ! మిత్రమా ! కర్ణా ! (మూర్ఛిల్లును)

గాంధా:—ఊఱకుండు మూఱకుండుము.

సంజ:—మహారాజా ! ఊఱడు మూఱడుము.

ధృత:—కష్టము ! కష్టము !

క. దురమున భీష్మద్రోణులు
మరణింపఁగఁ గురుబలంబు మహితాలంబం
బరయదు; కర్ణుఁడు నేఁ డిటు
మరణింపఁగ నింక దిక్కు మాకుం గలదే ? ౧౨

వత్సా ! ఊఱకొను, మూఱకొనుము. ఓ హతవిధీ !

చ. సుతశతనాశనం బనెడి
శోచ్యదశం బొరలాడుచుంటి నం
ధతకును దోడు, భార్యయు న
నంతవిచారమహాబ్ధి మున్గె, నా
హితులును బంధువర్గములు
నెల్లరు నీల్గిరి నిర్విశేషులై
హతవిధి ! యీసుయోధనుని
యందలి యాశయుఁ దోఁప దింతయున్. ౧౩

వత్సా ! దుర్యోధనా ! తపస్విని యైనమీయమ్మ నూఱడింపుము.

దుర్యో:—(తెలివంది)

గీ. కర్ణ ! కర్ణ పేయతేఁ బలుకమి నయంబె?
నాపయిఁ గల్గుప్రేమ మంతయుఁ దొలంక ;
విడిచియుండను జేయ నప్రియము నెపుడు
విడిచితివె నన్ను వృషసేను వెన్నుదగుల ? ౧౪

(మరల మూర్ఛపోవును)

అందఱు:—(ఊఁటడింతురు)

దుర్యో:—(ఊఁటడిల్లి)

క. ప్రాణముప్రాణము కర్ణుఁడు
ప్రాణము పీడంగఁ జెవులఁబడినను ఛీ! నా
ప్రాణము వీడను సిగ్గిసి!
త్రాణ గలదె తండ్రి! నాకు ధైర్యముగొనఁగన్? ౧౫

మఱియు:

మ. అనుఁగుందమ్ముఁడు దుస్ససేనుఁ డనిలో
నట్లీల్గ, నుద్దండులౌ
మనబంధుల్ మృతినందఁగాఁ, గనియు నే
మాన్పాటునుం జెంది యే
డ్వ, నిజం బెంతగ నేడ్వఁగా వలసినన్;
బ్రాణంబుప్రాణంబు నా
యనుఁగున్నెచ్చెలి కర్ణుఁ డీల్గ నకటా!
యత్యంత మే నేడ్చెదన్. ౧౬

గాంధా:—నాయనా! ఒకక్షణమైన నూఱకొను. తండ్రి!

ధృత:—వత్సా! ఒక్కమాఱు కన్నీరు తుడుచుకొనుము.

దుర్యో:—

క. నాకొఱకై బలియిచ్చె న
హా! కర్ణుఁడు ప్రాణవితతి నని వారితుఁడై
యేకరణిని, నే నేడ్చెద
నాకర్ణునికొఱకు మీర లాఁపకుఁడు నన్నన్. ౧౭

సూతుఁడా! అసంభావితముగ మత్కులాంతకర మగునీకర్మ
మొనరించిన వ్యక్తి యెవఁడు?

సూతు:—ఆయుష్మంతుఁడా ! జను లిట్లనుకొనుచున్నారు.

"క. భువిఁ గ్రుంకఁగ రథచక్రము
రవిసూనుం డెత్తులో నురంబును వ్రచ్చెన్
బవిగతి సజ్జునబాణము
లవిరళకురుసైన్యకాలయమ సన్నిభముల్." ౧౮

దుర్యో:—

క. కర్ణాననేందు శోభా
వర్ణనమునఁ బొంగు శోకవార్నిధి కడు నా
యర్ణవము నింకిపోవును
గర్ణారిన్ దునుమఁ బుట్టుఘనబడబాగ్నిన్. ౧౯

తల్లీ ! తండ్రీ ! ఊఱడిల్లుఁడు.

క. శోకాగ్ని ప్రజ్వరిల్లుచు
నేకాల్చుచు నుండె నాదునెద నే సైఁపన్;
మీ కేల శంక సమదుః
ఖాకులతను ? బోరి కేఁగ ననుమతి యిండీ ! ౨౦

ధృత:—(దుర్యోధనుని గౌఁగిలించుకొని యేడ్చుచు)

ఉ. సాహసకార్య మన్న సుత !
సంశయచిత్తుఁడ నే నిజంబు; నీ
సాహవదోహలంబునకు
సడ్డ సహింపవు; భీమభీమస
న్నాహము నేఁ దలంచిన మ
నంబు ద్రవించు భయం బగున్; ఛల
వ్యూహ జయంబు నచ్చ దెటు
లో యిఁక మానధనా ! హతోఽస్మి. హా ! ౨౧

గాంధా:—జాతా! సుతశతకృతాంతుఁ డగు వృకోదరునితోఁ డనే సమరము చేయ నేఁగుచున్నావా?

దుర్యో:—అంబా! ఆవృకోదరు నటుండనిమ్ము!

చ. హృదయమనోరథంబు, కడు
 నింపులు గుల్కెడు సర్వదేహ స
న్మదమధురార్ద్రి చందన సు
 ధారసచర్చ, మదీయనేత్ర సం
పదకును గందు లేని శశి,
 మాత! భవత్సుతుఁ, డోయితండ్రి! నీ
గదకును గూర్మిశిష్యుఁ డగు
 కర్ణునిఁ జంపినవానిఁ జంపుదుర్. ౨౨

సూతుఁడా! ఈ కాలాతిపాతము చాలును. రథము సిద్ధపఱచికొని తెమ్ము. పాండవు లన్న నీకును భయమే యగుచో నాఁగిపో. గదామాత్రసహాయుఁడనై నే నొక్కఁ డనే సమరభూమి కేఁగుదును.

సూతు:—నన్ను వేఱువిధముగాఁ దలంపకుము. నే నిదే వచ్చుచున్నాను. (నిష్క్రమించును.)

ధృత:—వత్సా! దుర్యోధనా! మమ్ము దగ్ధముచేయుటకే నిశ్చయించుకొన్నచో నీ వెవరినో యొకనిని సేనాధిపతిగా నభిషేకింపుము.

దుర్యో:—అతఁ డభిషిక్తుఁ డయియే యున్నాఁడు.

ధృత:—శల్యుఁడా? అశ్వత్థామయా?

సంజ:—రాజా!

క. గతియింపఁగ భీష్ముఁడు, సం
 హతి నందఁగ ద్రోణుఁ, డంతమందఁగఁ గర్ణుం,

డతిబలవతి యగుటాశయు
నతిరథుఁ డగుశల్యుఁ డొకఁడె యరులను గెలుచుఁ. ౨౩

దుర్యో:—ఇఁక శల్యుం డేల? అశ్వత్థామ యేల ?

ఆ. కర్ణమిత్త్రుఁ గూర్మిఁ గౌఁగిలింపఁగనో
కర్ణశత్రుఁ జంపఁ గాంచుటకునో;
యడ్డు లేక పాఱు నశ్రుజలంబుచేఁ
జేసికొంటిని నభిషేక మేను. ౨౪

(తెరలోఁ గలకలము. తరువాత)

ఓ యోకౌరవబలప్రధాన యోధులారా! మమ్ముఁ గాంచి భయపడి పాఱిపోకుఁడు. దుర్యోధనుఁ డెచట నెందుల కున్నాఁడో చెప్పుఁడు.

(అందఱు సంభ్రాంతులై వినుదురు.
సంభ్రాంతుఁడై సూతుఁడు ప్రవేశించును.)

సూతు:—ఆయుష్మంతుఁడా!

గీ. ఒక్కరథ మెక్కి యిర్వురు నిక్కడక్క
డమగుచున్నారు నీవార్త యరుగుదెంచి.

అందఱు:—ఎవ రిరువురు ?

సూతు:—కర్ణుఁ గూలంగఁగొట్టిన క్రౌర్యమూర్తి
క్రూరవృకకర్ముఁ డైన వృకోదరుండు. ౨౫

గాంధా:—జాతా! ఇపుడు చేయు ప్రతిక్రియ యేమి ?

దుర్యో:—నా గద దగ్గఱనే యున్నదిగదా ?

గాంధా:—అయ్యో! దురదృష్టవంతురాలను. చచ్చితిని.

దుర్యో:—తల్లీ! ఈ కృపణత చాలును. సంజయా! రథ మెక్కించి పితరులను శిబిరముఁ జేర్పుము. నా శోకముఁ బోఁగొట్టఁ గలజనులే వచ్చినారు.

ధృత:—వత్సా ! ఒక్కక్షణము నిలువనిమ్ము. వారిభావ మేమో తెలిసికొందుము.

దుర్యో:—తండ్రీ ! ఇఁక నాలస్యము వలదు. పోయి రండు.

(గాంధారీ ధృతరాష్ట్రులు కొంతదూర మరిగి కూర్చుందురు. రథారూఢులై భీమార్జునులు ప్రవేశింతురు.)

భీమ:—ఓ సుయోధనాను జీవులారా ! మీరు సంభ్రాంతులై యటునిటు తిరిగెద రేల ? మీ స్వామి యగు కురుపతికి మాయాగమనముఁ గూర్చి చెప్పితిరా ? మీ రేమియు భయపడకుఁడు.

సీ. మాయజూదంబున మమ్ము గెల్చినజోదు
లక్కయిల్లాల్చిన యుక్కలేఁడు
ద్రౌపది సిగ ముట్టి తనియక వలువల
నెడలింపఁ గన్న యా వెడఁగుగాలి
పంచపాండవులను బరమదాసులనుగా
నమరించుకొన్న మహాభిమాని
దుశ్శాసనాదుల దొర, నూర్గురనుజుల
భ్రాత, కర్ణుని మిత్త్రివరుఁడు నైన

గీ. కురుపతి సుయోధనుఁడు మహాచరితుఁ డెచటఁ
గొలువుదీరి యున్నాఁడొకో తెలుపుఁడయ్య !
క్రోధమున నాతనిని మేము కూల్పరాము
చూచి పోవుటకే యిందుఁ జొచ్చినాము. ౨౬

ధృత:—సంజయా ! ఈ ఖలుని యెత్తిపొడుపుమాటలు దారుణములు కదా !

సంజ:—తాతా! వారిదివఱకే కృతనిశ్చేషకర్మ లయి ప్రియ మొనరించుకొనినారు. ఇపుడు మాటలచే మరల నొనరించు కొనుచున్నారు.

దుర్యో:—సూతుఁడా! నే నిచట నీ యిరువురతోఁ గూర్చుంటి నని చెప్పుము.

సూతు:—చిత్తము. (పోయి) ఓ వృకోదరార్జునులారా! తలి దండ్రులతో నీ మఱ్ఱిచెట్టు నీడను మహారాజు కూర్చుండి యున్నాఁడు.

అర్జు:—ఆర్యా! మన్నింపుము. పుత్త్రశోకపీడితు లగు పితరు లను మన దర్శనముచే మఱింత యేడ్పించుట తగదు. పోవు దము.

భీమ:—వెఱ్ఱివాఁడా! సదాచార మనుల్లంఘనీయము గదా! గురువుల నభివందించికాని మఱి పోరాదు. (ప్రక్కకుఁ దిరిగి) సంజయా! పితరులకు మానమస్కృతు లని చెప్పుము. పోనిమ్ము. ఉండుము. మేమే వినిపింతుములే. (రథము దిగు దురు.)

భీమ:—అర్జునా! మన నామకర్మములతో గురువులకు వంద నము చేయవలయును జుమా!

(ఇరువురును సమీపింతురు.)

అర్జు:—(దగ్గఱకుఁ బోయి) తల్లీ! తండ్రీ!

చ. అరిగణముల్ జయించు నని
యంతయు నింతనరానియాశ నా
ర్గురు సుతు లెవ్వనిన్ దలఁచి
రో, మఱి గర్వముచేత నెవ్వఁ డౌ

ల్లరిని దృణంబుగాఁ గని మొ
లంగెనో, వానిని సూతపుత్త్రు ను
గ్వాగఁ బడఁగొట్టి యున్నతేఁడు
ఫల్గునుఁ డియ్యెడె వందనం బిడుఁ. ౨౭

భీమ:—గీ. చూర్ణితాశేష కౌరవ్యశోభనుండు
పీతదుశ్శాసనాస్ర సంప్రీతిహేతి
మఱి సుయోధను నూరు యుగ్మమును గొట్టు
భీమసేనుండు మ్రొక్కె నోపితరులార ! ౨౮

ధృత:—(కోపముతో) దురాత్మా! వృకోదరా! సపత్నుల కపకృతి యొనరించినది నీవే కావురా. క్షత్త్రియకుల మంతయు సంగరమున జయమో వీరమరణమో పొందుచునే యుండును. ఇఁక, నీ వాత్మస్తుతిచే మమ్ముల యుద్వేగ పెట్టెదవు?

భీమ:—తండ్రీ! కోపపడకు. కోపపడకు!

చ. కురుసభ కట్లు ద్రౌపదిని
గొప్పను బట్టియె యీడ్చి తెచ్చి త
త్పరమపతివ్రతామణి క్రు
ధాగ్నిమహోజ్జ్వల కీలలందు మ్ర
గ్గిరి నృపబంధు లెల్ల రని
కేవల సత్యముఁ జెప్పినాఁడ; నీ
వరయవె సాక్షివై కురుసు
తాగ్రణు లెల్లరు చేయుదుష్క్రియల్ ? ౨౯

దుర్యో:—ఏమిరా! గాలికొడుకా! ముసలిరాజు కడ నీచేసిన చెట్టలను గొప్పపనులుగాఁ బొగడుకొనుచున్నావఁటరా!

చ. పసు లగుమీకు నేవురకు
భార్యయు నాకును ద్యూతదాసి యగా
ససతిని నాదునాజ్ఞ నటు
లక్కడ నీడ్చిపఁ జూచినార లీ
వసుమతిరాజు లేల యన
వారిని వైరమునందు మ్రగ్గఁగా ?
పస గలదేని నన్ను గెలు
వంగను రార! యఖండవీర్యుఁడన్. ౩౦

ఓరి దురాత్మా! నీవు చచ్చితివిరా! (కోపముతో లేచి చంపఁ బోవును)

ధృత:—(దుర్యోధనునిఁ బట్టుకొని కూర్చుండఁబెట్టును)

భీమ:—(క్రోధము చూపును)

అర్జు:—ఆర్యా! గీని కింత కోప మేల ?

గీ. అప్రియంబును గ్రియను జేయంగలేక
మాటచేఁ జేయుచున్నాఁడు మన కితండు
చచ్చిపోయిన తమ్ములసంగతిని వి
పాదమునఁ బ్రేలు వీనితో వాద మేల ? ౩౧

భీమ:—ఓరోరి భరతకులకలంకా !

గీ. ఓరి వాచాట! నినుఁ జంపి యొక క్షణమున
దుస్ససేనుని కడ కంపుదునుర ! యిపుడు
మద్గదాశక్తి నిర్భిద్యమానయుష్మ
దస్థిశబ్దంబునన్ బిత లడలకున్న. ౩౨

మఱియు నోమూర్ఖా !

మ. వనితం బోలి విరోధ మేన్పనని తీ
ర్పం గాంచుచున్నావు నీ

యనుజన్ముం డగు దుస్ససేనునెద నే
నానాఁ డటుల్ వ్రచ్చి నె
త్తును గ్రోలంగను జూచుచున్ నిలువవే ?
దుఃక్షత్త్రియా ! నీవు; పెం
పున యుష్మత్కుల పద్మినీ గజము భీ
ముం డగ్గినన్ జావవే ? 33

దుర్యో:—దురాత్మా ! భరతకులాధమా ! ద్యూతదాసా !
పాండవపశువా ! నీకువలె నేను డంబములు కొట్టనురా !

గీ. మద్గదాభిన్న వక్షస్థలోద్గత మగు
నెత్తుటేరున నెమ్ముకల్ నీవి మెఱయ
సమరతలమున నీచావు జూడఁ దెలిసి
యిపుడె పాండవు లెంతయో యేడ్వఁగలరు. 3౪

భీమ:—(నవ్వి) ఓహో ! ఐన మేము నిన్నేమఱరాదు. మంచి
యిదిగో ! నాప్రతిజ్ఞ వినుము.

చ. గిర గిరఁ ద్రిప్పుకొంచు గద
కిన్కను నీదగునూరుయుగ్మము
ద్ధురముగఁ బిండిగొట్టి తలఁ
దూర్తుఁ బదంబులు ప్రొద్దుటన్ నృపుల్
వెఱపునఁ జూడ; నెల్ల రరి
వీరులఁ జెండి తదస్రచందనం
బరు దగుహార భంగి నొడ
లంతయుఁ జిమ్ముకొనం దెలంగుదున్. 3౫

(తెరలో)

ఓ భీమసేనార్జునులారా! ఇదిగో! నిహతాశేషారాతిచక్రుండును, ఆక్రాంత పరశురామాభిరామ యశుండును, ప్రతాపతాపిత దిఙ్మండల స్థాపితస్వజనుఁడును, అజాతశత్రుఁడును, మహారాజును నగు శ్రీమాన్ యుధిష్ఠిరచక్రవర్తి యిట్లాజ్ఞ పెట్టుచున్నాఁడు.

భీమ. అర్జు:—ఏమని ?

(మరలఁ దెరలో)

చ. అనిఁ దెగియున్న యాప్తులకు
నగ్నికృతుల్ పొనరింపుఁడయ్య!; భ
క్తిని నయనాశ్రువారిని గ
తించిన బంధుల కిందు తర్పణం
బును దగుబాంధవుల్; సమర
భూమిని నేఁటుఁడు జ్ఞాతిదేహముల్;
చనె నినుతోడ శత్రురిపుల
సంతతి; సైన్యములన్ మరల్పుఁడీ! ౩౬

భీమ. అర్జు:—సరే. (నిష్క్రమింతురు.)

(తెరలో)

ఓరోరి గాండీవాకర్షణ బాహుశాలీ! అర్జునా! ఎటకుఁ బోవుదురా!

మ. నినుఁ జంపం గలవిల్లు కర్ణుపగచే
నే వీడుటం జేసియే

వనమందుర్ వలె వీరశూన్యరణసే
వన్ ద్రోఘుఁ డైనాఁడవా?
జనకుం డస్త్రము వీడి నప్పటి శిర
స్స్పర్శంబు భావించి నే
ననికిం జొచ్చితిఁ; బాండవద్రుపదసై
న్యాగ్నిక్రియన్ ద్రోణిసిన్. ౩౨

ధృత:—(విని సంతోషముతో) వత్సా! దుర్యోధనా! ద్రోణవధ పరిభవోద్దీపక క్రోధపావకుఁడును, తండ్రికంటెను సమధిక బాలుఁడును, శిక్షావంతుఁడు, దేవసదృశుఁడు నగు మహాత్ముఁ డశ్వత్థామ విచ్చేయుచున్నాఁడు. ఆ మహావీరుని నీ వెదురేఁగి సంభావింపుము.

గాంధా—నాయనా! ఆ మహానుభావున కెదురేఁగుము.

దుర్యో:—తండ్రీ! తల్లీ! అంగరాజు చావు గోరిన యీ యశ్వత్థామ యావనశస్త్రగ్రహణుఁడు మన కేల?

ధృత:—వత్సా! ఈ తరుణమున నంతపరాక్రమవంతునితో నిట్టి మాట లాడి యాతనికి విరాగము కలిగింపరాదు.

అశ్వత్థామ:—(ప్రవేశించి) కౌరవాధిపతీ! జయము జయము.

దుర్యో:—(లేచి) గురుపుత్రా! ఇటఁ గూర్చుండుము.

(కూర్చుండఁ బెట్టును.)

అశ్వ:—రాజా! దుర్యోధనా!

గీ. చెవుల కింపుగఁ బల్కియు నవల కర్ణుఁ
డనిని జూపినపస తెల్లమయ్యె నీకు;
ద్రోణి విల్లెక్కిడి రణంబుఁ దా నొనర్ప
వచ్చెఁ బ్రతికార చింతఁ బోఁబుచ్చు మదని. ౩౩

దుర్యో:—(మిక్కిలి యసూయతో) ఆచార్యాత్మజా !

గీ. కర్ణుఁ డీల్గినపిదప నే కాదె నీవు
యుద్ధ మొనరింపఁ బూనిక నుండినాఁడ
వేను మరణించుదాఁక నీ వెదురుచూడు
కర్ణదుర్యోధను లన నొక్కటియె కాదె ? ౩౯

అశ్వ:—(తనలో) ఏమి ! ఇప్పుడుకూడఁ గర్ణుఁ డన్నఁ బక్షపాతమును నే నన్నఁ బరిహాసమునా ? (ప్రకాశముగా) రాజా ! కౌరవేశ్వరా ! అట్లే యగుఁగాక ! (నిష్క్రమించును)

ధృత:—వత్సా ! నీకు మతిలేదా యేమి ? ఇట్టి సమయమునను నట్టి మహానుభావుఁ డైన యశ్వత్థామకుఁ బరుషవాక్యములచే మనస్సు విఱుగునట్లు చేసితివి !

దుర్యో:—ఏమి ? నే నేమి యసత్య మాడితిని ? ఇది నాకుఁ గ్రోధహేతువు కాదా ! ఏలన :

గీ. ధన్యు లగురాజులకుఁ జూడఁ దలఁపరాని
వీరవరు నీదుదౌర్భాగ్య కారణమున
ననిని జచ్చినవాని, నాయాప్త మిత్రుఁ
దిట్టుద్రోణికిరీటులు నెట్టు వేతు ? ౪౦

ధృత:—అయ్యో ! వత్సా ! నిన్ననవలసిన దే మున్నది ? భరతకులమున కిది యవసానదశ. గాంధారీ ! సంజయా ! నిర్భాగ్యుఁడను నే నేమి చేయుదును ? (ఆలోచించి) ఇట్లగుఁగాక ! సంజయా ! అశ్వత్థామతో నావచనములుగా నిట్లు పలుకుము:

చ. ఇరువురుఁ గూడిమాడుచును
నింపుగ స్తన్యముఁ గ్రోలియుండు నే

మఱకుము; నిన్ను నెత్తుకొని
వాలిని నుంచుట బట్ట పాడుగా
మఱవకు; భ్రాతృదుఃఖమున
మైత్రిని ని న్నటు లాసుయోధనుం
డఱవఁగఁ గ్రోధముం బెనుప
కయ్య! గురూ త్తమ పుత్త్రి! పీనిపై. ౪౧

సంజ:—సరే. (లేచును)

ధృత:—ఇదికూడ నా పలుకుగా నతనికిఁ జెప్పుము.

చ. అనృతము విన్న నీపిత మ
హాత్ముఁ డటుల్ శర ముజ్జగించుటల్,
గన విన రాని రీతి నతి
గాఢపరాభవ మాతఁ డందుటల్,
ఘనబలముల్ బరాక్రమముఁ
గాంచిన పుత్త్రుఁడ వీవు నుండుటల్,
గొనకొని తీర్తుగాని పగ
కోపము నొందకుమయ్య! పుత్త్రుపై. ౪౨

సంజ:—అట్లే. (నిష్క్రమించును.)

దుర్యో:—సూతుఁడా! సాంగ్రామికరథమును నాకు సిద్ధ మొనర్పుము.

సూతు:—చిత్తము. దేవా! (నిష్క్రమించును.)

ధృత:—గాంధారీ! మనము మద్రపతి శల్యుని శిబిరమున కేఁగుదము. వత్సా! నీ వల్లొనర్పుము. (అందఱు నిష్క్రమింతురు.)

ఇది పంచమాంకము.

వేణీసంహారము

షష్ఠాంకము

(ఆసనమునఁ గూర్చుండి యుధిష్ఠిరుఁడును—ద్రౌపది, చేటి, బుధకుఁడును ప్రవేశింతురు.)

యుధి:—(చింతించుచు నిట్టూర్పు విడిచి)

ఉ. ఈఁదితి భీష్మసాగరము
నెట్టులో; యార్పితి ద్రోణవహ్ని; నా
మీఁదను గర్ణనామక మ
మేయవిషాహిని గొట్టి; శల్యునిన్
జేఁదితిఁ బ్రాణముల్; లఘు స
శేషజయంబును గాంచి యుంటి; నీ
మీఁదను భీమసాహసము
మిక్కిలి జీవితశంకఁ గొల్పెఁగా! ౧

ద్రౌప:—(కన్నీటితో) మహారాజా! జీవితశంకఁ గొల్పినది పాంచాలి బ్రతుకు కాని భీమసాహసము కాదు.

యుధి:—రెండును గావు. నేనే జీవితశంకఁ గొల్పితిని. (బుధకునితో) బుధకా!

బుధ:—దేవా! ఏమి యాజ్ఞ?

యుధి:—బుధకా! సహదేవునితో నిట్లు చెప్పుము: "క్రుద్ధుఁడై వృకోదరుఁడు సాయంతనములోఁగాఁ దాను సుయోధనునిఁ

జంపలేకపోయినచోఁ దానే చత్తు నని చేసిన దారుణప్రతిజ్ఞను విని మానధనుఁ డయ్యుఁ గౌరవరాజు మాయమయ్యెను. అందుచే, దుర్యోధను నన్వేషించుటకు నిపుణులు, యథార్థాభిజ్ఞులు, భక్తిమంతులు నగు సచివులు పటుపటహరవవ్యక్తఘోషమున దుర్యోధను జాడఁ దెలిపినవారికి బహుధనాదిబహూకృతు లిత్తు మని చాటుచు శమంతపంచకమునఁ దిరుగవలయును. మఱియు,

ఉ. పంకములందు సైకతపుఁ
బట్టుల జాలరులన్ గనన్ వలెన్;
బొంకపుడొంకలన్ వెదకఁ
బోవవలెన్ బెదగొల్ల లెల్ల; శే
వంకను వ్యాఘ్రచారివన
పంక్తుల వ్యాధులు చూడఁగా వలెన్;
గొంకక రంధ్రవిజ్ఞు లతి
గూఢతఁ బోవలె నాశ్రమంబులన్. ౨

బుధ:—చిత్తము. దేవా!

యుధి:—ఉండు. సహదేవున కిదియుఁ దెల్పుము.

చ. అలుకుచు నెవ్వరెవ్వ రెటు
లాడినఁగాని రహస్యవృత్తముల్
చులకనఁ జూడరాదు; మఱి
సుప్తుల రోగుల నార్తులన్ వన
స్థలముల నేమఱం జనదు;
జంతులత్రాసము పక్షికూఁతలున్
గలిగినచోట్ల శ్రద్ధఁ గనఁ
గావలయున్ నృపపాద చిహ్నముల్. 3

బుధ:—చిత్తము. దేవా! (నిష్క్రమించి మరలఁ బ్రవేశించి) దేవా!
పాంచాలకుఁడేతెంచియున్నాఁడు.

యుధి:—త్వరగా రానిమ్ము.

బుధ:—(నిష్క్రమించి, పాంచాలకునితో మరలఁ బ్రవేశించి) ఇదిగో!
దేవా! పాంచాలకుఁడు సమీపించుచున్నాఁడు.

పాంచా:—దేవా! జయము. జయము. దేవికిని దేవరకును
ప్రియవార్తఁ దెలుప వచ్చితిని.

యుధి:—పాంచాలకా! దురాత్ముఁడగు కౌరవాధముని జాడ
తెలిసినదా ?

పాంచా:—జాడ తెలియుటే కాదు. దేవీకేశపాశ స్పర్శపాతక
ప్రధాన హేతుభూతుఁడే దొరకినాఁడు.

యుధి:—(ఆనందముతోఁ గౌఁగిలించుకొని) మంచిది. భద్రా!
మంచిమాట చెప్పితివి. ఏమి కంటి కగపడినాఁడా ?

పాంచా:—దేవా! సమరగోచరుఁడు కాలేదా యని యడు
గుము.

ద్రౌప:—(భయముతో) నానాధుఁడు వానితో సమరమున
నున్నాఁడా !

యుధి:—(ఆశంకతో) వత్స వానితో సమరమున నున్నాఁడా ?

పాంచా:—నిజము. మహారాజా! నే నసత్య మాడుదునా ?

యుధి:—

మ. గద చేతం గొనుభీమువిక్రమము లో
కంబందు నేఁ గాంచియుఁ
మదిలో సంశయ మందుచుంటి నకటా !
మా కానో కాదో జయం

బది యంచుర్; దలపోయఁ గారణ మనూ
హ్యాం బా; 'నతిస్నేహ మా
స్పద మాఁ బాపకుశంక' కన్న నుడియే
సత్యంబు నా పట్టునన్. ౮

(ద్రౌపదిని జూచి యామె కన్నీరు తుడిచి) ఓసీ! సుక్షత్త్రియు
రాలా!

మ. కురువృద్ధుల్ కురువృద్ధబాంధవు లనే
కుల్ రాజులుం జూడ నీ
వర కేశగ్రహణాది యా పరిభవ
ప్రజ్యోతి చల్లారు నం
దఱముం జచ్చిననొండె లేనియెడలన్
బాపాత్మకుం డైన యీ
కురురాట్ క్రూరమృగంబు నేఁడె యనిలోఁ
గోల్పోయినన్ బ్రాణముల్. ౫

ఐనను, సందేహ మవసరము లేదు.

గీ. ప్రతిన చెడు నన్న భీతిచేఁ ద్వరితుఁడైన
భీమసేనునిచేఁ జచ్చు వినుము నేఁడె
పావనం బగునీ కేశపాశవితతి
హస్తమునఁ బట్టి యీడ్పించినట్టితులువ. ౬

పాంచాలకా! చెప్పు. చెప్పు. ఆదురాత్ముఁ డెటు లెక్కడ
దొరకెను? ఇప్పు డేమి జరుగుచున్నది?

ద్రౌప:—భద్రా! చెప్పు. చెప్పు.

పాంచా:—దేవా! దేవీ! వినుఁడు. నీచే మద్రపతి శల్యుఁ
డీల్గుటయు, గాంధార రాజశలభకులము సహదేవశస్త్రిసల

మునఁ బ్రవేశించుటయు, సేనాపతిమరణమున భీతులై మిగిలినయోధులు రణభూమిని విడిచి పాఱుటయు, మనసేనలు శత్రుపరాజయమును గాంచి యుప్పొంగుచు ధృష్టద్యుమ్నాధిష్ఠితము లయి యుండుటయు, కృపకృతవర్మాశ్వత్థామలు ప్రణష్టు లగుటయుఁ గని వృకోదరప్రతిజ్ఞాభీతుఁడయి దురాత్ముఁడగు కౌరవాధముఁ డెటనో దాఁగుకొనెను.

యుధి:—తరువాతఁ దరువాత ?

ద్రౌప:—తరువాత ?

పాంచా:—తరువాత భగవంతుఁడగు వాసుదేవునిచే నధిష్ఠింపఁబడిన రథ మెక్కి భీమార్జునకుమారులు శమంతపంచకము నంతను వెదకిరి. కాని, జాడ తెలియదాయెను. అపు డస్మాదృశు లగుభృత్యవర్గము దైవమును దలఁచి దుఃఖించిరి. అర్జునకుమారుఁడు దీర్ఘనిశ్వాసమును విడిచెను. వృకోదరుఁడు జలధరసమయనిశాసంచారిత తటిత్ప్రకార పింగళదృష్టులను గదాదండముపైఁ బ్రసరింపఁజేసెను; కృష్ణభగవానుఁడు విధికృతుల నిందించెను; అపు డొకపురుషుఁడు చేత మాంసము నిడుకొని క్రొత్తఁ జంపిన మృగలోహితచరణములతోడను, గట్టుఁబుట్టముతోడను, బరుగున భీమసేనునికడ కేతెంచి గట్టి నిట్టూర్పులసందడిని విని వినిపింపనిమాటలలో నిట్లనెను : "దేవా ! భీమసేనకుమారా ! ఇటకు సమీపమునఁ గల యొకహ్రదమునందలి మడుఁగులో దిగినరెండడుగులజాడలు కానవచ్చినవి. ఒకటి లోనుండి వచ్చినది. రెండవది యట్లు కానిది. తరువాత మీచిత్తము." అంత మే మెల్లరము సంభ్రమచిత్తులమై యాతనివెనుక నట కేఁగి సుయోధనునిపదచిహ్నాలుగా వాని నెఱింగితిమి. అపుడు వాసుదేవుఁ డిట్ల

నెను. "ఓ వీరవృకోదరా ! సుయోధనునకు జలస్తంభవిద్య తెలియునుగాదా! ఆతఁడు నీకు భయపడి యీహ్రదములో దాఁగుకొనియుండును." బలరామానుజుని యీమాట విని భీమసేనుఁడు దిగ్గజము లదలిపోవునట్లు, సలిలచారిసకలజంతువులు బెదరిపోవునట్లు, మడుఁగంతయుఁ గలఁగఁబాఱునట్లు భైరవ మగుసింహనాదముఁ జేసి "యోరోరివృథాప్రఖ్యాపితాలీకపౌరుషాభిమానీ! పాంచాలీకేశాంబరాకర్షణ మహాపాపీ ! ధార్తరాష్ట్రాపశదా !

చ. మలినత లేని యిందుకుల
మందునఁ బుట్టితి; విప్పుడుఁ గదా
కలితకరుండ వీవు; ననుఁ
గాఱులు గూసితి దుస్ససేనుర
క్తలలితపాయినిన్, గరము
కట్టఁగఁ జూచితి కృష్ణదేవునిన్;
జలమునఁ బంకమందు దిగి
చత్తువె సిగ్గఱి రాజకీటమా ! ౭

మఱియు మానవంతుఁడ వగు నో కౌరవాధమా !

ఉ. భర్తలు చచ్చి కౌరవుల
పత్నులు కొప్పులు చేతఁబట్టి పె
ల్లార్తిని గాంతు లేదుటను
నాఁటను ద్రౌపదిక్రోధవహ్నితో
ద్భర్తకతాన; నీదుపెద
తమ్ముని రక్తము ద్రాగి ముందటన్
సర్తనచేయు నన్వడిచి
నాఁడవె? శౌర్యము వీడఁ బాడియే? ౮

ద్రౌప:—నాథా! నీపునర్దర్శనము నాకుఁ గలిగినచో నాకో పము తీరిన ట్లే.

యుధి:—కృష్ణా! ఈసమయమున నమంగళముఁ బలుకకుము. భద్రా! తరువాత నేమయ్యెను?

పాంచా:—దేవా! ఇట్లు పలుకుచు భీమసేనుఁడు లోనికి దిగి క్రోధోద్ధతభ్రమితభీషణ గదాపరిఘపాణియై గట్టు తెగిన దానినిగను, పొంగిననీళ్లు కలదిగను, జాప కట్టునష్టమొసళ్లు కలదిగను, భయపడ్డసమస్తజలజంతువులు గలదిగను నాహ్రదమును వేగముచే సుడిగుండములుతిరుగునట్లు కలఁచివేసెను.

యుధి:—భద్రా! అప్పుడు నాతఁడు బయలుపడలేదా?

పాంచా:—దేవా! వెలువడ కేమగును?

గీ. భీమభుజమందరంబున వెల్లి చిలుక
పాలసంద్రంబునం బుట్టు కాలకూట
విషముగతిఁ గోపఘూర్ణితవేషి యగుచు
వెలువడె సుయోధనుం డొక్కవలననుండి.

యుధి:—మంచిపని చేసితివి. సుక్షత్త్రియా! మంచిపని చేసితివి.

ద్రౌప:—సమరప్రతిపన్నుఁడైనాఁడా? లేదా?

పాంచా:—అట్లు పైకి వచ్చి కరద్వయమున గదాద్వయమును ద్రిప్పుకొనుచు నాతఁ డిట్లనియె. "ఓరోరీ గాలికొడుకా! భీతిచే నేను డాఁగితి ననుకొనుచున్నావా? పాండవుల నెల్లర భండనమునఁ జంపకుండఁ బరులకంటఁ బడ నిచ్చగింపక బడలిక దీర్చుకొనుటకై పాతాళమున విశ్రమించితినిరా." ఇంతలో వాసుదేవకిరీటులు నీటిలో యుద్ధము పనికిరాదని యిరువురను బైకిఁ దీసికొనివచ్చిరి. కౌరవపతి భూమిపైఁ

గూర్చుండి గదను క్రిందఁబెట్టి విఱిగిపోయిన వేయియరద
ములు, చచ్చిపోయినకౌరవకులసహస్రము, ముక్కముక్క
లై పడియున్న గజవాజిసహస్రకళేబరములపై నున్నగృధ్ర
కంకజంబుకములచే భీతావహము, నుత్సన్నసుయోధన
బలము, మసవీరులసింహనాద సంవలిత సమరతూర్యము,
అమిత్రబాంధవము సకౌరవము, సమిత్రబాంధవము సపాండ
వము నగు పోలికలనుఁ జూచి యాతఁడు వేఁడినిట్టూర్పులు
నిగుడ్చుచుండెను. అప్పుడు వృకోదరుఁడు "ఓయీ! కౌరవ
రాజా! బంధుజనచింత విడువుము. పాండవులు సమరసమ
ర్థులు. నీ వసమర్థుఁడవు నని విచారింపకుము.

గీ. పంచపాండవులందు నీ వెంచుకొనుము
యోధు నొక్కని సమరసుయోధనమున;
వలయు శస్త్రాదికమ్ముఁ గవచముఁ బూని
సల్పుసమరోత్సవమ్ము స్వచ్ఛందగతిని." ౧౦

అనెను. ఈమాటలు విని కొంచె మసూయ గలచూపులతో
భీమార్జునులం జూచి దుర్యోధనుఁ డిట్లనెను.

గీ. కర్ణదుశ్శాసనులఁ జంపుకారణమున
నుభయులును మీరు నాకుఁ దుల్యులు తలంప;
నప్రియుఁడ వైనఁ బ్రియయోధుఁ డౌదు వీవు
చాలఁ గోరుదు నిన్ బ్రియసాహసాంక! ౧౧

అని లేవ వా రొండొరులు పరుషవాక్య ఘోరసంగ్రాము
లైరి. అంత వారిరువురు చిత్రగదాపరిఘభాసురభుజపంజరులై
మండలప్రచారముల విహరింపఁదొడఁగిరి. అపుడు భగ
వంతుఁ డగుచక్రపాణి సన్నిటకుఁ బుత్తెంచుచు మీతో
నిట్లు పలుకు మనెను. "భీమసేనుఁ డింకను దీఱనిప్రతిజ్ఞ కల

వాఁడును దుర్యోధనుఁ డంతర్హితుఁడును నగుట మాకు విషాదహేతువై నది. కాని, యిప్పుడు దుర్యోధనుఁడు భీమసేనుని చేఁ జిక్కినాఁడు. ఇఁక, నిష్కంటకముగా నీభూమిని బాలింపుము. అభ్యుదయమునకుఁ దగినమంగళక్రియ లెల్ల ప్రారంభింపుము. సందేహ మేమియు వలదు.

మ. రతసంఘంగలశంబులన్ జలముఁ స్వ
ద్రాజ్యాభిషేకార్థమున్,
సతివేణీవరణోత్సవంబునకునై
సర్వక్రియల్, కూర్పు ము
న్నతరాజద్రుమఖండనప్రవణతీ
క్ష్ణప్రాక్కుఠారుండు, వా
యుతనూజుండును గ్రుద్ధు లైన విజయం
బొందంగ సందేహమే? ౧౨

ద్రౌప:—(కన్నీటితో) త్రిభువననాథుఁడే యిట్లాజ్ఞాపించుచుండ నిఁక వేఱొకవిధముగ సంభవించునా ?

పాంచా:—ఇది కేవల మాతనియాశీస్సే కాదు. ఆదేశమే.

యుధి:—భగవత్సందేశమునకు వికల్ప మెట్లును గలుగదు. ఎవఁడురా ? అక్కడ?

కంచుకి:—(ప్రవేశించి) దేవా ! ఆజ్ఞాపింపుము.

యుధి:—దేవదేవుఁ డగు దేవకీనందనుని దివ్యప్రసాదమున భీమసేనకుమారుని విజయమంగళాకాంక్షకై సర్వోచితసంభారములు నడపవలయును.

కంచు:—చిత్తము. (ఉత్సాహముగా నడచి) ఉచితజ్ఞులతోఁ గూడియున్న యో యంతఃపురప్రధానద్వారపాలకులారా ! కార

పావమానసాగరమును భుజబల మనునావచే దాఁటినవాఁడును, నిజప్రతిజ్ఞాపారమును జక్కఁగాఁ గాంచినవాఁడును, సుయోధనానుజశత మనుతృణకణములకు మహావాయువును, వాయుపుత్త్రుఁడును, దుశ్శాసనునివక్షస్స్థలమునుజీల్చివైచిన నరసింహుఁడును, దుర్యోధనుని యూరుస్తంభములను విఱుగఁగొట్టఁ గలవిజయబలశాలి యైనభీమసేనునిపై నిండువాత్సల్యము గలయుధిష్ఠిరుఁడు మంగళకృత్యములు నిర్వర్తింప నాజ్ఞాపించుచున్నాఁడు. (ఆకాశముపైకిఁ జూచి) ఏ మను చున్నారు ? అన్నియు నధికతరముగా నిర్వర్తించితిమి. నీవు చూచుట లేదా యనియా ! మంచిది. ఉత్తములారా ! మంచిది. చెప్పకుండనే మేలుచేయుట మనోగతస్వామిభక్తిని మిక్కుటముగా వెల్లడించునుగదా !

యుధి:—ఆర్యా ! జయంధరా !

కంచు:—దేవా ! ఏమియాజ్ఞ ?

యుధి:—నీ వరిగి యీశుభవార్తఁ దెచ్చినపాంచాలకునికి బహుమతి నొసంగి సంతోషపెట్టుము.

కంచు:—చిత్తము. (పాంచాలకునితో నిష్క్రమించును)

ద్రౌప:—మహారాజా ! భీమసేనుఁడు దుర్యోధనునితో మా యైదుగురిలో నొకరిని గోరుకొను మని యేల యనెను ? ఒకవేళ నాతఁడు నకులసహదేవులలో నొకనిఁ గోరుకొని సమరము చేయుదు నని యన్న మన కుపద్రవము కలుగునుగదా !

యుధి:—కృష్ణా ! దానికిఁ గారణ మిది : బంధువు లెల్లరును, సోదరు లందఱును జచ్చి యేకాదశాక్షౌహిణీసేనలో నిఁకఁ

కృపకృతవర్మాశ్వత్థామలే మిగిలియుండుటచే దుర్యోధనుఁడు బంధురహితుఁడు దేహముమాత్రమే మిగిలినవాఁడునై యున్నాఁడు ఆతఁ డభిమానమును విడిచి యాయుధత్యాగము చేసినఁగాని తపోవనమున కేఁగినఁగాని, తండ్రిమొదట సంధిచేసినఁగాని, సకలరిపులను జయింతు నన్న భీమునిప్రతిజ్ఞ యింతవఱకు వచ్చి వ్యర్థమగు నని తలఁచి, దుర్యోధనునకు సమరోత్సాహముఁ గల్పింప నట్లు పలికెను. మఱియు దుర్యోధనుఁడు పాండవులలో నెవ్వనిని జయింపలేఁడు. ఏమైనను, వృకోదరునితోడనే గదాయుద్ధ మాతఁడు కోరు నని నే ననుకొనుచున్నాను. ఏలన :

ఉ. కోపమునన్ రణంబునను
  ఘూర్ణగదాధరుఁడైనభీముపెం
 పోపఁగఁజాల రెవ్వరు; సు
  యోధనుఁడుఁ బలరాము సాటి; యీ
 పాపపుధార్తరాష్ట్రు లను
  పద్మినికిన్ గజమైనభీముఁడే
 యోపు జయింపఁ; గోరును సు
  యోధనుఁ డాతనిఁ; గోరఁ డన్యులన్. ౧౩

(తెరలో)

దాహము! దాహము. అయ్యో! దాహము. దాహము. కొంచెమునీరు నీడ యిచ్చి నన్నుఁ గాపాడుఁడు.

యుధి:—(విని) ఓరీ! ఎవఁ డక్కడ ?

కంచు:—(ప్రవేశించి) దేవా! ఏమియాజ్ఞ?

యుధి:—అదేమియో తెలిసికొనిరా.

కంచు:—చిత్తము. (నిష్క్రమించి మరలఁ బ్రవేశించి) దేవా! దప్పికగొన్న యొకయతిగ.

యుధి:—వెంటనే ప్రవేశపెట్టుము.

కంచు:—చిత్తము (నిష్క్రమించును.)

(చార్వాకుఁ డనురాక్షసుఁడు మునివేషధారియై ప్రవేశించును)

చార్వా:—(తనలో) నేను సుయోధనునిపరమమిత్రుఁడనైనసందుల కైతవముగఁ బాండవులను వంచింపవలయును. (ప్రకాశముగా) దాహము. దాహము. కొంచెమునీరు నీడ యిచ్చి నన్నుఁ గాపాడుఁడు. (యుధిష్ఠిరుని సమీపించును. అందఱు లేచి నిలుచుందురు.)

యుధి:—మునీ! అభివాదములు.

చార్వా:—ఇది యభివాదసమయము కాదు. నీరిచ్చి నన్ను గౌరవింపుము.

యుధి:—మునీ! ఆసన మిదిగో! స్వీకరింపుము.

చార్వా:—(కూర్చుండి) మీరును గూర్చుండుఁడు.

యుధి:—ఓరీ! ఎవ రక్కడ?

కంచు:—(ప్రవేశించి) దేవా ఏమియాజ్ఞ?

యుధి:—జయంధరా! నీళ్లు గొనితెమ్ము. మునికి దాహము వేయుచున్నది.

కంచు:—చిత్తము. (నిష్క్రమించి మరలఁ బ్రవేశించి సమీపించి) మహారాజా! చల్లనిచక్కనిమంచినీళ్లతో నిండినపంచపాత్ర మిదిగో! ఇది చిన్నచెంబు.

యుధి:—మునీ! దాహము పుచ్చుకొనుము.

చార్వా:—(కాళ్ళు కడుగుకొని యాచమించి) నీవు క్షత్రియుని వలె నున్నావు:

యుధి:—ఔను. నేను క్షత్రియుఁడనే.

చార్వా:—ఆత్మజననాశనమున కాలవాలమైనయుద్ధము నిత్యము చేయుచుండుమీచేతినీళ్లు ముట్టుకొనఁగూడదు. కానిమ్ము. ఈనీడను జల్లనిసరస్వతీనదీవాయువులవీవనచేతను నేను శ్రమము వాసికొందును.

ద్రౌప:—బుద్ధిమతికా! మహర్షికి విసనకఱ్ఱతో విసరవే.

(చేటి యట్లు చేయును.)

చార్వా:—మంచిది. మా కిట్టిమీయుపచారము లుచితములే.

యుధి:—మునీ! నీ కింతపరిశ్రమ కలుగుటకుఁ గారణమేమి ?

చార్వా:—మునిజనసులభ మగుకుతూహలముతో మహాక్షత్రియు లిరువురకు జరగుద్వంద్వయుద్ధముఁ జూడ శమంతపంచకముఁ దిరిగితిరిగి యట నర్జునసుయోధనుల కగు ముష్టియుద్ధముఁ జూచి యీశారదాతపము బలవత్తర మగుటచే నాయుద్ధము ముగియకుండఁగనే యిటకు వచ్చితి.

అందఱు:—(విషాద మందుదురు.)

కంచు:—మునీ! అట్లు కాదు. భీమసుయోధనుల కని చెప్పుము.

చార్వా:—నీకుఁ దెలియనివిషయమున న న్నేల యాక్షేపింతువు?

యుధి:—మహర్షీ! చెప్పుము. చెప్పుము.

చార్వా—ఒక్కనిముసము విశ్రమించి నీ కంతయుఁ జెప్పెదను. కాని, యీముసలికంచుకికిఁ జెప్పను.

యుధి—చెప్పుము. చెప్పుము. సుయోధనార్జునులకే ?

చార్వా:—ఔ నని మొదటనే చెప్పితిని.

యుధి:—(కన్నీళ్లతో) భీమసుయోధనులకుఁ గాదా?

చార్వా:—అది జరిగిపోయినవిషయము.

యుధి. ద్రౌప:—(మూర్ఛిల్లుదురు.)

కంచు:—(చన్నీరు చల్లి) దేవా! ఊఱడిల్లుము. దేవీ! ఊఱడిల్లుము.

చేటి :—దేవీ! ఊఱడిల్లుము.

యుధి. ద్రౌప:—(తేఱుకొందురు.)

యుధి :—ఏమన్నావు? మునీ! భీమసుయోధనులగదాయుద్ధమిదివఱకే జరిగిపోయినదా?

ద్రౌప:—భగవంతుఁడా! ఏమి? అది జరిగిపోయినవిషయమా?

చార్వా:—కంచుకీ! మీ రిరువు రెవరు?

కంచు:—ఓయీ బ్రాహ్మణా! ఈయన యుధిష్ఠిరమహారాజు. ఈమె పాంచాలరాజతనయ.

చార్వా:—ఏమి! నృశంసుఁడ నగునేను దారుణవిషయమే చెప్పితినే!

ద్రౌప:—హా! నాథా! భీమసేనా! (మూర్ఛిల్లును)

కంచు:—ఇపు డీతఁడు చెప్పినసంగతి యేమి?

చేటి:—దేవీ! ఊఱడిల్లు మూఱడిల్లుము.

యుధి:—(కన్నీటితో) బ్రాహ్మణా!

క. పదనందిగ్ధతచే నే
నెద దుఃఖము నందుచుంటి నిఁక భీమునిప
త్యదశం జెప్పినయంతట
వదలెదఁ బ్రాణంబు సౌఖ్యపదవిం గనఁగన్. ౧౮

చార్వా:—(సంతోషముతోఁ దనలో) నాయత్న మిదియే.

(ప్రకాశముగా) అయినను దప్పక చెప్పవలసినది సంగ్రహ
ముగాఁ దెల్పెదను. ఏలన, బాంధవదుఃఖవార్తను విస్త
రించి చెప్పరాదుగదా!

యుధి:—(కన్నీరొలుక)

క. త్వరత్వరగాఁ జెప్పుము వి
స్తరముగనో సంగ్రహప్రధానముగానో
తరువాత వత్ససంగతి
త్వరగా విన నెదురుచూచెదఁ ఋషివర్యా! ౧౫

చార్వా:—వినుము:

చ. కురుపతిభీమసేను లటు
ఘోరగదాధ్వనిఁ బోరుచుండఁగా

ద్రౌప:—(లేచి) తరువాతఁ దరువాత?

చార్వా:—(తనలో) వీరి కింకఁ దెలివిరాకుండఁ జేయు టెట్లు?
(ప్రకాశముగా)

సరగున నేఁగుదెంచె హలి;
సన్నిధిఁ బోరిరి వారు; శిష్యత
త్పరవిజయుండు సీరి యొక
దారుణసంజ్ఞ యొనర్పఁ గాంచి య
క్కురుపతి యొక్కపెట్టునను
గూలఁగ నేసెను భీమసేనునిన్. ౧౬

యుధి:—హా! వత్సా! వృకోదరా! (మూర్ఛిల్లును)

ద్రౌప:—హా! నాథ! భీమసేనా! హా! మత్పరిభవప్రతీకారపరి
త్యక్తజీవితా! జటాసురబకహిడింబకిమ్మీరకీచకజరాసంధ

నిషూదనా! సౌగంధికాహరణచాటుకారా! ప్రతివచన మిమ్ము. (మూర్ఛిల్లును)

కంచు:—(కన్నీటితో) హా! భీమసేనకుమారా! ధార్తరాష్ట్రి కులకమలినీప్రాలేయవర్షా! (సంభ్రమముతో) మహారాజా! ఊఱడిల్లుము. బుద్ధిమతికా! దేవి నూఱడింపుము. మహర్షీ! నీవును మహారాజు నూఱడింపుము.

చార్వా:—(తనలో) ఆఁ. ప్రాణము విడువు మని యూఱడించెదను. (పైకి) ఓయీ! భీమాగ్రజా! ఒక్క క్షణ ముండుము. ఇంకిను జెప్పెదను.

యుధి:—(తెలివందు) మహర్షీ! ఇంకను గథాశేష మున్నదా ?

ద్రౌప:—(తెలివంది) ఆర్యా! ఆకథాంశేష మేమి? చెప్పుము.

కంచు:—చెప్పు. చెప్పు.

చార్వా:—అట్లాభీమసుకృత్రియుఁడు హతుఁ డయి వీర సులభ మగుసద్గతి నందిన, భ్రాతృవధశోకమున నర్జునుఁడు గాండీవమును విడిచి రక్తసిక్తమై యున్నభీమసేనునిగదను బలవంతముగా నాతనిబిగిచేతులనుండి లాగుకొని శ్రీకృష్ణుఁడు వల దని నివారించినను వినక భ్రమితగదాఝుంకారస మ్మూర్ఛితగంభీరవచనధ్వనితోఁ జిఱునవ్వునఁ గురుపతి ర మ్మని పిలుచుచుండ నర్జునుఁడు జంకక యాతనితో యుద్ధమునకు దిగెను. అపుడు సుయోధనునిగదాఘాతమున నర్జునుఁ డస్తమించుట నిశ్చయ మని యెంచి బలరాముఁ డర్జునపక్షపాతి యగుకృష్ణుని బలవంతముగాఁ దనరథ మెక్కించుకొని ద్వారకానగరమునకుఁ గొంపోయెను.

యుధి:—బాగు. బాగు, అర్జునా! గాండీవమును విడుచుటచే నీవు త్వరలోనే యనుజు ననుగమింపఁగలవు. ఇఁక, నే నే యుపాయముసఁ బ్రాణత్యాగమహోత్సవము చేసికొనఁ గలనో?

ద్రౌప:—హా! నాథా! భ్రాతృవత్సలా! భీమసేనా! నీతమ్ముఁడు నశిక్షితుఁడు నగునర్జునుఁడు బలవంతముగా నీచేతిలోనిగదను లాగుకొని దారుణశత్రువున కెదురుపోవుచుండ నీ వుపేక్షింప వచ్చునా? (మూర్ఛిల్లును)

చార్వా:—తరువాత నేను.........

యుధి:—చాలు. మునీ! చాలు. ఇఁకపై విను నదేమి? హా! భీమసేనా! లాక్షాగృహసముద్రతరణయానపాత్రమా! హా! కిమ్మీరహిండింబాసురజరాసంధ జయమల్లా! హా! కీచక సుయోధనానుజ కమలినీకుంజరా! హా! ద్యూతపణమా! మచ్ఛరీరస్థితిపరిఖేదశంకాసూచనా! హా! మదాజ్ఞాసంపాదకా! హా! కాంతారవ్యసనబాంధవా! హా! కౌరవవనదావానలా!

ఉ. ద్యూతమమత్వదుర్వ్యసన
దూషితబుద్ధిని నేను నోడ న
త్యాతతదంతిసన్నిభమ
హాబలవంతుఁడ వయ్యు భక్తిసం
ప్రీతి విధేయుఁ డైతివి వి
వేకిత నీకిటు కీడుమూడెనే?

భ్రాత! మముఁ దిగవిడిచి
స్వర్గముఁ గాంచితె యమార్తిగొల్పుచుఁ. ౧౭

ద్రౌప:—(తెలివంది) మహారాజా! ఏ మయినది?

యుధి:—దేవీ! ఇఁక నేమున్నది?

మ. బకకిమ్మీర హిడింబరాక్షస మహా
ప్రఖ్యాత విధ్వంసి, కీ
చకసంహర్త, మదోద్ధతాత్మక జరా
సంధప్రభావాఢ్య ఘో
రకగింద్రాశని, సద్గదాపరిఘ వీ
ర్య స్ఫారబాహుండు, తా
పకప్రాణేశుఁడు, నర్జునాగ్రజుఁడు, మ
ద్భ్రాతృవ్యుఁ డేడీ యికన్? ౧౮

ద్రౌప:—నాథా! భీమసేనా! నా వేణి నీవే ముడిచెద నంటి విగదా! క్షత్రియపురుషులకుఁ బ్రతినతప్పుట న్యాయమా? నీశపథము చెల్లించుకొమ్ము. నే నిదే వచ్చుచున్నాను. (మూర్ఛిల్లును)

యుధి:—(ఆకాశముఁ జూచి) అమ్మా పృథా! నీ పుత్త్రుని వార్త వింటివిగదా! అనాథుఁడ నగున న్నొక్కనినే విడిచి పోయినాఁడుకదా? వత్సా! జరాసంధశత్రూ! నీ వింత యద్ధాయుష్కుఁడ వగుటకు లోకులు నీయం దేమి లోపములు గనిపెట్టిరి? కాదు. నేనే యనేకములు కనిపెట్టితిని. నీవు:

మ. సకలోర్వీతలమున్ జయించియును నా
సాన్నిధ్యమందుంచి యూ
రక సిగ్గొందుట, జూదమందుఁ బణమై
క్రౌర్యంబు లే కొప్పుటల్,
వికలుం డావలలుం డనన్ విరటు పృ
థ్వీపాలు సేవించుటల్
సుకముం గాంచఁగ నేను; నా కవియె తె
ల్పుం జిహ్వలై నీ దశన్. ౧౯

మునీ! ఏమంటివి? ("కురుపతి భీమసేను లఁగు" అను పద్యము పూర్తిగాఁ జదువును.)

చార్వా:—ఔ నది నిజమే.

యుధి:—ఏమి నా దురదృష్టము! బలరామా! కృష్ణాగ్రజా!

శా. జ్ఞాతిప్రీతి మనంబునందు లవమై
నన్ గాంచవా? క్షత్త్రియో
పేతన్యాయమె యిద్ది? కృష్ణభగవ
త్ప్రీతంబు నైనట్టి మ
ద్భ్రాతృస్నేహము నెంచవై తిరువురున్
బ్రఖ్యాతశిష్యుల్; మత్తే
రీతిన్ మాపయిఁ గ్రోధ మూతనివయిన్
బ్రేమంబునుం జూపితో? ౨౦

(ద్రౌపదిని సమీపించి) ఓ పాంచాలీ! లెమ్ము. లెమ్ము. మన మిరువురము సమానదుఃఖము గలవారమే. మాటిమాటికి మూర్ఛిల్లి నన్ను బాధించెద వేల?

ద్రౌప:—(లేచి) దుశ్శాసనహతకుఁడు విప్పివేసిన నా కేశపాశమును, దుర్యోధనునిఁ జంపుటచే నాతని రక్తముతోఁ దడిసిన చేతులతో నా నాథుఁడు ముడివేయవలయును. ఓసీ! బుద్ధిమతికా! నీ ముందే కదా నాథుఁడు శపథము చేసెను? ఇప్పుడే కదా దేవకీనందనుఁడు నాకు వేణీమహోత్సవము జరుపుట కెల్ల సంభారములు సిద్ధము చేయుఁడని సందేశమంపెను! కావున, వికసించిన పువ్వులఁ దెచ్చి దండ గ్రుచ్చి నా వేణికిఁ జుట్టవే. శ్రీకృష్ణుని మాట విను. ఆయన యాదేశము వ్యర్థపుచ్చుట తగునా? అయ్యో! అతిసంతప్తచిత్తమున నే నేమియో పలవరించుచున్నాను. ఇంకను దూర మేఁగియుండని యార్యపుత్త్రుని నే ననుగమించెదను. మహారాజా! చితి నేర్పఱుపుము. నీవును క్షత్త్రియధర్మ మనుసరించి శత్రునిర్దళనమున కేఁగవలయు.

యుధి:—పాంచాలీ! యుక్తముగాఁ బలికితివి. కంచుకీ! ఈతపస్వినికై చితి సిద్ధపఱచి యామె యసహ్యవేదనఁ బాపుము. నాకు సజ్యమగుధనువు గొనితెమ్ము. పోనిమ్ము. విల్లెందుకు?

గీ. భీమసేనుని రక్తసిక్తాంగ మలగదఁ
 గైకొని కిరీటి విడిచెఁగా గాండివంబు;
 నటులె నేనును నర్జును ననుసరింతు
 నదియె శ్రేయము నాకు జయం బిఁకేల? ౨౧

చార్వా:—రాజా! నీ మనము రిపుజయవిముఖమైనచో నెక్కడనో ప్రాణత్యాగము చేసికొనుము. అంతదూరము పో నేల?

కంచు:—(రోషముతో) ఛీ! మునిజనులకుం దగనట్లు రాక్షసులకుం దగినట్లు పలుకుచున్నావు.

చార్వా:—(భయమునం దనలో) వీఁడు నన్నుఁ గనిపెట్టలేదు గదా కొంపముంచి. (ప్రకాశముగా) ఓయీ! కంచుకీ! ఇటు వినుము. అర్జున దుర్యోధనులకు గదాయుద్ధము జరుగుచున్నది కదా! వారిరువుర గదాభుజసారము నెఱుంగుదును. ఇంతగా దుఃఖించుచున్న యీరాజర్షి మఱేమి దుర్వార్త వినవలసివచ్చునో యని యట్లంటిని.

యుధి:—(కన్నీరు విడిచి) మంచిది. మునీ! మంచిది. నాకు హితముం దెలిపితివి.

కంచు:—మహారాజా! ఏమిది? శోకాంధత్వమున దేవసదృశుఁడ వగు నీవే క్షాత్త్రధర్మమును విడిచి సామాన్యునివలె విచారింతువు?

యుధి:—ఆర్యా! జయంధరా!

మ. పరిఘప్రస్ఫుట పీనబాహుయుగ శుం
భద్దండ శౌర్యాత్ములై
యరు దారీతిఁ గుబేరపట్టణము శ
క్రావాసముం జేరి దు
ర్భరవీర్యంబును జూపినట్టి ఘనులన్
భంజించి దుర్యోధనుం
దుదభూమిన్ బడవైచి నిల్వఁ గనఁగా
నోపన్ తదీయాస్యమున్. \ —౨౨

ఓ పాంచాలరాజతనయా ! నా దుర్నయమున సంభవించిన దీదుర్గతి. ఎంత త్వరలో నగ్ని ప్రజ్వరిల్లిన నంతత్వరలో బంధుజనములఁ గలిసికొనఁగలము.

ద్రౌప:—ఆర్యా ! కట్టెలు చేర్పుఁడు. ఏమి ! మహారాజుమాట యెవరును వినరే! హా! నాథా నీవు లేనికారణమున మహారాజును ఒరిజనులు సైతమవమానించుచున్నారు గదా !

యుధి:—మహర్షీ ! నా మాట యెవరును వినుటలేదు. నీవైన నింధన ప్రసాదమునఁ బ్రసాదము చూపుము.

చార్వా:—ఇది మునిజన విరుద్ధము. (తనలో) నాకోరిక తీరినది. వీరికిఁ గానరాకుండ సమీపమున నింధనములఁ బ్రజ్వలింపఁ జేయుదును. (ప్రకాశముగా) రాజా! ఇట్టిస్థితిలో నే నిట నిలువఁ జాలను. (నిష్క్రమించును.)

యుధి:— దేవీ ! నేఁ జెప్పినపని నెవ్వరును జేయరైరి. పోనిమ్ము. నేను స్వయముగానే కట్టెలు ప్రోఁగుచేసి చితి యంటించుకొందును.

ద్రౌప:—త్వరగా. మహారాజా! త్వరగా.

(తెరలోఁ గలకలము.)

ద్రౌప:—(భయముతో విని) మహారాజా ! ఇది యెవరో బలగర్వితుని సింహనాదమువలె నున్నది. ఇంక నేయప్రియమునో వినఁగనే మన మాలసించుచున్నాము.

యుధి:—విలంబనము వలదు. లెమ్ము (నడతురు) పాంచాలీ ! అమ్మకుఁ గాని నీసపత్నులకుఁ గాని చెప్పవలసిన దేమన్న నన్నుఁ జెప్పి పరిజనులను బంపివేయుము.

ద్రౌప:—మహారాజా! మీయమ్మగారికి "బక హిడింబ కిమ్మీర కీచక జరాసంధజయమల్లుఁ డగునీమధ్యమపుత్త్రుఁడు నిర్భాగ్యురాల నగునామూలమునఁ బరలోకగతి నందె" నని విన్నవించెదను.

యుధి:—బుద్ధిమతికా! అమ్మగారికి నామాటగా నిట్లుచెప్పుము:

గీ. ఎవనిభుజశక్తిచే లక్క యింటినుండి
బయటఁ బడఁ గాంచిరో యగ్నిబారినుండి
నీవు సుతు; లట్టి నీయన్గునిసువు భీము
బలుఁడు లేఁ డని నే నెట్లు పలుకువాఁడ ? ౨౩

ఆర్యా! జయంధరా! నీవు సహదేవునికడ కేఁగుము. పాండుకుల బృహస్పతియు, ద్వైమాత్రేయుఁడు, నగునాతనితో "సకలకురుకుల కమలాకరబడబానలుఁ డగుయుధిష్ఠిరుఁడు పరలోకమున కేఁగుచు, ఇష్టుఁడవు, అనుకూలుఁడవు, నిత్యము కోరఁదగినవాఁడవు, దుర్వ్యసనములకు దూరుఁడవు, అభ్యుదయకష్టములపట్ల ధైర్యవంతుఁడవు నగునిన్నుఁ జాలఁ గౌఁగిలించుకొని శిరము మూర్కొని యిట్లు పలికె" నని చెప్పుము:

చ. వయసునఁ జిన్నవాఁడవును
బ్రాజ్ఞత మత్సదృశుండ వీవు; నే
వయసున నీకుఁ బెద్దను స్వ
భావవివేకిత మద్గురుండవే
ప్రియతమ ! నీవు; మ్రొక్కెడుచు
వేఁడుము వీడుము కూర్మి యింక నా

పయిని; పితౄణమోచనకుఁ
బ్రాంజలిఁ దర్పణ మిచ్చుచుండుమీ ! ౨౮

మఱియుఁ జిన్నతనమునుండి నాకడఁ బెరిఁగినవాఁడు, నిత్యము సదభిమాని, మేరుసమానధైర్యసారుఁడు నగునకులుఁడును నామాటఁ బాటించువాఁడు కావున నతనితో నిట్లంటి నని చెప్పుము: వత్సా ! నీవు మామార్గ మనుసరింపరాదు.

చ. మఱవుము భీము నర్జునుని;
మమ్ముఁ దలంపకు మింకఁ; బాండు భూ
వరుకులనాశనంబునఁ గృ
పన్ విడువన్ వలెఁ దర్పణంబులన్
బరమవిధేయతన్; రిపుల
పజ్జనొ యాదవులిండ్లయందొ భీ
కరవనియందొ ప్రాణములఁ
గాచుకొనం దగు నీవు తమ్ముఁడా ! ౨౯

జయంధరా ! పొమ్ము. నీవు తప్పక చెప్పవలయునుజుమా ! నేఁ జచ్చినంతయొట్టు. ఆలసింపక త్వరగాఁ బొమ్ము.

ద్రౌప:—ఓసీ ! బుద్ధిమతికా ! ప్రియసఖి సుభద్రకు నామాటగా నిట్లు చెప్పుము. "చెల్లీ ! వత్స యగునుత్తర కిపుడు నాలవమాసము. కాన, మనకులము నిలుపఁ గలయామె గర్భమును నీవు కడుఁ గాపాడవలయును. ఎప్పటికైన నా పట్టియే సురలోకగతుల మైనమాకు నీటిచుక్కలు విడువఁ గలుగును."

యుధి:—(కన్నీటితో) అయ్యో! కష్టముగదా!

చ. ధరణిని వేళ్లువాఱి బహు
ధా విటపంబుల విస్తరించి దు
ర్ధర మగుమ్రాను వెంచియును
దైవకృతంబునఁ జెట్టదగ్ధమై
పరగిన లేఁతయంకురము
పై నడియాస లిఁకేల ? యట్టియం
కుర మది పెర్గి పెద్దదయి
కూర్మిని నీడ నొసంగునం చహా ! ౨౬

ద్రౌపదీ! ఇఁకఁ జాలును. (కంచుకిని జూచి) ఆర్యా! జయంధరా! నాపై నొట్టుఁబెట్టుకొన్నను నీవడుగు కదల్పవైతివే!

కంచు:—(ఏడ్చుచు) హా! దేవా! పాండురాజా! అజాతశత్రు భీమార్జున నకులసహదేవు లగునీపుత్త్రుల కెట్టిగతి పట్టినది! హా! కుంతీదేవీ! భోజరాజభవనపతాకా!

శా. నీకుఁ సోదరపుత్త్రకుండు మఱియుఁ
కృష్ణాగ్రజుం డర్జునా
శా కల్యుం డగుస్యాలకుండు, కురువం
శధ్వంసి యాభీము సు
శ్లోకుం డౌగురుమూర్తి యైనహాలి యీ
లోకాశ్రయం బైనయ
స్తోకత్వత్సుతకాననంబుఁ గడుమ
త్తోన్మత్తతన్ గాల్చెఁగా ! ౨౭

(ఏడ్చుచు నిష్క్రమించును)

యుధి:—జయంధరా ! జయంధరా !

కంచు:—(ప్రవేశించి) దేవా ! ఏమి యాజ్ఞ ?

యుధి:—ఏమందును ? మాయదృష్టము లిట్లున్నవి ! ఒకవేళ నర్జునుఁడే జయించి వచ్చినచో నాతనితో నిట్లంటి ననుము:

చ. నిజముగ భీముచావునకు
నిక్కపుహేతువు నీరి వైన; న
గ్రజుఁ డతఁ డౌను కృష్ణునకుఁ
గావునఁ గోపముఁ జూప కింతయున్
స్వజనుఁ డతండు; నాపయినిఁ
బాయుము కూరిమి నెల్ల; నిమ్మటన్
విజనవనంబుఁ జేరు మిఁక
వీడుము క్షాత్రపుత్రా త్రధర్మమున్. ౨౮

కంచు:—చిత్తము దేవా ! (నిష్క్రమించును)

యుధి:—(అగ్నిని జూచి యానందముతో) ప్రజ్వలించు ధూమశిఖలనుచేతులతో నావంటి వ్యసనిజనులను బిలుచుచు హుతాశనభగవానుఁడు చక్కఁగాఁ బ్రకాశించుచున్నాఁడు. నే నిదే యాతని కింధనమ నౌదును.

ద్రౌప:—మహారాజా ! దయచూపుఁడు. నానాథునకు నేనన్న నెంతయో ప్రేమ. కావున, ముందు నేనే పోవుదును.

యుధి:—ఐనచో, నీమహాభ్యుదయ మిరువురము యనుభవింతము.

చేటి:—ఓహో! లోకపాలకులారా! చంద్రవంశరాజర్షి యైన యీమహాత్ముని మీరైన రక్షింపుఁడు. రక్షింపుఁడు.

ఈరాజు రాజసూయసంతర్పితహుతవహుఁడు, ఖాండవసంతర్పితహుతవహుఁ డగుకిరీటియన్న, సుగృహీతనామధేయుఁ డగుయుధిష్ఠిరమహారాజు. ఈదేవి పాంచాలరాజకులదేవత. వేదిమధ్యసంభవ. యాజ్ఞసేని. ఇట్టివీ రుభయులు నిర్దయుఁ డగుకాలానలున కింధనము లగుచున్నారు. రక్షింపుఁడు. రక్షింపుఁడు. (వారిముందుఁ బడి) దేవా! దేవీ! ఏమి చేయుదురు!

యుధి:—ఓసీ! బుద్ధిమతికా! వత్సలుఁ డగుతమ్ముఁడు ప్రియుఁ డగునాథుఁడు లేనపు డేమి చేయవలయునో యది చేసెదము. నీవు పోయి నీళ్లు తెమ్ము.

చేటి:—చిత్తము. దేవా? (నిష్క్రమించి మరలఁ బ్రవేశించి) జయము. జయము. మహారాజా! ఇదిగో నీరు.

యుధి:—పాంచాలీ! నీవుకూడ నీపక్షపాతి యగుభీమునకును, నీప్రియుఁ డగునర్జునునకు జలతర్పణ మిమ్ము.

ద్రౌప:—మహారాజా! నీ వట్లానతిమ్ము. నే నగ్నిఁ బ్రవేశించెదను.

యుధి:—దేవీ! లోకవృత్త మతిక్రమింపరాదు. బుద్ధిమతికా! నీ రిటు తెమ్ము.

చేటి:—(ఇచ్చును)

యుధి:—(కాళ్లు కడుగుకొని యాచమించి) గాంగేయా! భీష్మాచార్యా! ప్రపితామహా! శాంతనవా! నీ కిదే సలిలాంజలి. పితామహా' విచిత్రవీర్యా! నీ కిదే జలతర్పణము. (కన్నీటితో)

తండ్రీ! నీవంతు వచ్చినది. స్వర్గ మలంకరించినపితృదేవా! పాండుమహారాజా! సుగృహీతనామా! నీ కివే జలాంజలులు:

క. ఇఁకనుండి తర్పణంబుల
సుకృతాత్ములు మీ కొసంగఁ జొప్పడ దేనన్;
సుకముగఁ గ్రోలుము తాతా!
యకుటిల యగునంబుతోడ నశ్రుజలంబున్. ౨౯

క. జలజాక్షుభీమసేనా!
సలిలం బిది నీకు నాకు సమభుక్తము దూ
పిలి త్రాగఁబోకు మొంటిగ
నిలువుము నే వచ్చుచుంటి నిక్కము వత్సా! ౩౦

ఏమి! సుక్షత్రియునిగతి నందినతమ్ముని నేను వెళ్లి చూడఁగలనా? వత్సా! భీమసేనా!

మ. జననీస్తన్యముఁ గ్రోలువేళ మును వ
త్సా! నేను గ్రోలంగ నీ
వును నాపిమ్మటఁ గ్రోలువాఁడవుగ; మ
ద్భుక్తాన్నశేషంబె కై
కొనుచున్ భక్తిమెయిన్ మెలంగితివి; నేఁ
గొన్నంతనే సోమమున్
గొనినా; విప్పుడు న్యాయమే మును గొనన్
గుత్సా! నివాపాంబువుల్ ? ౩౧

దేవీ! భీమునకు నీవును జలాంజలి విడువుము.

ద్రౌప:—చేటీ! నీ రిటు తెమ్ము.

చేటి:—(తెచ్చి యిచ్చును)

ద్రౌప:—(కైకొని జలాంజలి నింపి) మహారాజా! ఎవరి కీజలాంజలి యొసఁగుదును?

యుధి:—క. జననిని గాంధారినివలె
ననుపమదుఃఖాంబుధారయందున ముంపన్
జనె దివమున కెవ్వఁడు నా
తనిఁగూర్చి యొసంగు దేవి! తర్పణ మిప్డే. 32

ద్రౌప:—నాథా! భీమసేనా! స్వర్గగతుఁడ వైననీకుఁ బరిజనోపనీత మగు నిది పాదోదక మగుఁగాక!

యుధి:—ఫల్గునాగ్రజా!

క. శపథము ముగియకమును స్వ
ర్గపదముఁ జేరంగఁ జనినఘనభుజ! నీ కి
ట్లుపగతకేశగ ద్రౌపది
యిపు డొసఁగునివాపజలము నెంతయు బెంగన్. 33

ద్రౌప:—మహారాజా! లెండు. లెండు. ఈసరి కాతఁడు చాల దూర మేఁగి యుండును.

యుధి:—(కుడిప్రక్క యదరుటఁ గని) పాంచాలీ! త్వరలోనే యీయగ్నిముఖమున భీమసేనుని గలిసికొందు నని కాఁబోలు నాకు శుభసూచకము లగుచున్నవి.

ద్రౌప:—హుతాశనభగవానుఁడు చక్కఁగాఁ బ్రజ్వలించుచున్నాఁడు.

[తెరలోఁ గలకలము. సంభ్రాంతుఁడై కంచుకి ప్రవేశించును.]

కంచు:— మహారాజా! రక్షింపుము. రక్షింపుము. ఇదిగో! దురాత్ముఁడగు కౌరవాధముఁడు క్షతజాభిషేకపాటలితాంబరశరీరిమై రక్తార్ద్రభీషణగదాపాణియై కాలదండముఁ జేఁబూనినయమునివలెఁ బుణ్యురాలగు పాంచాలి నిటనట వెదకుచు నిటే వచ్చుచున్నాఁడు.

యుధి:— అయ్యో! దైవమా! నీనిర్ణయము జరుగుచున్నది. హా! అర్జునా! (మూర్ఛిల్లును)

ద్రౌప:— అయ్యో! ఆర్యపుత్రా! మత్స్వయంవరస్వయంగ్రాహమర్గలితా! నీప్రియుఁడగు నగ్రజుని గలిసికొని మమ్మునువ్వరను విడిచితివిగదా! (మూర్ఛిల్లును)

కంచు:— దేవా! ఊఁటడిల్లుము.

యుధి:— హా! వత్సా! సవ్యసాచీ! హా! ముల్లోకవిజయమల్లా! హా! నివాతకవచోద్ధరణనిష్కంటకీకృతామరలోకా! హా! బదర్యాశ్రమమునిద్వితీయతాపసా! హా! ద్రోణాచార్యప్రియశిష్యా! హా! అస్త్రశిక్షాబలపరితోషితగాంగేయా! హా! రాధేయకులకమలినీప్రాలేయవర్షా! హా! గంధర్వనిర్వాసితసుయోధనా! హా! పాండవకులకమలినీరాజహంసా! అర్జునా!

మ. అనుఁగుందల్లికి మ్రొక్కకుండ వినయం
బాత్మన్ గుదుర్కొల్పి, న
న్నను బ్రేమంబునఁ గౌఁగిలించి మిగులన్
మూర్ధంబునందున్ ముదా
ఘ్రణను గైసేయక యీస్వయంవరవధూ
సమ్మాన్యఁ బృచ్ఛింప కే

మని దీర్ఘం బగునీప్రవాసమున నీ
వై యేఁగియున్నాఁడవో? ౩౮

(మూర్ఛిల్లును)

కంచు:—అయ్యో! కష్టము. సుయోధనదురాత్ముఁ డిటులే వచ్చుచున్నాఁడు.

యుధి:—(లేచి) ఓహో! ఇప్పుడు కాలోచితమైనప్రతీకారమే చేయఁదగినది. ఓసీ! బుద్ధిమతికా! పాంచాలిని జతికడకుఁ దీసికొని రమ్ము. నేనును వచ్చుచున్నాను.

చేటి:—ఆర్యులారా! రక్షింపుఁడు. రక్షింపుఁడు.

కంచు:—భద్రా! ఈమాట దేవియన్న యగుధృష్టద్యుమ్నునకుఁ గాని నకులసహదేవులకుఁగాని చెప్పుము. లేనిచో నీస్థితిలో నున్నమహారాజును రక్షింపఁగలుగువా రెవరు? భీమార్జును లస్తమించిరిగదా!

(తెరలోఁ గలకలము. తరువాత.)

ఓశమంతపంచకసంచారులారా! రక్తపానేచ్ఛ గలరాక్షస పిశాచభూతభేతాళకంకగృధ్రజంబుకోలూకవాయసములకు దక్కఁగా మిగిలినయోధులారా! నన్నుఁ జూచి యిట్లు భయపడుదురేల? యాజ్ఞసేని యెట నున్నదో నాకుఁ జెప్పుఁడు. ఆమె కానవాలు చెప్పుచున్నాను. వినుఁడు:

చ. తొడ యొకచేతఁ గొట్టుకొను
తొందరలోఁ గురురాజు లీలఁ జూ
పిడఁ, బయి దుస్ససేనుఁ డతి
హీనత నొల్చియు నంబరంబు లా

బిడయలి వేణి నీడ్వఁ గచ
భిన్నత నొ ప్పటియున్న సాధ్వి యె
క్కడఁ గలదో యొటుండెనొ ప్ర
కాశము చేయుఁడు నాకుఁ జెచ్చెరన్. ౕ౫

కంచు:—దేవీ! యాజ్ఞసేనీ! నీ విప్పుడు సైతము రక్షాశూన్యవై కురుకులకలంకునిచేఁ బరిభవము నందుచున్నావుగదా!

యుధి:—(తటాలున లేచి) పాంచాలీ! భయపడకు. భయపడకు. ఎవ రక్కడ? సజ్జిత మైనరథము నిటు తెమ్ము. దురాత్మా! దుర్యోధనహతకా! రా రమ్ము. నీగదాకౌశలమున నీకే ర్పడినమహాగర్వ మిపుడే బాణపరంపరల నణంచెదనురా. ఓరీ! కురుకులవినాశకా!

గీ. మును జరాసంధుఁ జంపినయనుజుఁ; గుపిత
హరకిరాతవిద్వేషుని బరిగణించి
నీకువలె కూయిసైపోయి నిలువలేను;
జాలిచే నిన్నుఁ జంపంగఁ జాల నోరి! ౩౬

(గదాపాణియు క్షతజసిక్తసర్వాంగుఁడు నైనభీమసేనుఁడు ప్రవేశించును.)

భీమ:—(ఉద్ధతుఁడై పరిక్రమించి) ఓహో! శమంతపంచకసంచారులగు సైనికులారా! ఎందుల కీయావేగము?

ఉ. భూతమఁ గాను, రాక్షసుఁడ
బొత్తిగఁ గాను, విరోధిరక్తసం
పాతశరీరుఁడన్, శపథ
వార్నిధి దాఁటినక్షత్త్రియుండ; నీ

రీతిని బాఱి చచ్చిన క
్రవ్రజఘోటక దేహరాజిలో
భీతిని దాఁగుకొందు రిసి
వీరరణానలదగ్ధశేషులై. 32

పాంచాలి యెట నున్నదో మీరు నాకుఁ జెప్పుఁడు.

కంచు:—దేవీ! పాండుస్నుషా! లెమ్ము. లెమ్ము. త్వరగాఁ జితిఁ బ్రవేశించుట మేలు.

ద్రౌప:—ఏమి? నే నింకను జితిని సమీపింపకుందునా? (సమీపించును)

యుధి:—ఎవఁడురా యక్కడ? సజ్జితధనువును దెమ్ము. ఎవరును బరిజనులు లేరే? పోనిమ్ము. బాహుయుద్ధమున నైన దురాత్ముఁ డగునీతనిని గాఢముగాఁ గౌఁగిలించుకొని మండుచున్న యీయగ్నికుండమునఁ గూల్చెదను. (అందుకు నడుముకట్టి సిద్ధపడును)

కంచు:—దేవీ! పాండురాజుకోడలా! దుశ్శాసనుఁడు లాగి విడిచిన యీకురు లిపుడు కంటికి కష్టపడుచున్నవి. నీవే ముడుచుకో! ప్రతీకారాశ భగ్నమైనదికాదా! చితిని ద్వరగాఁ జేరుము.

యుధి—దేవీ! వలదు. వలదు. దుర్యోధనహతకుఁడు చావకుండ నీకురులు ముడివేసికొనవలదు.

భీమ—పాంచాలీ! నేను బ్రతికియుండఁగా దుశ్శాసనుఁడు లాగి విడిచిన నీకురులను నీచేతితో ముడివేసికొనవలదు.

చ. రిపువధ కేమిలే నిజప
రిస్థితి చెప్పు బకాసురారివే ?
కపటము కాదుకా ? నిజము
గాఁ బ్రియసోదరరత్న మాదువే ?

భీమ:—ఆర్యా ! ఔను.

యుధి:—విపుల జరాసుతాగ్రణి వి
భీతక వక్షపు నెత్రు చెర్వులో
రెపరెపలాడి యాతని హ
రించిన వీరుఁడ వీవె? చెప్పుమా ! ౪౦

భీమ:—ఆర్యా! అవును. ఒక్క క్షణము నన్ను విడువుఁడు.

యుధి:—ఇంకను సశేష మేమైనఁ గలదా ?

భీమ:—మంచిన శేషమే యున్నది. ఇదే దుర్యోధన దుశ్శాసనరక్తముతోఁ దడిసియున్న చేతులతో దుశ్శాసనుఁడు విడఁగొట్టిన పాంచాలి కేశపాశమును ముడివేయవలయును.

యుధి:—ఐనచో సత్వరమే కానిమ్ము. ఆతపస్వినికి వేణీసంహార మహోత్సవము జరుగుఁగాక !

భీమ:—దేవీ! పాంచాలీ! రిపుక్షయ మైనది. నీ విఁక వర్ధిల్లుము.

ద్రౌప:—(సమీపించి) దేవా! జయము. జయము. (భయపడును)

భీమ:—రాజపుత్త్రి! నన్నుఁ జూచి భయపడకుము. ఏలన:

ఉ. ఏపశుతుల్యరాజు నిను
నీడ్చెనొ కొప్పును బట్టి నాఁడు త
త్పాపిని జంపి రక్తమును
బానము చేసితి; నంటు చేతులన్;

జూపుదుఁ దాఁకు మియ్యెడిమె
సూ కురురాజుతోఁడల్ గదఁ దగఁ
రూపఱఁజేసి మేనునకు
రుద్దిననెత్తురు సంతసంబునన్. ౪౧

బుద్ధిమతికా! పాండవపత్నిని బరిహసించిన భానుమతి యెట నున్నదే! పోనిమ్ము. ఓయజ్ఞవేది సంభవీ! యాజ్ఞసేనీ!

ద్రౌప:—నాథా! చెప్పుము.

భీమ:—("చ. గిరగిరఁ ద్రిప్పుకొంచు గద" అను పద్యము మరలఁ జదివి)
ఆవేళ నే నన్నమాట మఱవలేదుకదా!

ద్రౌప:—మఱవలేదు. నాథా! అది యనుభవమే యైనది.

భీమ:—(ద్రౌపది వేణిని ముడుచుచు) దుశ్శాసనునిచే విడివడి ధార్తరాష్ట్రులకుఁ గాళరాత్రి యైన యీ వేణి నిఁక నీవే ముడుచుకొనుము.

ద్రౌప:—ఈపని యీమధ్య మఱచితిని. నీదయవలన మరల నేర్చుకొనెదను.

భీమ:—(వేణిని ముడివేయును)

(తెరలో)

మహాసమరానలదగ్ధశేషు లగు రాజులకు శుభ మగుఁగాక!

శా. వేణీసంవరణోత్సవంబునకుఁ బృ
థ్వీమండలిం గల్గురా
జానీకంబులఁ ద్రుంచి యంతిపురముల్
సన్మక్తకేశాకరం

బాన· శ్లిపునఁ జేసి పాండుసుతు లాఁ
ప్వారంగఁ దన్మూలమా
వేణీసంవరణం బిటుల్ జరిగె; పృ
థ్వీవరాత పెంపారుతఁ ! ౭౨

యుధి:—దేవీ! ఇదే యంతరిక్ష చరు లగు సిద్ధజనులుఁ వేణీసం హారోత్సవమున ని న్నభినందించుచున్నారు.

(కృష్ణార్జునులు ప్రవేశింతురు.)

కృష్ణు:—(యుధిష్ఠిరుని సమీపించి) సర్వశత్రుమండలము జయించి సానుజుఁ డైనపాండుకులచంద్రుఁడు యుధిష్ఠిరమహారాజు నకు జయమగుఁగాక !

అర్జు:—ఆర్యా! జయము. జయము.

యుధి:—(చూచి) ఏమి! భగవంతుఁ డగుపుండరీకాక్షుఁడు వత్స యర్జునుఁడునా యీ వచ్చినది! భగవానుఁడా! వందన ములు. వత్సా! అర్జునా! నన్నుఁ గౌఁగిలించుకొనుము.

అర్జు:—(నమస్కరించును.)

యుధి:—(కృష్ణునితో) భగవానుఁడా! పరమేశ్వరుఁడు పురాణ పురుషుఁడు నగు శ్రీమన్నారాయణుఁడే స్వయముగా శుభ ములు కోరుచుండ నాకు విజయముగాక మఱి యేమగును?

చ. గురుమహదాదివృత్తు లొన
గూడినమూర్తిని, సర్వసృష్టి సం
భవహరహేతుభూతు, నజు,
భావన కందని వాని, నెన్నఁడున్

మరణము లేనినిన్ను నొక
మాఱు తలంచినమాత్ర దుఃఖముల్
తోరఁగునటన్న దర్శనపుఁ
దోయధి మున్గినఁ జెప్ప నేటికిన్. ౮౩

(అర్జునుని గాఁగిలించుకొని) వత్సా! నన్నుఁ గాఁగిలించుకొనుము.

కృష్ణు:—మహారాజా! యుధిష్ఠిరా!

సీ. వ్యాసవాల్మీక్యాది పరమర్షి చంద్రముల్
విచ్చేసియున్నారు వేడ్క మీఱ
మాద్రీసుతులఁ గూడి మహితధృష్టద్యుమ్న
సేనాధిపతులు వచ్చిరి ముదమున
మాగధకులమున మాత్స్యకులంబున
యాదవకులమున నలరు నిఖిల
రాజగణంబులు పూజనీయులు విధే
యత వచ్చియుండిరి హితమతు లయి

గీ. తీర్థ జలకలశంబులఁ దెచ్చి భుజము
లందునన్ నిల్పుకొని మోద మందుచుండి
నీకు రాజ్యాభిషేకంబు నెఱప మిగులఁ
దహతహంపడుచుండిరి ధర్మరాజ! ౮౪

చార్వాకుఁ డను రాక్షసుఁడు మునివేషమున వచ్చి నిన్ను వంచించినసంగతి నేను వ్యాసమునివలనఁ దెలిసికొని, త్వరితగతి నర్జునునితో విచ్చేసితిని.

యుధి:—ఏమి? మమ్ముఁ జార్వాకుఁడు వంచించెనా?

భీమ:—(కోపముతో) ఏమీ! ఆపాపాత్ముఁ డగు దుర్యోధన సఖుఁ డార్యుని చిత్తవిభ్రమము కలిగించి యెట నున్నాఁడు?

కృష్ణు:—ఆతనిని నకులుఁడు సంహరించెను. రాజా! నీ కిఁక నే నేమిప్రియ మొనగూర్తును ?

యుధి:—భగవంతుఁడా! పుండరీకాక్షా! నీకృప నా కేమి యొసఁగలేదు? నేను నిన్ను సామాన్యదృష్టితోఁ జూచియుంటిని. మన్నింపుము. దేవా !

చ. అరికుల మెల్ల నాశనము నందఁగఁజేసితి మేము నీకృపకు
గర మవలీల; ద్రౌపదియుఁ గాంచె నికారసముద్రతీరముం;
బరమకృపాసముద్రుఁడవు భాషణ సేయుదు వంతె కాని ని
న్నరసెడివారికిఁ గోరికలు నవ్యము గల్గునె వేయు నేటికిం.

ఐనను, భగవానుఁడా! ఇట్లగుఁగాక !

భరతవాక్యము

శతవర్షంబులు పూర్ణకాములును సుస్వాంతాత్ములై మానవుల్
ద్వితయానన్విత తావకీన శుభభక్తిం గాంచుతుగా కెంతయుం;
సతతంబుం సుకృతాత్ములై నృపులు శశ్వన్మంగళానక్తిఁ బూ
జ్యత విద్వద్గుణరక్తిఁ బ్రోచెదరుగా కానందులై లోకులం.

కృష్ణు:—తథాస్తు. (అందఱు నిష్క్రమింతురు)

ఇది షష్ఠాంకము. సర్వము సమాప్తము

శ్రీ శ్రీ శ్రీ